శుక్రవారం
17-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 26
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## బల పరీక్షలో నెగ్గిన ఫ్రాన్స్ ప్రధాని

పారిస్: ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను తన బలాన్ని నిరూపించుకున్నారు. బలహీనంగా ఉన్న తన కొత్త ప్రభుత్వాన్ని కుల్చేందుకుగాను గురువారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో నెగ్గారు. దీంతో పరిపాలన సాగించేందుకు అడ్డంకులు తొలగాయి కానీ ఆ మార్గం మరిన్ని క్లిష్టమైన సవాళ్లభరితంగా ఉండనున్నది. పార్లమెంటులో శక్తిమంతమైన... విభజిత దిగువ సభలో ఈ ఏడాది చివరికల్లా బడ్జెట్-2026ని ఆమోదించడం సులువు కాదు. సెబాస్టియన్ విశ్వాస ఓటు పొందగలగడంతో వెంటనే నేషనల్ అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితుల నుంచి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ఊరట లభించినట్లు అయింది.

## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఉపశమనం

గువహతి: ఆర్ఎస్ఎస్ కార్యకర్త దాఖలు చేసిన పరువు నష్టం కేసులో లోక్‌సభ ఎంపీ రాహుల్ గాంధీకి గువహతి హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఈ వ్యవహారంలో కింది కోర్టు ఉత్తర్వులను కొట్టి వేసింది. అదనంగా సాక్షులను చేర్చేందుకు అనుమతిచ్చింది. క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై విచారణ క్రమంలో తాజా ఉత్తర్వులను జస్టిస్ అరుణ్ దేవ్ చౌదరి ఏకసభ్య ధర్మాసనం జారీ చేసింది. అదనంగా ముగ్గురు సాక్షుల లిస్టింగ్‌కు నిరాకరిస్తూ 2023 మార్చిలో ట్రయిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ (రాహుల్) పార్లమెంటు

- మిగతా 2 లో

## 60 కుటుంబాలు సీపీఐలో చేరిక

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న సీపీఐకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో సుజాతనగర్ మండలం, సింగభూపాలెం గ్రామానికి చెందిన 60 కుటుంబాలు గురువారం సీపీఐలో చేరాయి. నల్లవెల్లి ఏసురత్నం, ధీట్ల ఇమ్మానియేలు, గోరంట్ల వేణు, తంబళ్ళ సన్నీ, కల్లో డేవిడ్ రాజు, మైపా రాజు, దారా దేవదానం, శెట్టి అరుణ భీమాల వసంత, పురేటి సామేలు నాయకత్వంలో

- మిగతా 2 లో

## ఇరుగు పొరుగుకు సెగ
### నారా లోకేశ్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖలో గూగుల్ పెట్టుబడులపై మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. 'ఏపీ వంటకాలు ఘాటు ఎక్కువని అంటారు. మన పెట్టుబడులు కూడా అలాగే ఉన్నాయి. ఆంధ్రా పెట్టుబడులకు కారం ఎక్కువే. కొంతమంది పొరుగువారికి ఇప్పటికే ఆ సెగ తగులుతోంది' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు ఎండు మిరపకాయ, మంట ఎమోజీలను షేర్ చేశారు. అయితే, ఈ ట్వీట్‌ను మాతృభాష తెలుగులో కాకుండా ఇంగ్లీషులో చేయడంతో రాష్ట్రంలోని ప్రత్యర్థి పార్టీలను

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

### స్థానిక ఎన్నికల్లో పోటీకి
# ఇద్దరు పిల్లల రూల్ ఎత్తివేత

- మెట్రో రెండవ దశపై కమిటీ
- పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు
- హ్యామ్ మోడ్‌లో 5,566 కి.మీ. రోడ్ల నిర్మాణానికి పచ్చ జెండా
- కేబినెట్ కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వానాకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని... కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని... ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

- రాష్ట్రంలో కొత్తగా మూడు అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటు కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హుజూర్ నగర్, కొడంగల్, నిజామాబాద్ లో అగ్రికల్చర్ కాలేజీలు నెలకొల్పుతారు.
- రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన -ప్రజా విజయోత్సవాలను డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. ఉత్సవాల నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తారు.
- ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్ కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.
- నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది.
- హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో2ఎ, 2బి, విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎస్ ఛైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అడ్వయిజర్ అధికారుల కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.
- రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడతారు.
- ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.
- కృష్ణా-వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర తీర్మానం చేసింది. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ కేబినెట్ నిర్ణయించింది.

## పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఎస్ఎల్‌పీ కొట్టివేత
### తెలంగాణ సర్కార్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ
### హైకోర్టు స్టేను సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం

విశాలాంధ్ర-హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపెట్టింది. రాష్ట్ర హైకోర్టు విధించిన స్టేను సమర్థించింది. రిజర్వేషన్లు 50 శాతం దాటడం రాజ్యాంగ విరుద్ధమని కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఎస్ఎల్‌పీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు జీవోపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఎస్టీ ప్రాంతాలలోనే రిజర్వేషన్ల పెంపునకు మినహాయింపులు ఉన్నాయి కదా అని ప్రభుత్వం తరపు న్యాయవాదిని నిలదీసింది. తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ రిజర్వేషన్లు నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదించలేదని, అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాయని కోర్టు దృష్టికి తెచ్చారు. శాస్త్రీయంగా కులసర్వే నిర్వహించామని, డేటా బేస్ ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించుకోవచ్చని ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పకడ్బందీగా సర్వే నిర్వహించినా గవర్నర్ ఈ బిల్లును పెండింగ్‌లో పెట్టడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఏకాభిప్రాయంతో ఆమోదించిన బిల్లును పెండింగ్‌లో పెట్టారని పేర్కొన్నారు. బిల్లును సవాల్ చేయకుండా... బిల్లు ద్వారా విడుదల చేసిన జీవోను సవాల్ చేశారన్నారు. రిజర్వేషన్లు పెంచుకునేలా ఇందిరా సహాని కేసులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చారు. సుప్రీంకోర్టు విధించిన ట్రిపుల్ టెస్ట్ కండిషన్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని, డెడికేటెడ్

- మిగతా 2 లో

## మరో జడ్జిపై చెప్పు దాడి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన ఘటన మరువక ముందే అలాంటి మరో ఘటన గుజరాత్‌లో జరిగింది. 1997 నాటి ఘటనపై విచారణ సందర్భంగా అహ్మదాబాద్ కోర్టులో అడిషనల్ ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జిపై ఓ వ్యక్తి చెప్పు విసిరాడు. నలుగురు నిందితులకు 2017లో మెట్రోపాలిటన్ కోర్టు విముక్తి కల్పించింది. కింది కోర్టు తీర్పును సెషన్స్ జడ్జి సమర్థించారు. దీంతో ఆ వ్యక్తి కోపంతో ఊగిపోయారు. కూరగాయాలు కొనేందుకు వెళ్లిన తన తండ్రికి క్రికెట్ బంతి తగిలితే, ఘర్షణకు దిగి తీవ్రంగా గాయపరిచారని, వారిని నిర్దోషులంటూ ఎలా విడిచిపెడతారని నిలదీశారు. కోర్టులో గందరగోళం సృష్టించారు. న్యాయాధికారిని దూషించారు. దీంతో కరంజ్ పోలీసు స్టేషన్ నుంచి పోలీసులు కోర్టు రూమ్‌కు చేరుకుని, జడ్జిపై చెప్పు విసిరిన వ్యక్తిని నిర్బంధించారు. న్యాయమూర్తి ఎలాంటి చర్యలు తీసుకోవద్దని చెప్పడంతో ఆయనను విడిచిపెట్టారు. ఈ ఘటనను గుజరాత్ న్యాయ సేవల సంఘం తీవ్రంగా ఖండించింది. న్యాయాధికారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది.

## మావోయిస్టు ఆశన్న లొంగుబాటు

### అదేబాటలో 170 మంది అన్నలు

విశాలాంధ్ర-(చింతూరు): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ రూపేశ్ జనజీవన స్రవంతిలో కలిశారు. ముగ్గురు డివిజన్ కార్యదర్శులు, ఐదుగురు దండకారణ్యం జోనల్ కమిటీ సభ్యులు, 20మంది డీవీసీ సభ్యులు సహా 169 మంది పోలీసుల ముందు లొంగిపోయారు. శుక్రవారం చత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో జగదల్‌పూర్‌లో అధికారికంగా లొంగిపోనున్నారు. 70కిపైగా ఆయుధాలు అప్పగించనున్నట్లు సమాచారం. ఇటీవల మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరు లొంగిపోతున్న సంగతి విదితమే.

బుధవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ భూపతి 60మంది కేడర్‌తో కలిసి లొంగిపోగా, ములుగు జిల్లా పోలోనిపల్లికి

- మిగతా 2 లో

## వీకేఓసీ ప్రైవేటీకరిస్తే ఉద్యమం

### దేశ సంపద కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ
### కార్మిక హక్కులకు భంగంకలిగిస్తే ఊరుకోం: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: కొత్తగూడెం పరిధిలో నూతనంగా ప్రారంభం కానున్న వీకే ఓపెన్ కాస్ట్ (వీకేఓసీ) ఉపరితల గని బొగ్గు వెలికితీత పనులను గుత్తేదారులకు అప్పగిస్తే ఉద్యమాలు తప్పవని సింగరేణి సంస్థ అధ్వర్యంలోనే బొగ్గు వెలికితీత పనులు చేపట్టాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఏఐటీయూసీ అధ్వర్యంలో గురువారం వీకే కోల్ మైన్, పీవీకే 5 బీ గనుల్లో పిట్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి ప్రైవేటీకరణ అంటే మక్కువని విమర్శించారు. తన గుజరాత్

- మిగతా 2 లో

## సీఎం మినహా మంత్రులంతా ఔట్

### గుజరాత్‌లో అనూహ్య రాజకీయ పరిణామం

అహ్మదాబాద్: గుజరాత్ రాజకీయాల్లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసం గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తప్ప మిగతా 16 మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పటేల్ గవర్నర్‌ను కలిశారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కొత్త కేబినెట్ కొలువుదీరనుంది. ప్రస్తుత గుజరాత్ మంత్రివర్గంలో సీఎం భూపేంద్ర పటేల్ సహా 17 మంది మంత్రులు ఉన్నారు. ఇందులో ఎనిమిది మంది కేబినెట్ స్థాయి మంత్రులు, మరికొందరు సహాయ మంత్రులుగా ఉన్నారు. "గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు విస్తరించనున్నారు" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. కొత్త కేబినెట్‌లో కొత్తగా 10 మందికి చోటు దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత మంత్రులలో దాదాపు సగం మందిని మార్చవచ్చని చెబుతున్నారు. ధర్మేంద్రసిన్హ్, రిషికేశ్ పటేల్, ముకేష్ పటేల్, భూపేంద్రసింగ్ చుడాసమా వంటి మంత్రులు కేబినెట్‌లో కొనసాగే అవకాశం ఉందని... కనుభాయ్ దేశాయ్ (ఆర్థిక), రాఘవ్‌జీ పటేల్ (వ్యవసాయం), కున్వర్జీ బవలియా (నీటి సరఫరా), మురుభాయి బెరాను కేబినెట్ నుంచి ఉద్వాసన పలికే అవకాశం ఉందని అంటున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర బీజేపీ సీనియర్ నాయకులు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కానున్నారు. గురువారం నాటికి బీజేపీ అందరూ ఎమ్మెల్యేలు గాంధీనగర్‌కు చేరుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మొత్తం 182 మంది శాసనసభ్యులు ఉన్న గుజరాత్ అసెంబ్లీలో 27 మంది మంత్రులు

- మిగతా 2 లో

## పెనుదుమారం

- గన్‌తో బెదిరించాడని ఓఎస్డీపై మంత్రి ఫిర్యాదు
- సుమంత్ కోసం పోలీసుల గాలింపు
- బాధ్యతల నుంచి తప్పించిన ప్రభుత్వం
- మా అమ్మను మంత్రి పదవి నుంచి తప్పించే కుట్ర: కొండా సుస్మిత
- మీడియా ముందుకెళ్లొద్దు: సురేఖకు మీనాక్షి ఫోన్

విశాలాంధ్ర - హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ వ్యవహారం ప్రస్తుతం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఏకంగా ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పెనుదుమారం రేపాయి. ముఖ్యంగా ఉదయం నుంచి మంత్రి ఇంటి వద్ద హైడ్రామా నడుస్తోంది. మంత్రి ప్రైవేట్ ఓఎస్డీ సుమంత్‌పై అవినీతి ఆరోపణలు నేపథ్యంలో అతడిని బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

- మిగతా 2 లో

### బీహార్ ఓటర్ల జాబితాలో
# తప్పులు సరిదిద్దండి

- ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు సూచన
- తదుపరి విచారణ నవంబరు 4కు వాయిదా
- ఎస్ఐఆర్ కచ్చితమైన ప్రక్రియ- ఒక్క ఫిర్యాదు రాలేదు: ఈసీ

న్యూఢిల్లీ: బీహార్-ఎస్ఐఆర్‌తో రూపొందిన ఓటర్ల తుది జాబితాలో అక్షర దోషాలు, ఇతర తప్పులన్నీ సరిదిద్దాలని ఎన్నికల సంఘాన్ని గురువారం సుప్రీం కోర్టు ఆదేశించింది. పొరపాట్లు జరగకుండా జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించింది. ఎన్నికల పారదర్శకతపై కచ్చితమైన వైఖరితో ముందుకెళ్లాలని పేర్కొంది. బీహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన న్యాయ అంశాలపై విచారణను నవంబరు 4న చేపడతామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం

- మిగతా 2 లో

# ఇజ్రాయిల్‌తో మళ్లీ దాడులు చేయిస్తా

## హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: గజాలో శాంతికి తన ప్రతిపాదన మొదటి దశ మొదలై బందీల అప్పగింత సాగుతున్న వేళ హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ హెచ్చరిక చేశారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడకపోతే ఇజ్రాయిల్ మళ్లీ గజాలో దాడులు జరిపేందుకుగాను ఇజ్రాయిల్‌కు అనుమతి ఇస్తానని బెదిరించారు. నిరాయుధీకరణకు హమాస్ నిరాకరించిన క్రమంలో ఆయన ఇలా స్పందించారు. 'దారికొస్తే సరి లేదంటే గజా వీధుల్లో మళ్లీ ఇజ్రాయిల్ సైన్యం మోహరిస్తుంది. దాడులు చేస్తుంది' అని ఫోన్‌లో ట్రంప్ హెచ్చరించారు. హమాస్ పూర్తిగా నిర్వీర్యం కావాలన్నది అమెరికా కోరుకుంటోంది.

**వెనిజులాలో కోవర్టు ఆపరేషన్లకు అనుమతి**

కరేబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నౌకలపై ఇఅమెరికా సైన్యం దాడుల నేపథ్యంలో వెనిజులాలో కోవర్టు ఆపరేషన్లకు ట్రంప్ అనుమతిచ్చారు. సీఐఏకి అధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు ఓవెల్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ట్రంప్ వెల్లడించారు. వెనిజులా నుంచి సముద్ర మార్గంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతోందని, దీనిని అడ్డుకోవడంతో పాటు అక్కడి ప్రజలు అమెరికాలో నేరాలకు పాల్పడి జైళ్లలో ఉన్నారని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురోపై చర్యలు తీసుకొనే అధికారం సీఐఏకు ఉందా అనే ప్రశ్నకు ట్రంప్ సమాధానం ఇవ్వలేదు. ట్రంప్ ప్రకటనకు ముందే ది న్యూయార్క్ టైమ్స్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదిలావుంటే కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక యుద్ధ విమానాలను ట్రంప్ యంత్రాంగం ఇటీవల మోహరించింది. ఐదు ఓడలను ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో ప్రాణ నష్టం జరిగినట్లు ట్రంప్ వెల్లడించిన విషయం విదితమే.

**త్వరలో జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ**

దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ కాబోతున్నట్లు ఆ దేశ ట్రజరీ కార్యదర్శి స్కాట్ బిసెంట్ వెల్లడించారు. చైనాతో వాణిజ్య యుద్ధాన్ని తీవ్రతరం చేసే ఉద్దేశం అమెరికాకు లేదని తెలిపారు. ఈ నెలాఖరులో జిన్‌పింగ్‌ను కలిసేందుకు ట్రంప్ సిద్ధమైనట్లు చెప్పారు. రెండు దేశాల మధ్య నిత్యం సంప్రదింపులు కొనసాగుతున్నఆయన్నారు. అమెరికా చర్యలకు చైనావి ప్రతి చర్యలు మాత్రమేనన్న బీజింగ్ మాటలను బీసెంట్ తోసిపుచ్చారు. వాషింగ్టన్‌పై చర్యలు తీసుకునే ఉద్దేశం చైనాకు ముందే ఉందని అన్నారు. చైనా నౌకలపై పోర్టు ఫీజు విధిస్తే అంతర్జాతీయ స్థాయిలో గందరగోళం సృష్టిస్తామని ఆదేశానికి చెందిన కింది స్థాయి వాణిజ్య అధికారి ఆగస్టులో హెచ్చరించారని బిసెంట్ వెల్లడించారు. వాణిజ్య యుద్ధం నేపథ్యంలో జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ కీలకమని అన్నారు.

# భారత్ తరపున అఫ్గాన్ పరోక్ష యుద్ధం: పాక్



ఇస్లామాబాద్: పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై ఇస్లామాబాద్ రక్షణ మంత్రి ఖాజా ఆసిఫ్ భారత్‌పై నిందలు మోపే ప్రయత్నం చేశారు. భారత్ తరపున అఫ్గాన్ తమపై పరోక్ష యుద్ధం చేస్తోందని ఆరోపించారు. సరిహద్దు దాడులకు 48 గంటల కాల్పుల విరమణపై అనుమానం వ్యక్తం చేశారు. కాబుల్ కాకుండా న్యూఢిల్లీ నిర్ణయాలు తీసుకుంటున్నదన్నారు. అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ భారత్ పర్యటపైనా అక్కసు వెళ్లగక్కారు. ముత్తాఖీ పర్యటన వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇతర ఉద్దేశాలను కలిగి ఉందని వ్యాఖ్యానించారు. తాజా ఉద్రిక్తతలను తీవ్రతరం చేయొద్దంటూ అఫ్గాన్‌ను హెచ్చరించారు. ఇదిలావుంటే, కాల్పుల విరమణ సమయంలో నిర్మాణాత్మక చర్చలు జరుపుతామని పాక్ విదేశాంగ శాఖ పేర్కొంది. సానుకూలమైన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. కాగా, సంయమనం పాటించాలని, పాక్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తేనే స్పందించాలని అఫ్గాన్ ప్రభుత్వం తమ సైన్యానికి సూచించింది.

# మడగాస్కర్‌లో సైనిక పాలన

## అధ్యక్షుడిగా ఆర్మీ కల్నల్ మైఖేల్?

అంటానానారివో/నైరోబీ: మడగాస్కర్ నూతన అధ్యక్షుడిగా ఆర్మీ కల్నల్ మైఖేల్ రాంద్రియానిరినా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. అధ్యక్షుడు ఆండ్రీ రాజోలీనా ప్రభుత్వంపై యువతరం తిరుగుబాటుకు సైనిక మద్దతుతో తన ప్రాణాలు కాపాడుకునేందుకు ఆయన దేశాన్ని విడిచివెళ్లారు. ఆ తర్వాత రెండు రోజుల్లో చట్టసభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇది జరిగిన కొద్ది సేపటికే సైన్యం అధికారంలోకి వస్తుందని ఆర్మీ కల్నల్ మైఖేల్ ప్రకటించారు. సైనిక పాలన సాగబోతోందని, పార్లమెంటు దిగువ సభ లేదా నేషనల్ అసెంబ్లీ మినహా అన్ని వ్యవస్థలను రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో నూతన అధ్యక్షుడిగా కల్నల్ మైఖేల్ ప్రమాణ స్వీకారం జరగబోతోందని ఆయనకు సన్నిహిత వర్గాలు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం అధికారుల సమక్షంలో ఆయన అధ్యక్ష పగ్గాలు చేపడతారని తెలిపింది. ఎన్నికలు నిర్వహించే ముందు రెండేళ్ల పాటు సైన్యం నియమిత కమిటీ నాయకత్వంలో ఆపద్ధర్మ ప్రభుత్వం నడుస్తుందని కల్నల్ మైఖేల్ తెలిపారు.

**ఆఫ్రికా దేశాల్లో జెన్‌జీ ప్రకంపనలు**

ఆఫ్రికా దేశాలు జెన్ జీ ఆందోళనలతో హోరెత్తుతున్నాయి. తమ సమస్యలపై యువతరం నిలదీస్తుంటే పాలకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. వారి పీఠాలు కదులుతున్నాయి. అధికారం చేజారిపోతోంది. ఇప్పటికే కెన్యా, మడగాస్కర్‌లో జెన్ జీ ఆందోళనల క్రమంలో పాలకులు అష్టకష్టాలు పడిన విషయం విదితమే. మడగాస్కర్‌లో ప్రభుత్వం కూలింది. సైన్యం అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. మొరొక్కోలోనూ ఇదే దిశగా యువతరం కదులుతోంది. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేసియా దేశాల్లోనూ జెన్‌జీ కలకలం రేపడం తెలిసిందే. జెన్‌జీ అధ్వర్యంలో ఆఫ్రికాలో అనేక ప్రాంతాలు ఆందోళనలు-నిరసనలతో హోరెత్తుతున్నాయి. పార్లమెంటు భవనాలన ముట్టడి, భద్రతా దళాల కాల్పులు జరుగుతున్నాయి. అనేక మంది చనిపోగా వందల మంది గాయపడ్డారు. మడగాస్కర్‌లో రాజోలీనా ప్రభుత్వం కుప్పకూలింది. జెన్ జీ చేపట్టే ప్రతి ఆందోళన వెనుక అక్కడి ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణంగా ఉంటోంది. ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, ఆర్థికపరమైన భరోసా లభించకపోవడంపై ఆఫ్రికా యువత తీవ్ర అసహనానికి గురవుతున్నది. ప్రపంచ దేశాలతో పోల్చితే ఆఫ్రికాలోనే యువ జనాభా అధికం. వారిలో అసంతృప్తి కట్టలు తెంచుకుంటూ పాలకులకు సవాళ్లు విసరుతోంది. ప్రభుత్వాలను కూల్చివేస్తోంది. 19 ఏళ్ల వయస్సులో రాజకీయాల్లోకి వస్తుండటం... బలంగా గళం వినిపిస్తుండటం ఆఫ్రికాలో కనిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బోత్సవానాను పాలించిన పార్టీని యువ ఓటర్లు గతేడాదిలో చిత్తు చేశారు. కెన్యాలో గతేడాది జరిగిన జెన్ జీ ఆందోళనలతో రాజధాని నైరోబీ సహా ప్రధాన నగరాలు స్తంభించాయి. ఆర్థిక బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలతో హోరెత్తాయి. అవినీతి, రుణాలు, అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలపై యువత గళమెత్తగా కెన్యా పాలకులకు ముచ్చెమటలు పట్టాయి. ఇండోనేసియా, నేపాల్, మడగాస్కర్ పాలకులకు తమ బలమేమిటో జెన్‌జీ రుచి చూపించింది. ఈ ఏడాది ఆఫ్రికా కప్ నేషన్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్, 2030 వరల్డ్ కప్ కోసం మౌలిక సదుపాయాలపై అధిక వ్యయం యువతరానికి కోపం తెప్పించింది. దీనికి వ్యతిరేకంగా మొరొక్కోలో జెన్ జీ ఆందోళనలు కొద్ది వారాలుగా జరుగుతున్నాయి. ఆందోళనల్లో ముగ్గురు చనిపోయారు. స్కూలు, ఆసుపత్రులు, మెరుగైన మౌలిక వసతులను డిమాండ్ చేస్తున్నారు.

# సీఎం మినహా మంత్రులంతా ఔట్

(మొదటి పేజీ తరువాయి)

లేదా మొత్తం సభలో 15 శాతం మంది మంత్రులుగా తీసుకోవచ్చు. గుజరాత్ ప్రభుత్వంలో సహాయ మంత్రి జగదీష్ విశ్వకర్మ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ స్థానంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర విభాగానికి కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. భూపేంద్ర పటేల్ డిసెంబర్ 12, 2022న రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. బీజేపీ 2021 మాదిరిగానే తన 'నో-రిపీట్' ఫార్ములాను అమలు చేసే అవకాశం ఉంది. ఇందులో ఉప ముఖ్యమంత్రి నియామకం కూడా ఉంటుందని చెబుతున్నారు. కొత్త మంత్రివర్గంలో ఆరుగురు పాటిదార్ నాయకులు (4 లెవ్వా పటేల్, 2 కద్వా పటేల్), ఠాకోర్, కోలి వర్గాల నుంచి నలుగురు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) నుంచి 2, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) నుంచి 2, ఇద్దరు బ్రాహ్మణులు, ఇద్దరు క్షత్రియ మంత్రులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. దాదాపు నలుగురు మహిళా ఎమ్మెల్యేలకు కూడా కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉంది.

# ఇరుగు పొరుగుకు సెగ

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి కాకుండా పొరుగు రాష్ట్రాలను ఉద్దేశించి అయి ఉంటుందన్న చర్చ జరుగుతోందది. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఏపీలో గూగుల్ పెట్టుబడులపై కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. ఏపీ ఇస్తున్న రాయితీలను తప్పుబడుతూ మాట్లాడారు. దీనిపైనే లోకేశ్ స్పందించి ఈ ట్వీట్ చేశారని భావిస్తున్నారు.

**గూగుల్ వెళ్లడానికి చాలా కారణాలు: ఖర్గే**

గూగుల్ ఏపీకి వెళ్లడానికి చాలా కారణాలు ఉన్నాయని కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. అక్కడి (ఏపీ) ప్రభుత్వం వాళ్లకి రూ.22 వేల కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చిందన్నారు. రాష్ట్ర జీఎస్టీలో 100 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. వాళ్లకు కేటాయించిన భూమి 25 శాతం డిస్కౌంట్‌తో ఇస్తున్నారు. నీళ్లపై టారిఫ్‌లోనూ 25 శాతం డిస్కౌంట్ ఇచ్చారు. ట్రాన్స్‌మిషన్ 100 శాతం ఉచితంగా కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఇవన్నీ వాళ్లు చెప్పరు... గూగుల్ వచ్చింది అని మాత్రమే పత్రికల్లో రాస్తారన్నారు. అన్ని రాయితీలు మేము ఇస్తే... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని అంటారు కదా అని ప్రశ్నించారు. బెంగళూరులో జనావాసం ఎక్కువ అవుతుందని అంటున్నారని, ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేస్తే జనావాసం ఎక్కువ అవుతుంది కదా అని ప్రశ్నించారు.

# రాహుల్‌కు ఉపశమనం

(మొదటి పేజీ తరువాయి)

సిట్టింగ్ సభ్యుడని, 2016 నుంచి నడుస్తున్న ఈ కేసును సత్వరమే పరిష్కరించేందుకు ట్రయిల్ కోర్టు మెజిస్ట్రేట్ చర్యలు తీసుకుంటారని జస్టిస్ చౌదరి వెల్లడించారు. కాగా, 2015, డిసెంబరు 12న రాహుల్ బార్పేట సత్రా (వైష్ణవితే మొనాస్టరీ)ని సందర్శించారు. లోపలికి వెళ్లకుండా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తనను అడ్డుకున్నట్లు ఆయన తర్వాత తెలిపారు. దీంతో ఆగ్రహించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త బోరా ఆయనపై క్రిమినల్ పరువు నష్టం కేసు పెట్టారు. తప్పుడు ప్రకటనలు చేసినట్లు కాంగ్రెస్ అగ్రనేతను నిందించారు. అయితే గువహతి హై కోర్టు తాజా ఉత్వర్వులతో రాహుల్‌గాంధీకి ఉపశమనం లభినట్లు అయింది.

# 60 కుటుంబాలు సీపీఐలో చేరిక

(మొదటి పేజీ తరువాయి)

వీరిందరికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూనంనేని మాట్లాడుతూ ప్రజల పక్షం నిలిచి పోరాటాలు, త్యాగాల ఫలితంగా వందేళ్లుగా ప్రజల్లో సీపీఐ సుస్థిర స్థానం సంపాదించిందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అనునిత్యం శ్రమిస్తున్నానని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ ఘన విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాలని కోరారు.

**'సీఎం రిలీఫ్' చెక్కుల పంపిణీ**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉందని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌'లో 68 మందికి మంజూరైన రూ.33.68 లక్షల విలువైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు.

# పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ ద్వారా సర్వే జరిపి ఎంపరికల్ డేటా సేకరించిందన్నారు. కమిషన్ సిఫారసు ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించామని, బీసీ జనాభా డేటా ఆధారంగానే రిజర్వేషన్లు పెంచామని వివరించారు. ఇంటింటికి తిరిగి సామాజిక, ఆర్థిక, కుల సర్వే నిర్వహించామని, సమగ్రంగా, సాంకేతికంగా సర్వే జరిపామని కోర్టుకు విన్నవించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరిపామని, 94 వేలమంది డేటా సేకరించారన్నారు. భారత్‌లో ఎక్కడా లేని విధంగా సర్వే నిర్వహించినట్లు తెలిపారు. దీనిపైన స్టే ఎలా విధిస్తారని అడిగారు. హైకోర్టు మధ్యంతర తీర్పులో ఎలాంటి సహేతుక కారణాలు లేవని ఆయన కోర్టుకు తెలిపారు. కచ్చితత్వంతో కూడిన డేటా ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి రిజర్వేషన్లు పెంచుకోవచ్చని గౌలి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందన్నారు. అయితే మాధవరెడ్డి తరపు న్యాయవాది మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండకూడదని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. షెడ్యూల్డ్ ఏరియా, గిరిజన ప్రాంతాలలో మాత్రమే 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకునేందుకు అనుమతి ఉందన్నారు. సాధారణ ప్రాంతాల్లో రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచడానికి వీలులేదన్నారు. తెలంగాణలో అలాంటి షెడ్యూల్ ఏరియాలు లేవని కృష్ణమూర్తి కేసులో సుప్రీంకోర్టు ఇదే తీర్పు వెల్లడించిందని పేర్కొన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనూ రిజర్వేషన్ల పెంపును సుప్రీంకోర్టు తిరస్కరించిందని గుర్తు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు... 50 శాతానికి మించకుండా ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వానికి సూచించింది. ట్రిపుల్ టెస్ట్‌లో కూడా 50 శాతానికి మించి రిజర్వేషన్ ఉండదని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని హైకోర్టు చెప్పిన అంశాన్ని సమర్థించింది.

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ సాకారం

## కర్నూలు బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ

విశాలాంధ్ర-సచివాలయం/కర్నూలు: స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ బచత్ ఉత్సవ్ పై ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతమని, చైతన్యం గల యువత ఉన్నారన్నారు. ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉందని తెలిపారు. గత 16 నెలల్లో డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ఏపీలో ప్రగతి వేగంగా జరుగుతోందని తెలిపారు. ఢిల్లీ, అమరావతి రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళు న్నాయని పేర్కొన్నారు. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా వెళుతోందని తెలిపారు. భారతదేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోందన్నారు. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించిందన్నారు. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుందని, విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుందన్నారు.

# చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు: రష్యా

మాస్కో: చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్ రూపంలో భారత్ చెల్లింపులు చేస్తోందని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. ఆ చెల్లింపులు స్వల్ప మొత్తంతో కూడినవిగా చెప్పారు. అధికంగా లావాదేవీలు రూబుల్స్‌లోనే సాగుతున్నట్లు తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల్లో రెండవ స్థానంలో భారత్ ఉంది. సెప్టెంబర్‌లో రష్యా చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలు వెచ్చించగా, ఆగస్టు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ. కాగా ఉక్రెయన్‌తో యుద్ధం క్రమంలో రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షల క్రమంలో భారత్ కొనుగోళ్లు సాగుతున్నాయి. వ్యాపార లావాదేవీల కోసం ప్రత్యామ్నాయ కరెన్సీలు యువాన్, దిర్హమ్ (యూఏఈ కరెన్సీ) వాడకం పెరిగింది.

# తప్పులు సరిదిద్దండి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. ఓటర్ల తుది జాబితా సెప్టెంబరు 30న ప్రచురించామని, అప్పటి నుంచి తమ పేర్లు తొలగించినట్లుగా ఏ ఒక్క ఓటరు ఫిర్యాదు చేయలేదని ఈసీ వెల్లడించింది. ఎన్‌జీఓ అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తరపున న్యాయవాది ప్రశాంత్ భూషన్ వాదిస్తూ... తుది జాబితాలో తన పేరు తొలగించినట్లు ఓటరు ఫిర్యాదు చేయగా, ఇదంతా అవాస్తవమని ఈనెల 7న ఎన్నికల సంఘం తోసిపుచ్చింది కానీ అది నిజమని అన్నారు. ఎంత మంది ఓటర్లను తొలగించారో ఈసీ ప్రకటించాలని, ఓటర్ల జాబితాల పారదర్శకతకు హామీ ఇవ్వాలన్నారు. బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా తొలి దశలో పోలింగ్‌కు వెళ్లే నియోజకవర్గాల్లో శుక్రవారం ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేస్తారని, మిగతా స్థానాల్లో 20వ తేదీన ఈ చర్య తీసుకుంటారని న్యాయస్థానం గుర్తించింది. ముసాయిదా జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలివ్వాలని ఈనెల 7న ఈసీని ఆదేశించింది. ఈ వ్యవహారంలో గందరగోళం నెలకొన్నట్లు తెలిపింది. తాజా విచారణ క్రమంలో ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ బీహార్ ఎస్ఐఆర్ కచ్చితమైన ప్రక్రియ అని అన్నారు. ఈ ప్రక్రియను అవమానించేందుకు పిటిషనర్ రాజకీయ పార్టీలు, ఎన్‌జీఓలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు వాదించారు. బీహార్‌లో ఎస్ఐఆర్ నిర్వహణ నిర్ణయాన్ని సవాల్ చేసే పిటిషన్లు కొట్టివేయాలని కోరారు. స్వప్రయోజనాల కోసమే ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. '90వేల మందికిపైగా బూత్ స్థాయి అధికారులను ఈసీఐ నిమించింది. రాజకీయ పార్టీలనూ ఈ ప్రక్రియలో భాగస్వాములు చేసింది. హెచ్2హెచ్ ఆధారంగా ప్రక్రియ జరిగింది. ఒకటి కంటే ఎక్కువ సార్లు ఇంటింటికి అధికారులు వెళ్లారు. వెబ్‌సైట్లలో సముచిత డేటాను పొందుపరిచారు' అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 3.66 లక్షల మంది పేర్లు తొలగించారన్నాగానీ ఒక్క ఫిర్యాదు రాకపోవడమే ఎస్ఐఆర్ కచ్చికతత్వానికి నిదర్శనమన్నారు. ఓటర్ల మతానికి సంబంధించిన వివరాలు జాబితాల డేటాబేస్‌లో లేనట్లు ఈసీ తెలిపింది. ఎన్యుమరేషన్ ఫారాలు దాఖలు చేయని 65 లక్షల మంది పేర్లు చేర్చలేదని, వీరు చనిపోయి ఉండవచ్చు లేక వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోయి ఉండవచ్చని వెల్లడించింది. తదుపరి విచారణను నవంబరు 4వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. న్యాయ అంశాలపై సర్దుబాటుకు సమయం ఇచ్చింది. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని, ఎన్నికలను సజావుగా నిర్వహిస్తుందని నమ్ముతున్నట్లు సర్వోన్నత ధర్మాసనం పేర్కొంది.

# పెనుదుమారం

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. అతడి కోసం టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. రేవంత్ రెడ్డి సన్నిహితుడు రోహిన్ రెడ్డి కార్యాలయంలో డబ్బుల కోసం సుమంత్ గన్ పెట్టి బెదిరింపులకు పాల్పడినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో సుమంత్‌ను తమ ఇంట్లో కొండా సురేఖ, కూతురు సుస్మిత దాచిపెట్టారు. సుమంత్ ... సురేఖ ఇంట్లో తలదాచుకున్నట్టు సమాచారం అందటంతో మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లినట్టు తెలుస్తోంది. టాస్క్ ఫోర్స్ పోలీసులు సుమంత్ ను అదుపులోకి తీసుకునేందుకు గురువారం తెల్లవారుజామున కొండా సురేఖ ఇంటికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత కలగజేసుకుని తమ ఇంటికి ఎందుకొచ్చారు అంటూ పోలీసులతో గొడవకు దిగింది. నిందితుడు సుమంత్‌ను పోలీసులు అరెస్ట్ చేయకుండా మంత్రి కొండా సురేఖ ... కారులో ఎక్కించుకుని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయినట్లు తెలిసింది. అదే సమయంలో మంత్రి కుమార్తె సుస్మిత... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి లపై సంచలన ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి తమ కుటుంబంపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సుమంత్ దగ్గర గన్ దొరికింది అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు తనకు చూపించండని పోలీసులను నిలదీసింది. నిజంగానే సుమంత్ దగ్గర గన్ ఉంటే, అప్పుడు రోహిన్ రెడ్డిపై కూడా కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం, రోహిన్ రెడ్డి, డెక్కన్ సిమెంట్స్... సుమంత్ నలుగురి ఫోన్ కాల్స్ డేటాను తీయండి, మొత్తం తెలుస్తుందని వాదనకు దిగారు. రేవంత్ రెడ్డి ... మా అమ్మ మంత్రి పదవిని పీకేయాలని చూస్తున్నాడని, సుమంత్‌పై కేసు పెట్టి, దాన్ని తెలివిగా మా అమ్మపై నెట్టి మంత్రి పదవి నుంచి తొలగించాలని చూస్తున్నాడని సుస్మిత ఆరోపించారు. రెడ్డిత్రయం కలిసి బీసీ మంత్రులను అణగతొక్కాలని చూస్తున్నా రని ధ్వజమెత్తారు. ఇది మంచిది కాదు... తాము అన్ని పార్టీల్లో కొట్లాడాము కానీ... సొంత పార్టీతో ఎప్పుడూ కొట్లాడలేదన్నారు. సుమంత్‌కి ఏమైనా హాని జరిగితే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చాడు... ఆ గన్ రోహిన్ రెడ్డి తెచ్చాడు... ఆ గన్ తోనే డెక్కన్ సిమెంట్స్ వాళ్లని డబ్బుల కోసం బెదిరించారని ఆరోపించారు. ఈ విషయంలో మా నాన్నను ఇరికిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వ్యాఖ్యానించారు. రెడ్డి వర్గం అంతా కలిసి మా బీసీల మీద కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పొంగులేటి, వేంనరేందర్ రెడ్డి తమపై కుట్ర చేస్తున్నారని, వాళ్లతో వరంగల్ నేతలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, గుండు సుధారాణి కలిశారని చెప్పారు. బీసీ నాయకులపై కక్షకట్టి మమ్మల్ని ఎందుకు ఇలా చేస్తున్నారో తెలియడం లేదన్నారు. మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకొని మొక్కాలా... గతంలో రేవంత్ రెడ్డి మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టేవాడని ఆరోపించారు. దిల్లీలో ఖర్గేతో సమావేశం జరుగుతుండగా... మా అమ్మను రేవంత్ రెడ్డి తిడితే ఆరోజు మా అమ్మ ఎంతో ఏడ్చిందని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా మంత్రి కొండా సురేఖ భర్త మురళీ మాట్లాడుతూ సుమంత్ వ్యవహారంలో ఏం జరుగుతుందో తెలియదన్నారు. కొండా సురేఖ కార్యాలయానికి తాను ఒక్కసారే వెళ్లానని, అక్కడ ఏం జరుగుతుందో తనకు తెలియదని స్పష్టం చేశారు. రేవంతన్న సీఎం కావాలని తాను, సురేఖ కష్టపడ్డామని, వైఎస్ఆర్ తర్వాత మరో వైఎస్ఆర్ రేవంతన్న అంటూ చెప్పుకొచ్చారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవు, ఎవరైనా సృష్టిస్తే తమ సంబంధం లేదన్నారు. సుస్మితతో ఇప్పుడే మాట్లాడానని, తాను ఇబ్బంది పడ్డానని చెప్పిందన్నారు. అందరి మంత్రుల నిళ్లకు వెళ్లి మాట్లాడే సాన్నిహిత్యం తనకు ఉందని అన్నారు.

**రికార్డులు అప్పగించండి...**

ఇదిలా ఉండగా మేడారం జాతర పనులను రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెండర్ల విషయంలో మంత్రుల మధ్య కొట్లాటతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఒక్కసారిగా మంత్రి కొండా సురేఖ నివాసం వద్ద భద్రత తొలగింపు చర్చనీయాంశంగా మారింది. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న సురేఖ నివాసం వద్ద, మంత్రులకు ఇవ్వాల్సిన కనీస భద్రతతో పాటు ఔట్ పోస్టును కూడా పోలీసులు తొలగించారు. దేవదాయ శాఖ ఫైల్స్ అప్పగించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా... ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని కొండా సురేఖకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఫోన్ చేయడంతో ఆమె సెక్యూరిటీ లేకుండా వ్యక్తిగత వాహనంలో అక్కడికి బయల్దేరడం అనేక అనుమానాలకు తావిచ్చింది. మీడియా ముందుకు వెళ్లవద్దని సురేఖను వారించినట్టు తెలిసింది.

# మావోయిస్టు ఆశన్న లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఆశన్న ఐటీఐ, పాలిటెక్నిక్ చదివారు. 1991లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన ఆయన, 1999లో పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సారథిగా పగ్గాలు చేపట్టారు. అదే ఏడాది హైదరాబాద్‌లో ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్రను పట్టపగలే నడిరోడ్డుపై హత్య చేసిన ఆపరేషన్‌కు ఆయనే నేతృత్వం వహించినట్లు ప్రచారంలో ఉంది. 2వేల సంవత్సరంలో ఏపీ హెూంమంత్రి ఏ మాధవరెడ్డి ప్రయాణిస్తున్న కారును మందుపాతరతో పేల్చేసి చంపేయడం, 2003లో అలిపిరిలో సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ను క్లెమోర్‌మైన్స్‌తో పేల్చి ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిన చర్యలతో ఆశన్న పేరు విస్తృతంగా ప్రచారమైంది.

**ఆయుధాలను వీడండి: అమిత్‌షా**

చత్తీస్‌గఢ్‌లో భారీ సంఖ్యలో 170మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. చత్తీస్‌గఢ్ లోని రెండు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయిందని అన్నారు. బుధవారం చత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు. రెండ్రోజుల్లో మొత్తం 258మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసినట్లు వివరించారు. వీరంతా హింసా మార్గం వీడి రాజ్యాంగంపై విశ్వాసం చూపటాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం నిరంతరం చేస్తున్న ప్రయత్నాల వల్ల నక్సలిజం కొన ఊపిరిపై ఉందన్న సత్యాన్ని ఈ లొంగుబాట్లు చాటుతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. లొంగుబాట్లను స్వాగతిస్తున్నట్లు తెలిపిన ఆయన, ఆయుధాలతో పోరాడేవారికి భద్రతాదళాలే తగిన సమాధానం చెబుతాయన్నారు. జనజీవన స్రవంతిలో కలవాలని తుపాకీతో పోరాటం చేస్తున్నవారికి మరోసారి పిలుపునిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుదముట్టించటానికి కట్టుబడి ఉన్నట్లు అమిత్ షా స్పష్టం చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న చత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఇప్పటికీ దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని, దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వీకేఓసీ ప్రైవేటీకరిస్తే ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లకు దారదత్తం చేయటం ఆయన పరిపాలనలో భాగమన్నారు. ప్రజలకు చెందాల్సిన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కార్మికులతో పాటు ప్రజలు ఐక్యంగా ఈ దుర్మార్గ విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే చర్యలను ఏ మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.గుర్తింపు సంఘం లేవనెత్తిన సమస్యలు, డిమాండ్లపై యాజమాన్యం స్పందించి తక్షణం పరిష్కరించాలని కోరారు. కోల్ బెల్ట్ ప్రాంతాల్లో నూతన భూగర్భ గనుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. లేకుంటే సింగరేణి భవిష్యత్తు పతనమవుతుందన్నారు. యువ కార్మికులు వాంకుడోత్ హీరాలాల్, దేవర సురేష్, ఇస్లావత్ అశోక్, బాలకృష్ణ, అనిల్, రవి, రాములు, లెనిన్, సురేందర్ నాథ్ రెడ్డి తదితరులు కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. వీరికి ఎర్ర కండువాకప్పి యూనియన్లోకి ఆహ్వానించారు.

**సమస్యల పరిష్కారంపై జీఎంతో చర్చ**

జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని కూనంనేని సందర్శించారు. జీఎం శాలేంరాజు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం కార్మికుల సమస్యలు, కార్మిక వాడల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్చించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్రకమిటీ నాయకులు వంగ వెంకట్, జి.వీరాస్వామి, వి. మల్లికార్జునరావు, రమణమూర్తి, గట్టయ్య, సుధాకర్, ప్రసాద్, హుమాయూన్, ఎస్ నాగేశ్వర్రావు, భూక్యా రమేష్, బండారు మల్లయ్య, రాంచందర్, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి తదితరులు ఉన్నారు.

**కోర్టు భవన సముదాయాలకు అనుమతి**

జిల్లా కోర్టు నూతన భవనసముదాయాల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే కూనంనేని ... నూతన నిర్మాణాల కోసం చేసిన కృషి ఫలించింది. టెన్ ప్లస్ టూ జిల్లా కోర్టు భవనాలు, పోక్సో అండ్ ఫ్యామిలీ కోర్టులతో సహా నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్ అండ్ బి, రాష్ట్ర ఆర్కిటెక్ట్ వింగ్ నుంచి సత్వరమే చర్యలు ప్రారంభమయ్యాయి. రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. సరే& నెంబరు 143 లో 10 ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. ఆర్ అండ్ బి శాఖ ఇప్పటికే టెండర్లు ప్రకటించింది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసికొని నిర్మాణాలు చేపట్టనున్నారు.

## రేపు రాష్ట్ర బంద్‌కు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ఈనెల 18వ తేదీన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు జరపాలని హైకోర్టు ఇచ్చిన స్టే ఎత్తివేయాలని కోరుతూ బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగు తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, ఈ బందులో వ్యాపార వాణిజ్య విద్యాసంస్థలు అన్ని వర్గాల ప్రజలు సహకరించి బందులో పాల్గొనాలని జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కలిందర్ అలీఖాన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, చాద మహేందర్ రెడ్డి, పూజారి రామన్న, నాయకులు, ఎగుడ మొండి, సిరికొండ రాయమల్లు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నవ సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి: డీఎస్పీ

విశాలాంధ్ర - ఇల్లందు: మత్తు పదార్థాల రహిత నవ సమాజ నిర్మాణం కోసం యువత యాంటీ డ్రగ్స్ వారియర్లుగా నిలవాలని ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గోవింద్ సెంటర్ నుండి జగదాంబ సెంటర్ వరకు 'డ్రగ్స్ పై యుద్ధం' అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ఏ మార్పు జరగాలన్నా, ప్రగతి సాధించాలన్నా, నవ సమాజ నిర్మాణంలోనూ యువత పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. అందుకే డ్రగ్స్ వ్యతిరేక యుద్ధంలో భాగస్వాములు కావాలన్నారు. మత్తు అనే మహమ్మారికి యువత బానిసలైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు మనుషుల జీవితాలను నాశనం చేస్తాయన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, ప్రజల సహకారం లేనిదే మత్తు పదార్థాల నివారణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, రవీందర్, ఎస్ఐలు సూర్యం, హసీనా, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని క్రైస్ట్ స్కూల్ వద్ద మంచిర్యాల నుండి మందమర్రి వైపు వెళ్లే జాతీయ రహదారిపై బీమా సుధాకర్ (65) ఆ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ ఐ జి.రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం బీమా సుధాకర్ కిరాణం షాపుకి వెళ్లి తన ద్విచక్ర వాహనం పై ఇంటికి వస్తుండగా అదే సమయంలో మందమర్రి నుండి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఆటో వేగంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న మృతుడి బావాయి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు చనిపోయాడని నిర్ధారించారు. మృతుడి బావాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## ప్రభుత్వ శాఖల పేర్లు చెప్పి వసూళ్లు

విశాలాంధ్ర-మేడిపల్లి: ప్రైవేట్ హాస్పిటల్స్, స్కూల్ సంబంధించిన అనుమతి పత్రాలు ఎన్ఓసీలు సరిగ్గా లేవని అపరిచిత వ్యక్తి బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి అతనిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం... మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాచవాని సింగారం మణిదీప కాలనీలో ఉండే వ్యక్తి మహ్మద్ జుల్ఫర్ నాయన్ తండ్రి మహమ్మద్ ఒజయిర్ (36) వృత్తి ప్రైవేట్ జాబ్ సొంత గ్రామం మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లికి చెందిన అతను రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు జీహెచ్ఎంసి, డిఎంహెచ్ఓ, ఫైర్ డిపార్ట్మెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుండి వచ్చానని ఆసుపత్రులు, విద్యాసంస్థల అనుమతి పత్రాలు సరిగ్గా లేవని ఎన్ఓసీలు లేవని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చేస్తున్నట్లు నిర్ధారణ అయిందని, అతనిపై అనేక పోలీస్ స్టేషన్లలో వివిధ కేసులు నమోదు అయ్యాయని సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

## విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి: కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్య సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని కురవి మండలం నేరడ గ్రామంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, స్టడీ రూమ్స్, తరగతి గదులు, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదిలో జరుగుతున్న విద్యా బోధనలను స్వయంగా పిల్లల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ డిజిటల్ తరగతులు, ద్వారా ప్రతీ సబ్జెక్టు మీద పిల్లలవిద్యా సామర్థ్యాలను పెంపొందించాలని, అందుకు అనుగుణంగా సంబంధిత టీచర్స్, పిల్లల హాజరు శాతం పెంచాలని అన్నారు. డైట్ మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన, ఆహారాన్ని అందించాలని, తాజా కూరగాయలు, స్వచ్ఛమైన ఆహార పదార్థాలతోనే బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, సిద్ధం చేయాలని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పిల్లల హెల్త్ ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించాలని వారి ఆరోగ్య మానసిక సమస్యలపై కౌన్సిలింగ్ ఇవ్వాలని, వసతి గృహంలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండే చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాలు,అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారులు తహసీల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ ద్వారా మూడు రోజులు అన్ని వసతి గృహాలను తనిఖీలు పరిశీలనలు చేశారన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక వసతి గృహం స్పెషలాఫీసర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి భూసేకరణ పూర్తిచేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: జాతీయ రహదారి భూసేకరణ పెండింగ్ పనులు ఈ నెల 24లోపు పూర్తిచేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథని పాత పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళ కుట్టు మిషన్ శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రం కుట్టు సెంటర్‌ను ప్రారంభించారు. మంథని పట్టణంలోని పురపాలక కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం,సంగీత కళాశాల, డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, ఎన్.హెచ్. 163జి మంచిర్యాల వరంగల్ నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి మన జిల్లాలో భూ బదలాయింపు చివరి దశకు చేరుకుందని పెండింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. మంథని పట్టణంలో చేపట్టిన అంతర్గత సి.సి రోడ్లు, డ్రైయిన్లు, స్ట్రీట్ లైట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. వయోవృద్ధులకు అనుకూలంగా ఉండే విధంగా డే కేర్ సెంటర్ ఏర్పాటు పనులను వారం రోజులలో పూర్తి చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పెద్దపల్లి కలెక్టర్ వెంట ఆర్.డి. ఓ .సురేష్ , మున్సిపల్ కమిషనర్ మనోహర్,పి.డి.ఎన్.హెచ్ కీర్తి భరద్వాజ్,మెగా ఏజెన్సీ ప్రతినిధులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్‌కు సహకరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ /తొర్రూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ తో బీసీ సంఘాలు 18 న రాష్ట్ర బంద్‌కు పిలుపు నిచ్చిన బీసీ సంఘాల బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, బంద్‌కు తొర్రూర్ పట్టణ వ్యాపార వాణిజ్య విద్యా సంస్థలు,అన్ని వర్గాల ప్రజలు సహకరించి పాల్గొనాలని, వారికి మద్దతు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బంధు మహేందర్ కోరారు. గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోఅత్యధిక జనాభా కలిగిన బీసీ లు రిజర్వేషన్ లేక పోవటం సామాజికంగా, రాజకీయం, ఆర్థికంగా కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని, రిజర్వేషన్ అమలు జరిగితే అన్ని కులాలకు సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. విద్య వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో సమాన అవకాశాలు కలుగుతాయని దుద్దేశంతో కొందరు దీనిని కోర్టులకు వెళ్లి రాజకీయం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని దేశానికి స్వాతంత్రం వచ్చి ఎన్ని సంవత్సరాలు అయినా ఇప్పటికైనా బీసీలకు 62 శాతం రిజర్వేషన్ అమలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు ముందు సాగాలని కోరారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి పెద బోయిన కిరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, పనుల యాగయ్య, మంగళపెల్లి మల్లయ్య, చంద్రయ్య, యాకయ్య, అనిల్, కుమారస్వామి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: విధుల్లో నిర్లక్ష్యం, సమయపాలన లోపాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం ఆయన మునగాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో డిప్యూటీ తహసిల్దార్ డి. సత్యనారాయణ, ఎంపీఎస్ ఓ సంపత్, జూనియర్ అసిస్టెంట్ సునీల్ గవాస్కర్, రికార్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ లు విధులకు హాజరు కాలేదని గమనించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయ సమయం ఉదయం 10.30 దాటినా సిబ్బంది హాజరు కానందున, గైర్హాజరైన వారిని వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.అలాగే ఈ నిర్లక్ష్యంపై తహసిల్దార్ సరిత నుండి వివరణ కోరారు. హాజరు రిజిస్టర్ పరిశీలనలో మొత్తం 18 మంది సిబ్బందిలో నలుగురు ఇతర కార్యాలయాల్లో ఉపనియామకంపై పని చేస్తున్నారని, ఇద్దరు సెలవుపై ఉన్నారని, మరోకరు సర్వే పనుల్లో ఉన్నారని వెల్లడించారు. డిప్యూటీ తహసిల్దార్ సహా నలుగురు ఉద్యోగులు గైర్హాజరు అయినట్లు గుర్తించారు.సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరుకావాలని, ఒకవేళ గైర్హాజరైనా లేదా ఆలస్యంగా వచ్చినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## బ్యాంకులు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా: గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు వివిధ రుణాలపై వివిధ శాఖల అధికారులతో కలిసి బ్యాంకర్లు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొద్ది రోజులుగా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న ఉపసంహరించుకోని నిధుల వివరాలను గుర్తించి, వారి సంబంధీకులకు, బ్యాంకు నియమాలు పాటిస్తూ, ఆ నగదును అందించాలని అన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని వారు. విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు బ్యాంకుల ద్వారా అందజేసిన రుణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులకు వచ్చే ప్రజలందరికీ మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, ఎస్బిఐ ఆర్ఎం రామచంద్ర రావు, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర- తొర్రూర్: ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బ తండాలో మహాబూబాబాద్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 6వ రోజున శారీరక వ్యాయామ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక శిబిరాన్ని ఎమ్మెల్యే, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మచ్చకుర్తి అనిల్ కుమార్ సందర్శించి మాట్లాడుతూ దుబ్బ తండాలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని, విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండడం వల్ల నిస్వార్థ సేవకులుగా మారతారని అన్నారు. అవసరంలో ఉన్నవారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి మరే రంగంలో దొరకదని, సమాజం మనకేమిచ్చిందని, కాకుండా దా సమాజానికి మనం ఎంత సేవ చేశాం అనేది గొప్ప విషయమని అన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవారంగంలో రాణించాలని సూచించారు. ఇతరులకు సేవ చేయడం వల్ల మంచి గుర్తింపు లభిస్తుందని, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల వల్ల విద్యార్థుల నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని, సమగ్ర మూర్తిమత్వ వికాసం చెందుతారని తెలిపారు. సాయంత్రం వాలంటీర్ల చేత సామాజిక రుగ్మతలపై నాటికలు, పాటలు, నృత్యాల ద్వారా ప్రజలలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రూప్సి, త్రిష, నవ్య, సాగరిక, ప్రవంతి, స్పందన, దివ్య, మౌనిక ,తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ బలోపేతానికి చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: విద్యారంగ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల తెలంగాణ సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మండల తహశీల్దార్ రాఘవేందర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డిలతో కలిసి సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్ర శాలలు, విద్యుత్, లైటింగ్, పెయింటింగ్, గదులకు అవసరమైన మరమ్మతులు, ఇతర అవసరమైన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులను సూచించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం నూతన మెనూ అమలు చేస్తూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- మెదక్: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్ పల్లి గ్రామంలో కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పర్యటించారు. ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోళ్లు జరగాలని, దళ వారీగా జరిగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు వెంటనే లబ్ధిదారులకు అందేలా క్షేత్ర స్థాయిలో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.

## ఓపెన్ జిమ్‌లను కమిషనర్ పరిశీలన

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళా ఎజిఐసి ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం లిమిటెడ్ వారి సహకారంతో గతములో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లను (05) బొడ్ల లక్ష్మి నగర్ పార్క్, ద్వారకా నగర్ పార్క్, శివ దుర్గా పార్క్, చెన్న క్రాంతి కాలనీ పార్క్, రాజేష్ నగర్ పార్క్ రూ. 1 కోటి 20 లక్షల నిధులతో ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగినది. అదే విధముగా ఇప్పుడు కూడా కాలనీ వాసుల అభ్యర్థన మేరకు మరొక (05) పార్కులు జై శ్రీరామ్ కాలనీ, క్రాంతి కాలనీ, మారుతీ కాలనీ, ద్వారకా కాలనీ, రాజా శేఖర్ కాలనీ పార్కులకు సుమారు రూ. 01 కోటి 25 లక్షలతో ఏర్పాటు చేయుటకు భారత్ పెట్రోలియం లిమిటెడ్ వారు సహకారముతో మహిళ ఎస్. జి. ఓ. సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసారు. ఇట్టి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయబోవు పార్కులను లను కమీషనర్ శ్రీమతి ఎ. శైలజా, అసిస్టెంట్ ఇంజనీర్ రాకేష్ తో కలసి గురువారం ఉదయం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి బీసీల బంద్ విజయవంతం చేయండి

### గండిచెర్వు వెంకన్న గౌడ్

విశాలాంధ్ర-కోదాడ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ లకి 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు లో స్టే ఇచ్చినందుకు నిరసనగా ఈ నెల 18 న నిర్వహించే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌లో సకల జనులు పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న గౌడ్ అన్నారు. పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల లో నిర్వహించిన సమావేశంలో వెంకన్న గౌడ్ మాట్లాడుతూ బీసీలకి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని, కోర్టు లో క్లియర్ చేసిన తర్వాతనే నిర్వహించాలని అని, డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక, కులగణన లెక్క తీసిన తర్వాత మా జనాభా 56 శాతం ఉంటే కేవలం 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన కూడా కొంత మంది ఓర్వలేక పోతున్నారని అని అన్నారు. మేము ఎమ్మెల్యే, ఎమ్మెల్యే, ఎంపీ మంత్రి పదవి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పద వులు, అడుగుతున్నామా అని, కేవలం సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్ లు మాకు ఇవ్వండి ఓర్వ లేక కొంత కోర్టు లో కేసులు వేసి మా నోటికాడి ముద్దను లాగివేస్తున్నారు అని అన్నారు. ఈ దఫ్యా ఎస్ రిజర్వేషన్లు ఇస్తే మేమేమైన అడ్డుపడ్డామా అని ప్రశ్నించారు. జీఓ నెంబర్ 9 పై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో మరోసారి రిజర్వేషన్ల జోలికి ఎవ్వరు రావొద్దని, 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్ని కలు నిర్వహించాలని ఈ నెల 18 న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్ లో అందరూ పాల్గొని, ఈ బంద్ కి విద్య సంస్థలు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సంస్థలు, ఆర్టీసీ, సకల జనులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని జనార్దన్, జాతీయ నాయకులు సిరికొండ శ్రీనివాస్, మేకల లక్ష్మయ్య, సత్యనారాయణ యాదవ్, కాశయ్య గౌడ్, నాగేశ్వరరావు, కృష్ణ యాదవ్, రమేష్ గౌడ్, రవీందర్ మాదిగ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-తుంగతుర్తి: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల ఎదుగుదల, శారీరక, మానసిక వికాసం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొత్తగూడెం రైతు వేదికలో నిర్వహించిన తుంగతుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీజ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా తహసిల్దార్ దయానందం, మార్కెట్ వైస్ చైర్మన్, జిల్లా అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు సమాజంలో పోషణపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని చెప్పారు. ఐసిడిఎస్ లబ్ధిదారుల్లో గర్భిణీ స్త్రీల పోషణ స్థితిని మెరుగుపరిచినట్లయితే మన భావితరాల పిల్లలు ఆరోగ్యంగా జన్మనివ్వడం జరుగుతుందని అన్నారు. భావితరాలు పోషణ లోపం లేకుండా ఆరోగ్యవంతమైన తెలంగాణ ఏర్పడుతుందన్నారు.ఒక కుటుంబం,గ్రామం ఆరోగ్యంగా ముందుకు వెళ్లాలంటే కుటుంబంలో మహిళల పాత్ర ప్రత్యేకమని అన్నారు. అనంతరం ఆరు నెలలు పూర్తయిన పిల్లలకు అన్న ప్రాసనలు, అంగన్వాడీ పూర్వ ప్రాథమిక విద్యకి నమోదైన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి, చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు గర్భిణీలు, ఆరు నెలలు నిండిన శిశువులకు పౌష్టిక ఆహారంతో కూడిన కిట్లు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ, సూపర్‌వైజర్లు, క్లర్క్ రుస్సినా బేగం, మంగ, అనూరాధ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## బాణాసంచా దుకాణాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి : ఎస్పై

విశాలాంధ్ర - దమ్మపేట: మండలంలో ఎవరైనా దీపావళి బాణాసంచా దుకాణాలను పెట్టాలనుకుంటే పోలీస్ శాఖ అనుమతి అనివార్యమని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసుల విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని పోలీస్ శాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. దీపావళి పండుగ సమయంలో బాణాసంచా నిల్వ, తయారీ, విక్రయాలకు సంబంధిత పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరన్నారు. బాణాసంచా విక్రయిస్తున్న కొందరు దుకాణాల యజమానులను స్టేషన్ కు పిలిపించి ఎస్ఐ పలు సూచనలు చేశారు. అక్రమంగా విక్రయించే వారి పట్ల ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884 రూల్స్ సవరణ -2008 ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా మల్లేశం

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మరోసారి బస్సన్నపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పటేల్ రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురు వారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస శర్మ, జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా కోశ ధికారి పూడెం దేవరాజు వ్యవహరించారు. ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా బొంతల సత్యనారాయణ, బల్ల యాదగిరి, కోశాధికారిగా తుజాల శ్రీనివాస్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కర్రె నరేందర్, కార్యవర్గ సభ్యులుగా తుడుం పెంటయ్య, సార్లు నర్సింలు, రామచంద్ర రెడ్డి, సర్దార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా డిజి శ్రీనివాస శర్మ, పూడెం దేవరాజులను నియమించారు.

జర్నలిస్టుల హెల్త్ కార్డుల కోసం కృషి... జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు అందించే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తున్నామని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే జర్నలిస్టులకు కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు అందించేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. జర్నలిస్టుల ఏ సమస్య వచ్చిన టియుడబ్ల్యూజే అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ టియుడబ్ల్యూజే సంఘం రామాయంపేట ప్రెస్ క్లబ్ తరపున మండల పరిధిలో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో రెండో స్థానంలో నల్గొండ జిల్లా

విశాలాంధ్ర-నల్గొండబ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో రాష్ట్రవ్యాప్తంగా రెండో స్థానాన్ని దక్కించుకున్న నల్గొండ జిల్లా మరోసారి ప్రతిభ చాటుకుంది. గృహనిర్మాణంలో విశిష్టమైన ఫలితాలు సాధించినందుకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.గౌతమ్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నల్గొండ జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజకుమార్ కు ట్రోఫీని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నల్గొండ జిల్లాకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొత్తం 19,625 గృహాలు కేటాయించగా, వాటిలో 17,247 గృహాలకు మంజూరు, 13,581 గృహాల గ్రౌండ్ అయ్యాయి. వీటిలో 10,116 గృహాలు వివిధ దశల్లో ఉండగా, పలు గృహాలు పూర్తయ్యాయి.ఒకే సెప్టెంబర్ నెలలోనే 5,919 గృహాలు గ్రౌండ్ అయ్యాయి. ఇదేవిధంగా లబ్ధిదారులకు ?80 కోట్ల చెల్లింపులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఇందిరమ్మ ఇండ్ల సమీక్ష సమావేశంలో మంజూరు, గ్రౌండింగ్, చెల్లింపులు, ఫిజికల్ %ఁ% ఫైనాన్షియల్ పురోగతి, దరఖాస్తుల పరిశీలన (%ఁ1, ౨2,%3), మోడల్ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలలో నల్గొండ జిల్లా అత్యుత్తమ పనితీరు కనబరిచింది.రాష్ట్రంలో మొదటి స్థానంలో నారాయణపేట, రెండో స్థానంలో నల్గొండ జిల్లా నిలిచినట్లు గృహనిర్మాణ శాఖ వెల్లడించింది.మరిన్నీ ఇందిరమ్మ ఇళ్లను గృహ నిర్మాణ శాఖ ద్వారా నిర్మించాలన్న లక్ష్యంతో ఈ విషయంపై గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండలో గృహనిర్మాణ శాఖ పీడీ రాజకుమార్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, శాఖ సిబ్బంది కలిసి గృహనిర్మాణ శాఖ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

సంపాదకీయం

# శ్రమశక్తిని దోచుకోవడానికే!

'శ్రమ్ శక్తి నితి-2025' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే జాతీయ కార్మిక-ఉపాధి విధానం ముసాయిదాను రూపొందిం చింది. ముసాయిదా విధానాన్ని చట్టంగా మార్చేముందు ప్రజల సంప్రదింపుల కోసం విడుదల చేసింది. న్యాయమైన, సమ్మిళితమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సృష్టించడమే ఈ విధాన లక్ష్యమని మోదీ ప్రభుత్వం చెపుతోంది. కాకపోతే, ఈ ముసాయిదా విధానంలోని ప్రతి పేజీలోనూ ఏదో ఒక లోపం కన్పిస్తున్నప్పుడు, సమ్మిళిత శ్రామికశక్తిని ఇదెలా సృష్టిస్తుంది? మోదీ సర్కారు యథావిధిగా పెట్టుబడిదారీ విధానానికి అనుకూల చట్టాలను తీసుకురావాలన్న కుటిల యత్నాల్లో ఇదీ ఒకటని తేలిపోయింది. పారిశ్రామికీకరణ విస్తృతంగా జరగాలన్నది ఎన్‌డీఏ ప్రభుత్వ కర్తవ్యం. దాంతోపాటుగా 'ఉన్న శ్రమశక్తిని విస్తారంగా దోచుకోవడం', 'ఏఐ వంటి పరికరాల వాడకాన్ని పెంచడం ద్వారా అతితక్కువ మానవ వనరుల శ్రమశక్తిని ఉపయోగించు కోవడం', 'వీలైనంత మేరకు పారిశ్రామికవేత్తలకు సంతృప్తికరమైన రాయితీలు ఇవ్వడం'... వంటి ఐచ్ఛిక అంశాలను ప్రభుత్వం తన అనుబంధ కర్తవ్యాలుగా అట్టిపెట్టుకుంది. సరిగ్గా ఈ ఉద్దేశానికి అనుగుణంగానే మోదీ ప్రభుత్వ తాజా 'శ్రమ్ శక్తి నితి-2025' రూపొందింది. ఒక కోణంలో ఈ విధానం 'తీయ'గా ఉన్నట్లు అన్పిస్తుంది. కానీ శ్రామికులను దోచుకునే రహస్య ఎజెండా స్పష్టంగా కన్పిస్తోంది. లోతుగా పరిశీలిస్తే, జాతీయ కార్మిక-ఉపాధి విధానం ముసాయిదా ప్రగతిశీల లక్ష్యాలను విస్మరిస్తుంది. విమర్శకులు, ముఖ్యంగా కార్మిక సంఘాలు, విధాన విశ్లేషకులు, సామాజిక నిపుణులు ఇందులో అనేక కీలక లోపాలను గుర్తించారు. పారదర్శక ప్రక్రియలు లేకపోవడం ఈ విధానంలో ప్రధాన లోపం. నైపుణ్యత కొరవడిన కార్మికునికి ఎలాంటి భరోసా ఉండదు. ఒక నూతన సాంకేతిక ఆవిష్కరణ జరిగిన ప్పుడు, అది అందరికీ కొత్తదే. ఆ నైపుణ్యాన్ని సంబంధిత పరిశ్రమలో అనువర్తింపజేయాలంటే, అప్పటికే పనిచేస్తున్న కార్మికులు ఆ నైపుణ్యాన్ని పొందే అవకాశం ఇవ్వడం యాజమాన్య ప్రధాన కర్తవ్యం కావాలి. ఆ తర్వాతనే తత్సంబంధిత నిపుణుల భర్తీ జరగాలి. అందుకే ఈ తరహా కార్మికులను రక్షించడానికి తగినన్ని రక్షణలు ఈ విధానంలో లేవు. అదే విధంగా ఈ విధాన అమలు కూడా అనేక సవాళ్లతో కూడుకుని ఉంది. ప్రభుత్వం తన జవాబుదారీతనం నుంచి పూర్తిగా వైదొలగడం ఇంకో లోపం. అంటే ప్రభుత్వం నుంచి కార్మికులకు ఎలాంటి భరోసా ఉండదని 'శ్రమ్ శక్తి నితి' స్పష్టంగా చెపుతోంది. కార్మికుల నిర్వహణ, భర్తీ తదితరాలన్నీ కార్పొరేట్ చేతిలోనే ఉంటాయి. ఎలాంటి కార్మిక హక్కులు ఉండవు. పైగా 'శ్రమ్ శక్తి నితి' రూపకల్పనకు ముందే ప్రభుత్వం విస్తృత సంప్రదింపులు జరిపి ఉండాల్సింది. కానీ ఏకపక్ష ఉత్తర్వు తరహాలో ఈ ముసాయిదాను విడుదల చేసి కార్మిక, నిరుద్యోగ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అందుకే ఏఐటీయూసీ వంటి ప్రధాన కార్మిక సంఘాలు దీన్ని వ్యతిరేకించాయి. కార్మికుల సమస్య తలెత్తితే, యూనియన్లు, యజమానులతో సంప్రదింపుల ప్రామాణిక త్రైపాక్షిక ప్రక్రియ అనేది ఒకటుంటుంది. కానీ ఈ సూత్రాన్ని కొత్త విధానం ఉల్లంఘిస్తుంది. అంటే, కార్మికుడు ఏ మాత్రం మాట్లాడటానికి అవకాశమే లేదని అర్థమవుతోంది. ఈ విధానం రాజ్యాంగ, అంతర్జాతీయ చట్రాల పరిధిలో ఉన్నప్పటికీ, మనుస్మృతి వంటి పురాతన హిందూ గ్రంథాల నుంచి భావనలను ప్రేరేపిస్తున్నది. ఇది ఆధునిక భారత రాజ్యాంగంతో వైరుధ్యాన్ని సృష్టిస్తుందన్న వాదన ఉంది. రాజ్యాంగమనేది సమానత్వాన్ని హామీ ఇస్తుంది, కులం, మతం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. కానీ నూతన శ్రమశక్తి విధానం ఈ పరిధి నుంచి బయటకు నెడుతుంది.

కార్మికుల హక్కులు, శ్రేయస్సు బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పించుకొని, వాటిని రాష్ట్రాలు, మార్కెట్‌కు బదిలీ చేసింది. అత్యంత బలహీనమైన కేంద్ర జవాబుదారీతనానికి ఇది నిదర్శనం. సంస్కరణలను అమలు చేయడానికి రాష్ట్రాలు ప్రత్యేక మిషన్‌లను ఏర్పాటు చేయాలని ముసాయిదా చెపుతుందంటే, దానర్థం కేంద్ర ప్రభుత్వ బాధ్యతను నీరుగార్చి కార్మిక రక్షణలను బలహీనపర్చడమే. గిగ్ వర్కర్లను ఇది పూర్తిగా విస్మరించింది. ఈనాడు గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మిక రంగం విపరీతంగా విస్తరిస్తున్నది. అయినప్పటికీ, ఈ విధానంలో వారికి సంబంధించిన నిర్దిష్ట వివరాలు లేనేలేవు. గిగ్ కార్మికులకు తగినంత వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యభరోసా ఇవ్వలేకపోయింది. డోర్ డెలివరీల ప్రాముఖ్యత పెరుగుతున్న దశలో ఆ రంగానికి ఊతమిచ్చిన గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే, కొత్త కార్మిక విధానమెందుకు ఉన్నట్లు? ఇది చట్టరూపం దాల్చితే, కార్మికులకు సామాజిక భద్రత ఇంకేముంటుంది? వీరి హక్కులకు చట్టబద్ధత లేకపోతే, కనీస వేతనం ఉంటుందన్న హామీ ఇవ్వలేరు. గిగ్ ఆర్థిక వ్యవస్థలో భద్రతా ప్రమాణాలకు స్పష్టమైన, అమలు చేయగల ఫ్రేమ్‌వర్క్‌ను అందించడంలో ముసాయిదా విఫలమైంది. సురక్షితమైన పని వాతావరణాలను నిర్ధారించడం, ఉద్యోగంలో గాయాలకు పరిహారం అందించడం లేదా మహిళా గిగ్ కార్మికులను వేధింపుల నుంచి రక్షించడం కోసం స్పష్టమైన సెక్షన్లు లేవు. అన్నిటికీ మించి, వలస కార్మికులకు పేలవమైన రక్షణ ఈ విధానంలోని మరో ప్రధాన లోపం. కోవిడ్-19 మహమ్మారి సమయంలో తీవ్రంగా ప్రభావితమైన వలస కార్మికులు మళ్లీ సామాజిక వ్యవస్థ పగుళ్ల నుంచి అథఃపాతాళానికి జారిపోవచ్చు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామన్న మాట ఉన్నప్పటికీ, దీనికి నిధులు ఎలా సమకూరుతాయో చెప్పగలిగే స్పష్టమైన ఆర్థిక నమూనా లేదు. వీరికి బడ్జెట్ వనరుల కేటాయింపు ఉంటుందన్న నమ్మకం లేదు. 'లేబర్ స్టాక్' వంటి డిజిటల్ మౌలిక సదుపాయాలపై ఈ విధానం ఎక్కువగా ఆధారపడటం అసంఘటిత శ్రామిక శక్తిలో మెజారిటీ కార్మికులను ముఖ్యంగా తక్కువ డిజిటల్ అక్షరాస్యత, పరిమిత ఇంటర్నెట్ యాక్సెస్ లేదా సరైన గుర్తింపు లేకపోవడంతో మినహాయించవచ్చు. అలాగని డిజిటల్‌యేతర ప్రత్యామ్నాయాల ప్రస్తావనా లేదు. రాష్ట్రాల నియంత్రణకు ఈ విధానం మూల్యాంకన సూచిక అనే వ్యవస్థను ప్రతిపాదించింది. కాకపోతే, స్వతంత్ర పర్యవేక్షణ విధానాల స్పష్టత కొరవడింది. పారదర్శక, మూడవ పక్ష ఆడిట్‌లు లేకుండా, జవాబుదారీతనం నిర్ధారించడం సవాలు కావచ్చు. ఇక అన్నిటికీ మించి, బహుళ ప్రభుత్వ డేటాబేస్‌లను ఏకీకృత వ్యవస్థలోకి అనుసంధానించే ప్రణాళికలో భాగంగా కార్మికుల డేటాను పొందుపర్చాలన్న నిబంధన వారి డేటా భద్రత, గోప్యత విషయంలో ఆందోళన కలిగించే అంశమే. సున్నితమైన కార్మికుల డేటాను ఎవరు నియంత్రిస్తారు? ఎవరు యాక్సెస్ చేస్తారు? లేదా దుర్వినియోగాన్ని నిరోధించడానికి ఏ రక్షణ చర్యలు అమలులో ఉంటాయనే దానిపై తగినంత స్పష్టత లేదు. పేదలు, వలసదారులను అణగదొక్కేలా పెరుగుతున్న అసమానత, అసమాన పట్టణ అభివృద్ధి వ్యూహాలు వంటి కార్మిక మార్కెట్‌లోని అంతర్లీన నిర్మాణ సమస్యలను ముసాయిదా విధానం తగినంతగా పరిష్కరించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని తిరస్కరించడమే ఉత్తమం. ఇప్పటికే తీవ్ర నిరసనలు చవిచూసిన నాలుగు కార్మిక కోడ్‌లలోని వివాదాస్పద అంశాలను తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం 'శ్రమ్ శక్తి నితి-2025' ముసాయిదాను ఒక మార్గంగా చూస్తున్నదనే ఆరోపణలో వాస్తవముంది. ప్రభుత్వం నిజమైన శాసనసంస్కరణలకు ప్రాధాన్యతనివ్వకుండా, ఎంతసేపూ కార్మిక, రైతువ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చట్టాలకే ప్రాముఖ్యతనిస్తున్నదని మరోసారి రుజువైంది.

# ఇది మాయాలోకం...!

రా బావ ఏంటి ఈరోజు ఊహల్లో ఊగుతూ ఈల వేసుకుంటూ వస్తున్నావు. అది సరేగాని నేనింకా 23 సంవత్సరాలు బతకాలని ఉంది. నా కొడుకు, మనవళ్ల ఆనందం చూసినాకే మరణించాలని ఉంది. గతంలో ఇంద్ర లోకంలో అమృతం తాగి బతకాలనుకున్నంత కాలం బతికేవారట. ప్రస్తుతం ప్రభుత్వం అమ్మే మద్యం తాగి మధ్య వయస్కులే చనిపోతున్నారు. నాకు మాత్రం 2047 వరకు ఎంత ఖర్చు అయినా సరే బతికి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా మన రాష్ట్రం వెలిగే దశ చూడాలని ఉంది. అది సరేనయ్యా 2047 ఏం చూడాలని ఉంది. భలే వాడివి బావ ఒక సారా రెండు సార్లా అనేక సార్లు మన ముఖ్యమంత్రి బాబుగారు చెబుతున్న మాట వినలేదా. ప్రపంచంలోని నంబరువన్‌గా అంటే అగ్ర దేశాలైన అమెరికా, రష్యా, చైనా, జర్మనీ, జపాను వాళ్లు కూడా మన రాష్ట్రానికి క్యూ కడతారు. అప్పుడు నీకు చోటుండదు. ఏదో అనుకుని అనవసరంగా భ్రమలో పడి ఊహల్లో ఊయల వూగడం మాని కాస్త నేల మీద నిలబడి స్థిమితంగా నిలబడి ఆలోచించాలి. అయితే బాబుగారి మాట అటకెక్కడమేనా? అయినా నీ భ్రమగాని చెప్పినవి, చేసిన వాగ్దానాలు గాలికి వదలటమేగాని అమలు చేసిందెక్కడ. కాని నీవే కాదు ఈ మాయాలోకం తీరు తెలియని వారంతా నీలాగ లొట్టలేసుకుని చివరకు ఉసూరుమంటూ ఒక వేడి నిట్టూర్పు వదులుతుంటే మధ్య తరగతి వారు ఏమో ఇంకో పదేళ్లు చూద్దాం అనుకుంటే మేధావులు వారిని చూసి జాలి పడుతున్నారు. అభివృద్ధి అనే మాట గాలి కొదిలి అప్పులు పెంచి మనకు రుణ భారం పెంచుతున్నారు. నిజమేనయ్యా అసలు ఏ పార్టీ మాట నమ్మాలో తెలియడం లేదు.

అందుకేనయ్యా మనం ఇవన్నీ ఆలోచించకుండా కులమతాల చిచ్చులో నలిగిపోయేలాగా తెలివితేటలతో రాజకీయ నాయకులు వాటిని పెంచి పోషిస్తున్నారు. కులానికో నాయకుడికి పదవి కట్టపెట్టి కుల

పోషకులుగా వారిని ప్రభుత్వం పోషించి రెచ్చగొడుతోంది. ఆ మాయలోపడి వివిధ నాయకులు వారి కులాలకు న్యాయం చేయడానికి కుల గణన అవసరమంటున్నారు. ఒకవేళ కుల గణన తరువాతనైనా ఎక్కువ ప్రజలున్న కులం వారికి దామాషా ప్రకారం ఉద్యోగాలు, రాజకీయ పదవులు కోరుకుంటారు కదా. అప్పుడు తక్కువ జనాభా ఉన్న కులాల సంగతేంటి.

ప్రాథమికంగా ప్రతి మనిషికి అవసరమైన విద్య, వైద్యం ప్రతి ఒక్కరికి అందించవలసిన నైతిక బాధ్యత ప్రభుత్వానిది. అది మరచి పి-4 కు అప్పచెప్పి చేతులు దులుపుకోవడం మహా తప్పిదంగా భావించాలి. అమరావతి నిర్మాణంపైనున్న శ్రద్ధ విద్య, వైద్యంపై లేకపోవడం దురదృష్టంగా భావించాలి. ఒకపక్క జనాభా పెరగాలి. పిల్లలను ఎక్కువ మందిని కనమని బాబుగారు పదేపదే చెబుతూ వైద్యం అందించకుండా ఉన్నవారు పోతుంటే చోద్యం చూడటం భావ్యం కాదు. నేను చెప్పింది మీ కోసం మా కోసం కాదన్నట్లు నాయకులు మాత్రం కుటుంబ నియంత్రణ పాటిస్తూ ప్రజలందర్నీ పిల్లల్ని కనమని హితవు చెప్పటం చూస్తే ప్రజలు నవ్వుకుంటున్నారు. ఒకపక్క అప్పులు పెంచుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందనే ప్రకటన వింతగా ఉంది. మనిషికి కుటుంబ నిర్వహణ ఎంతో ప్రభుత్వానికి రాష్ట్ర నిర్వహణ అంతే. కుటుంబ యజమాని ముందు కూడు, గూడు గురించి ఆలోచిస్తాడు. పొట్ట నిండిన తరువాత ఇల్లు గురించి ఆలోచిస్తాడు. తన ఆదాయాన్ని బట్టి మూడు గదుల ఇల్లు నిర్మించుకుని ఆ తరువాత రెండు అంతస్థులకు పెంచుకుంటాడు. ఒకేసారి ఏడు అంతస్థుల ఇంటి గురించి ఆలోచించడు. మనిషికి ఇల్లు ఎంతో ప్రభుత్వానికి రాష్ట్రం అంతే. కాని మన ముఖ్యమంత్రి మాత్రం ప్రాథమికంగా మనిషి అవసరాలు పక్కన పెట్టి ప్రపంచంలోనే ఎక్కడా లేని రాజధాని నిర్మాణం చేస్తానంటున్నారు. పోలవరం చూపించడానికి ఫ్రీ బస్సులు నడిపారు. ఇప్పుడు ఫ్రీ బస్సుల్లో రాష్ట్రమంతా తిరగమని సోదరీమణులకు వరమిచ్చారు. ఆనాడు పోలవరం చూపమని, ఇప్పుడు ఫ్రీ బస్సులు ఇవ్వమని ఎవ్వరూ అడగలేదు. అడగకుండా ఇవ్వడమే గొప్పగా భావించాలి. కాని అడిగేవి ఏవి ఇవ్వడం లేదు. టూరిజం ద్వారా సంపాదించే ఆలోచన ఉంది. మంచిదే కాని అప్పుడు ఓట్ల కోసం ఫ్రీ అనకుండా ఉండాలి కదా. అటు జగన్ ఇటు బాబు ఎవరడిగారని సంక్షేమ పథకాలు, ఫ్రీ బస్సులు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు.

ప్రతి మనిషికి చేసుకోవడానికి పని చూపితే చాలు. పని చేసుకుని సంపాదించుకుని ఎవరి బతుకు వారు హాయిగా బతకగలరు. అంతేగాని ఓట్ల కోసం అడగక పోయినా ఈ వాగ్దానాలతో అప్పులు పెంచి అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం ధర్మం కాదు. కాస్త నేల మీద నిలబడి ఆలోచిస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుంది. ఎవరూ అడగని ఉచితాలకు స్వస్తి పలికి ప్రతి వ్యక్తికి విద్య, వైద్యం ఉచితంగా ఇచ్చి ప్రతి మనిషికి పని చూపిస్తే అంతకంటే ప్రభుత్వ పరంగా ఏమీ ఆశించరు. ఇప్పటికైనా అప్పులు పెంచకుండా ఉన్నంతలో ముఖ్య అవసరాలు తీర్చితే ప్రభుత్వాన్ని ఇంకేమి అడగరు. అంతేగాని మనిషిని ఊహల్లోకి నెట్టకుండా ఉంటే మంచిది.

సెల్: 9885569394

# అదానీ-గూగుల్ డేటా సెంటర్ మనకు ఉపయోగమా?

చలసాని శ్రీనివాసరావు

గూగుల్, అదానీ, ఎయిర్‌టెల్ కలిసి విశాఖపట్నంలో 1-గిగావాట్ మెగా డేటా సెంటర్ కాంపస్ (ఏఐ హబ్) పెడతారనే వార్తలు చూస్తే అనేక అనుమానాలు కలుగుతున్నాయి. రూ. 1.3 లక్షల కోట్లు అయిదు సంవత్సరాల్లో పెట్టుబడి పెడతారని, దీనివల్ల భారీగా ఉపాధి కల్పన జరుగుతుందని ప్రచారం హోరెత్తిస్తున్నారు. ప్రైవేటీకరణే మా లక్ష్యం అని ప్రకటించిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రత్యక్షంగా ఉద్యోగాలు డేటా సెంటర్లో ఎక్కువగా కాకపోయినా అనుబంధంగా ఎనర్జీ, టెలి రంగాలలో కలిపి మూడు వేల నుంచి 4000 మాత్రం రావచ్చని అంచనా. తర్వాత కాలంలో పరోక్షంగా అంతకంటే 42 వేల మందికి ఉపాధి కలుగుతుందనే అంచనా ఎంతవరకు నిజమో తెలియదు. అమెరికాలో, మరికొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో డేటా సెంటర్లు వద్దని పర్యావరణ పరంగా, సామాజికపరంగా నష్టమని, అన్ని ఉద్యోగాలు రావని, భారీ మొత్తంలో నీరు, విద్యుత్ అవసరం అంటున్నారు. ఈ ఒక్క సెంటర్ పెడితేనే ఐదు నుంచి ఆరు గిగావాట్లు అవసరమని అంత విద్యుత్ ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ సెంటర్ పర్యావరణానికి నష్టమని కొందరు విశ్లేషిస్తున్నారు. కానీ మొత్తం అవసరమయ్యే విద్యుత్‌లో కొంత అంటే ఒకటి నుంచి రెండు గిగావాట్లు మాత్రం సొంతంగా ఉత్పత్తి చేస్తామని, మిగతాది మన దేశ ప్రధానమంత్రి ఆప్తుడుగా ఉన్న అదానీ తీసుకొస్తారని అంటున్నారు. ఒక పక్కన విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో గత సంవత్సరంలోనే 6000 ఉద్యోగాలు మన తెలుగు బిడ్డలు కోల్పోయారు. అది వార్తల్లోకి రానివ్వకుండా వచ్చే ఏడు సంవత్సరాల్లో 3000 ఉద్యోగాలు వస్తాయని చెప్పంటే రాష్ట్రం ఏమైపోతుందో అని ఆందోళన కలుగుతోంది.

అభివృద్ధి అంటే సామాన్య మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి, వాళ్లకు ఉద్యోగాలు కల్పించటం. కూటమి ప్రభుత్వంలో ఈ లక్ష్యం కనిపించకుండా పోతోంది. అయితే ఆంధ్రప్రదేశ్‌కు డేటా సెంటర్ రావటం నైతికంగా బలం ఇస్తుంది. ప్రాజెక్టు పూర్తి అయ్యే నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పదివేల కోట్ల రూపాయలపైగా ఆదాయం వస్తుందని అంచనా. కమ్యూనికేషన్ పరంగా చెన్నై, ముంబైతో పాటు విశాఖపట్నంలో అండర్ సీ కేబుల్ ద్వారా ఇంకొక గేట్ వే వస్తుంది. ఇది తీసుకురావడంలో ఐటీ మంత్రి లోకేశ్ శక్తిని మించి కృషి చేశారనే చెప్పాలి. కానీ డేటా సెంటర్ల పైన అమెరికా లాంటి దేశాల్లో ఎలాంటి పరిస్థితి వుందో అధ్యయనం మాత్రం చేయలేదని అనిపిస్తుంది. ఐర్లాండ్‌లో డేటా సెంటర్ పెట్టాలని గూగుల్ ప్రయత్నం చేసింది. 'తమ దేశ ప్రజలంతా కలిసి వాడేంత పవర్ ఒక్క మీ డేటా సెంటర్‌కే ఇవ్వాలి, మా దేశంలో మీ డేటా సెంటర్ వద్దు' అని ఐర్లాండ్ తిరస్కరించింది. నెదర్లాండ్స్‌లో డేటా సెంటర్ పెట్టాలని మెటా ప్రయత్నం చేయగా, అక్కడి ప్రజలు వ్యతిరేకించటంతో వారి అప్లికేషన్‌ను తిరస్కరించింది నెదర్లాండ్స్ ప్రభుత్వం. పైగా దేశంలో పెద్ద డేటా సెంటర్లు పెట్టటానికి వీలులేదని ఏకంగా చట్టమే చేసింది. డెన్మార్క్ కూడా పెద్ద డేటా సెంటర్లు పెట్టటం వలన పవర్ గ్రిడ్లు దెబ్బతినటం తప్ప ఉపయోగం తక్కువ అని అనుమతులు ఇవ్వటం లేదు. లాటిన్ అమెరికా దేశాలైన చిలీ, ఉరుగ్వే, మెక్సికో దేశాల్లో డేటా సెంటర్ పెట్టాలని గూగుల్ ప్రయత్నించింది. ఎలాగోలా ఆ ప్రభుత్వాల నుంచి కొంత సానుకూలత వ్యక్తమైనప్పటికీ అక్కడి ప్రజలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేయటంతో ఈ పెద్ద కంపెనీలు ముందుకు కదలలేని పరిస్థితుల్లో ఇరుక్కున్నాయి. ఇక అమెరికాలో డేటా సెంటర్ హబ్‌గా పేరొందిన రాష్ట్రం వర్జీనియా. పవర్ గ్రిడ్ మీద పడే లోడు, పెరిగిన కరెంట్ బిల్లులు, వాటి నుంచి నిరంతరం వచ్చే ఎమిషన్స్, శబ్దాలు, విపరీతమైన నీటి వినియోగం, అవి తీసుకునే వందల ఎకరాల భూమి, ఇవన్నీ గమనించాక వాటిలో వచ్చే ఉద్యోగాల కన్నా నష్టపోయేది ఎక్కువ అని గ్రహించిన అక్కడి ప్రజలు 'నిమ్బే' (నాట్ ఇన్ మై బ్యాక్ యార్డ్) అంటూ వాటిని వ్యతిరేకిస్తున్నారు. ఏ రాజకీయ నాయకుడు అయినా వాటికి మద్దతుగా మాట్లాడితే అక్కడి ప్రజలు ఎన్నికల్లో ఓడిస్తున్నారు. ఇప్పుడు అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ కూడా వాటిని వ్యతిరేకిస్తున్నాయి. చెప్పులు, బట్టలు కూడా ఇక్కడే తయారు చేయాలని, విదేశాల్లో ఇన్వెస్ట్ చేయటానికి వీలులేదని రోజూ గొడవ చేసే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా వీటి విషయంలో మాత్రం ఏమీ అనటం లేదు. ఆ దేశాల్లో అవసరాన్ని మించి కరెంట్ ఉత్పత్తి అవుతుంది. మన మీద నీటి వనరులు ఎక్కువ. అయినా సరే డేటా సెంటర్లు పెట్టటానికి ఒప్పుకోక పోవటంతో ఈ పెద్ద కంపెనీలు సముద్రం ఒడ్డున ఉండే మూడో ప్రపంచ దేశాల వైపు చూస్తున్నాయి. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు తమ ఈ-వేస్ట్ ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాల్లో డంప్ చేస్తూ ఉంటాయి. కొంచెం అటుఇటుగా ఈ డేటా సెంటర్లు కూడా అటువంటివే! ఇక్కడ విషాదం ఏమిటంటే మన ప్రభుత్వాలు వారు అడగని రాయితీలు కూడా ఇచ్చి, లాభనష్టాలు బేరీజు వేసే అవకాశం ప్రజలకు ఇవ్వకుండా వాటికి ఎర్ర తివాచీ పరవటం!!

కడప ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో రాకుండా, విశాఖపట్నం కర్మాగారానికి సొంత గనులు ఇవ్వకుండా, అదానీ కంపెనీలకు ఇచ్చే దానికంటే భారీగా వడ్డీలు వేయటం చూస్తూనే వున్నాం. విశాఖ ఉక్కుకు కేంద్రం మొన్న ప్యాకేజీ ఇచ్చానని చెప్పి బ్యాంకుల వడ్డీలు కట్టేసి, పద్ధతి ప్రకారం నాశనం చేస్తుంటే మన ప్రభుత్వానికి నోరు రావటం లేదు. పైగా మిట్టల్ ఉక్కు ఫ్యాక్టరీ కోసం మన రాష్ట్ర ఎంపీలు కేంద్ర ఉక్కు మంత్రిని కలిసి క్యాపిటీవ్ మైన్ కేటాయించమని అడిగారంటే ప్రజల ప్రయోజనాలు ఎంతగా తుంగలోకి తొక్కుతున్నారో అర్థం అవుతుంది. ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో చాకచక్యంగా కియా ఫ్యాక్టరీ తీసుకువచ్చారు. అనంతపురంలో ఎకరా పాతికవేలు కూడా చేయని ప్రాంతాలలో భూమి ధర ఈరోజు కోట్ల రూపాయలకు చేరింది. అత్యధిక భూభాగం ఇంకా బడుగు బలహీన వర్గాలు స్థానికుల చేతుల్లోనే ఉంది. వాళ్ల పిల్లలు అత్యున్నత విద్యను అభ్యసిస్తున్నారు. జీవన స్థితిగతులు మెరుగు పడ్డాయి. మొదట్లో ఆంధ్రప్రదేశ్‌కి పన్నులు రాకపోయినా చుట్టుపక్కల ఫైనాన్షియల్ యాక్టివిటీ వల్ల రాష్ట్రానికి ఎంతో కొంత పరోక్ష ఆదాయం సమకూరుతుంది. ఇప్పుడు మాత్రం రాష్ట్రానికి నష్టం కలిగినా మోదీ చెప్పు చేతల్లో ఉన్నారనేది ఆయన ప్రతి చర్య స్పష్టం చేస్తోంది. విశాఖపట్నంలో ఈ కంపెనీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్ని వేల కోట్ల రూపాయల భూమి గట్రా ఇస్తుందో, ఎక్కడి నుంచి నీటిని సమకూరుస్తుందో, ఎన్ని దశాబ్దాలపాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలు కట్టిన పన్నులలోంచి వాళ్లకు రాయితీలు ఇవ్వాలో ఈ వివరాలు పారదర్శకంగా ప్రజలకు తెలియపరచాల్సిన అవసరం ఉంది. అయితే నేడు ఆంధ్రప్రదేశ్‌కి మాత్రం నైతికంగా ప్రచారం కోసం ఉపయోగపడుతుంది. విశాఖపట్నం ప్రపంచ మ్యాప్‌లో ఇంకా ఎత్తుకు ఎదుగుతుంది. కానీ రేపు గంగవరం పోర్టు లాగా మొత్తం ఆ గుజరాత్‌కు చెందిన కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లో బానిసలుగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని అంటే నేడు అతిశయోక్తిగా అనిపిస్తుందేమో గాని భవిష్యత్ మాత్రం ప్రమాదకరంగా ఉంటుందనే విషయం స్పష్టం. చాలా గొప్పగా అభివృద్ధి చెందే అవకాశాలని చేచేతులా పక్కనపెట్టి ఆ గుజరాత్ వ్యాపారుల కాళ్లకు నమస్కారాలు పెట్టి వాళ్ల కంపెనీలు సాధించామని చెబుతున్నారు. వాళ్ల కోసం మన ప్రజల భూములని, పన్నులని రాయితీల పేరుతో ఎందుకు ఇస్తున్నారో ఆలోచించాలి. తెలుగుజాతి బిడ్డలకు హక్కుగా రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయితీలను కూటమి ప్రభుత్వం వదిలేసింది. లాస్‌ఏంజెల్స్‌లో అగ్ని ప్రమాదానికి కారణం డేటా సెంటర్స్. నిప్పుపడితే అంతే సంగతులు. ఇప్పటికే భూతాపం. ఇది మరింత పెరుగుతుంది. కరెంటు కోతలు దారుణంగా ఉంటాయి. కారణం డేటా సెంటర్ బకాసురిడిలా కరెంటు తినేస్తుంది. ఒక్క డేటా సెంటర్ లక్ష కుటుంబాల విద్యుత్‌ను లాగేస్తుంది. బెంగళూరు, హైదరాబాద్‌లలో డేటా సెంటర్లు వెలుస్తున్నాయి. డేటా సెంటర్‌కు ఇరవై కిలోమీటర్ల దూరంలో నివాసం ఉండలేని పరిస్థితి వస్తుంది. ప్రపంచ దేశాల అనుభవాన్ని బేరీజు వేసి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

# పేదరిక నిర్మూలన విధానాలు అవశ్యం

జనక మోహనరావు దుంగ

'విశ్వగురువు'గా అవతరించడానికి భారతదేశం వేస్తున్న అడుగులు, ప్రపంచ వేదికపై సాధిస్తున్న ఆర్థిక వృద్ధి సాధిస్తే ప్రతి భారతీయుడికి గర్వకారణమే. మన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచిందని ప్రభుత్వం చెప్తోంది. అంతరిక్ష పరిశోధనలలో, సాంకేతిక రంగాలలో మన విజయాలు ప్రశంసనీయం. మెరిసే ఆకాశహర్మ్యాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, డిజిటల్ విప్లవం గురించి మనం గర్వంగా మాట్లాడుకుంటాం. అయితే, ఆర్థిక వృద్ధిలో, మన దేశంలో ఒక గణనీయమైన వర్గం ఇప్పటికీ పేదరికంలోనే జీవిస్తోంది. పేదరికం అనేది కేవలం డబ్బు లేకపోవడం మాత్రమే కాదు. అది అవకాశాల లేమి. మంచి చదువు లేకపోవడం వలన తక్కువ వేతనాలకే పనిచేయాల్సి రావడం, తద్వారా అదే పేదరికం మళ్లీ వారి పిల్లలకు సంక్రమించడం అనేది ఒక విషవలయంలా మారింది. మన దేశం గురించి మనం గొప్పగా చెప్పుకునేటప్పుడు, కడుపునిండా తిండి దొరకని బాల్యాన్ని, సరైన వైద్యం అందక బాధపడుతున్న వృద్ధులను, కూలికి వెళ్లినా కనీస అవసరాలు తీరని దినసరి కూలీలను మనం ఎలా విస్మరించగలం? "ఎన్ని కష్టాలొచ్చినా ఓర్చుకుందాం" అని ఆశగా బతికే మన సామాన్య ప్రజల నిరీక్షణ ఎప్పుడు తీరుతుంది? అభివృద్ధి సంపన్నులకు మాత్రమే పరిమితమైతే, అది అసమానతలకు ఆజ్యం పోసి సమాజ పునాదులను బలహీనపరుస్తుంది.

గత దశాబ్దంలో పేదరికాన్ని తగ్గించడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించింది అనడంలో సందేహం లేదు. బహుముఖ పేదరిక సూచీ 2015-16 నుంచి 2019-21 మధ్యకాలంలో దేశంలో దాదాపు 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పాలకులు చెప్తున్నారు. ఈ సూచీ పేదరికాన్ని కేవలం ఆదాయం లేకపోవడం కాకుండా, విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి 12 అంశాలలో ఉండే లేమిని పరిగణనలోకి తీసుకుంటుంది. గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిష్పత్తి 32.59% నుంచి 19.28%కి తగ్గగా, పట్టణ ప్రాంతాలలో ఇది 8.65% నుంచి 5.27%కి తగ్గింది. గ్రామీణ భారతదేశంలో వేగవంతమైన పురోగతి కనిపిస్తున్నప్పటికీ పట్టణ ప్రాంతాలతో పోలిస్తే పేదరికం తీవ్రత గ్రామాలలోనే అధికంగా ఉంది. అయినప్పటికీ, నివేదికలు ఆశాజనకంగా ఉన్నా, వాస్తవ సంఖ్యలు మన ముందు ఇంకా పెద్ద సవాలును ఉంచుతున్నాయి. 2023 లో విడుదలైన అంతర్జాతీయ బహుముఖ పేదరిక సూచీ ప్రకారం, భారతదేశంలో ఇప్పటికీ 23 కోట్లకు పైగా ప్రజలు బహుముఖ పేదరికంలో ఉన్నారు. అంతేకాక, ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, రోజుకు 2.15 దాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించే 'తీవ్ర పేదరికం'లో ఉన్నవారి సంఖ్య



2024 నాటికి సుమారు 12.9 కోట్లుగా ఉండవచ్చని అంచనా. ఈ గణాంకాలు చూస్తే అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే మన లక్ష్యం సాకారం కావాలంటే ఇంకా ఎంత దూరం ప్రయాణించవలసి ఉంటుందో స్పష్టమవుతుంది.త

అసమానతలు - అభివృద్ధికి అడ్డుగోడ: పేదరికం, అసమానత అనేవి ఒకే నాణేనికి రెండు వైపుల్లాంటివి. అధిక ఆర్థిక వృద్ధి, జీడీపీ వృద్ధి సాధిస్తున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందడం లేదు. దేశంలో సంపద కేంద్రీకరణ పెరిగింది. పారిశ్రామిక, సేవారంగాల వృద్ధి ఎక్కువ మందికి ఉద్యోగాలను సృష్టించినప్పటికీ, ఆ ఉద్యోగాలు ఎక్కువగా తక్కువ వేతనాలు ఇచ్చే అసంఘటిత రంగంలోనే ఉన్నాయి. దీని ఫలితంగా, పేదరికం నుంచి బయటపడిన వారు కూడా సులభంగా తిరిగి పేదరికంలోకి జారిపోయే 'దుర్బలత్వం' అనే ప్రమాదకర పరిస్థితిలో ఉన్నారు. సుమారు 18.7% మంది ప్రజలు అంటే 26 కోట్లకు పైగా బహుముఖ పేదరికానికి గురయ్యే ప్రమాదంలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించడానికి అనేక సంక్షేమ పథకాలు ఉదాహరణకు, ఉచిత రేషన్, ఆవాస్ యోజన వంటివి అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు నిస్సందేహంగా కోట్ల మందికి తాత్కాలిక ఉపశమనాన్ని ఇచ్చాయి. అయితే కేవలం తాత్కాలిక సహాయం కాకుండా పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించడానికి మూల కారణాలపై దృష్టి సారించాలి. నాణ్యమైన విద్య పేదరికం నుంచి బయటపడటానికి అత్యంత శక్తిమంతమైన సాధనం. పాఠశాలల్లో నమోదు శాతం పెంచడం మాత్రమే కాక, నాణ్యమైన బోధన అందించాలి. యువతకు మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ కల్పించాలి. వ్యవసాయ రంగం నుంచి పరిశ్రమలు, సేవల రంగానికి మారుతున్న శ్రామిక శక్తికి తగినన్ని, మెరుగైన వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు సృష్టించాలి. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా, విద్యుత్, ఇంటర్నెట్ వంటి మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాలి. ప్రతి పౌరుడికి సులభంగా, చౌకగా వైద్య సదుపాయాలు అందేలా చూడాలి. ఎందుకంటే, ఒక్క అనారోగ్య ఖర్చు కూడా ఒక పేద కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి నెట్టేయగలదు.

పేదరికం లేని భారతదేశం అనేది మనందరి ఉమ్మడి లక్ష్యం. ఇది స్పష్టమైన గణాంక విశ్లేషణ, పారదర్శక విధానాల అమలు, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలను చేర్చాలనే నిబద్ధత ద్వారానే సాధ్యమవుతుంది. పేదరికాన్ని ఒక రాజకీయ సమస్యగా కాకుండా, మానవతా సమస్యగా, దేశ అభివృద్ధికి అడ్డుకట్టగా పరిగణించాలి. ప్రతి పౌరుడు గౌరవంగా, సురక్షితంగా జీవించే హక్కును కలిగి ఉన్నాడని మనం గుర్తుంచుకోవాలి. ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరినప్పుడే, మనం నిజమైన అభివృద్ధిని సాధించినట్లు. సమానత్వం మన ఆశయం కావాలి. అది మన చర్యలలో ప్రతిబింబించాలి. ప్రతి భారతీయుడు గౌరవంగా, కడుపునిండా తిని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలిగినప్పుడే, మన 'విశ్వగురువు' కీర్తి నిజమవుతుంది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, పౌరులు అందరూ ఏకమై ఈ సమస్యను ఎదుర్కోవాలి. కేవలం దాతృత్వంతోనే పేదరికాన్ని నిర్మూలించలేం. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపే దీర్ఘకాలిక విధానాలు అవసరం. ఈ దిశగా పయనించడానికి, ప్రభుత్వాలు, పౌర సమాజం ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలి.

- 8247045230

# బీహార్ ఎన్డీఏలో లుకలుకలు

- నితీశ్ వర్సెస్ చిరాగ్
- ఎల్జేపీ స్థానాల్లో జేడీయూ అభ్యర్థులు
- ఎల్‌జేపీ స్థానాలపై హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం కన్ను

**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం రసవత్తరంగా మారింది. అధికార ఎన్‌డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారం చిచ్చురేపుతోంది. ప్రత్యేకించి జేడీయూ-ఎల్‌జేపీమధ్య పొత్తు కుదరడంలేదు. జేడీయూ తొలి జాబితాలో ఎల్‌జేపీ కోరుకున్న ఐదు స్థానాల్లో అభ్యర్థులను జేడీయూ ఖరారు చేసింది. గురువారం విడుదల చేసిన తుది జాబితాలోనూ ఆ పార్టీ కావాలనుకున్న మరో నాలుగు నియోజకవర్గాలకూ అభ్యర్థులను జేడీయూ ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఎన్డీఏ పక్షాల మధ్య పొత్తులో భాగంగా చెరో 101 స్థానాలను బీజేపీ, జేడీయూ పంచుకోగా... ఎల్‌జేపీకి 29 సీట్లను, హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం)లకు చెరో 6 సీట్లను కేటాయించడం జరిగింది. కాగా, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్‌జేపీకి కేటాయించిన సోన్‌బర్సా, మోర్వా, ఎక్మా, రాజ్‌గిర్ సీట్లలోనూ తమ అభ్యర్థులను జేడీయూ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. హిందుస్థానీ అవామ్ మోర్చా అధినేత జితన్ రాం మాంఝీ కూడా సీట్ల కేటాయింపుపై అసంతృప్తితోనే ఉన్నారు. ఆయన సైతం ఎల్‌జేపీకి కేటాయించిన రెండు సీట్లలో తమ అభ్యర్థులను ప్రకటించారు. ఇక ఆర్ఎల్ఎం తమకు మరిన్ని సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తోంది. ఎల్‌జేపీకి కేటాయించిన కొన్ని సీట్లను తాము ఆశిస్తున్నామని ఆ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహా చెబుతున్నారు. ముఖ్యంగా వైశాలి జిల్లాలోని మహువా సీటుపై ఉపేంద్ర కుష్వాహా బాగా ఆశలు పెట్టుకున్నారు. ఆ సీటులో బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించింది. ఈ క్రమంలో అసంతృప్తిగా ఉన్న ఉపేంద్ర కుష్వాహా కేంద్రమంత్రి అమిత్ షాను కలిసి చర్చలు జరిపారు. మహువా స్థానాన్ని వదులుకుంటే పార్టీ మరో ఎమ్మెల్యే సీటుతో పాటు ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా ఇస్తామని అమిత్ షా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అమిత్ షాతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఉపేంద్ర కుష్వాహా కూడా చర్చలు సానుకూలంగా జరిగినట్లు తెలిపారు. అయితే తాము పోటీ చేసే స్థానాలను కూటమిలోని మిత్రపక్షాలు ఆశిస్తుండటాన్ని చిరాగ్ తప్పుపడుతున్నారు. ఈ సంక్షోభానికి సత్వర పరిష్కారాన్ని కనుగొనేందుకు, కూటమిలోని పార్టీల మధ్య ఐక్యతను సాధించేందుకు ప్రస్తుతం జేడీయూ అగ్రనేతలతో బీజేపీ పెద్దలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నష్ట నివారణ చర్యల కోసం త్వరలోనే బీహార్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని తెలుస్తోంది.

ఎల్‌జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్ ఎన్‌డీఏ కూటమిలో కొరకరాని కొయ్యగా మారారు. కొన్ని నెలల క్రితం సీఎం నీతీశ్ పాలనపై చిరాగ్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా పోయాయన్నారు. అందుకే చిరాగ్‌ను తనకు పెద్ద సవాల్ రూపంలో జేడీయూ అధినేత, సీఎం నితీశ్ కుమార్ చూస్తున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో చిరాగ్‌కు చెందిన ఎల్‌జేపీ 135 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసింది. కానీ ఇప్పుడు ఆ పార్టీ అధికార ఎన్‌డీఏ కూటమిలో ఉంది. చిరాగ్ ప్రస్తుతం కేంద్ర మంత్రి హోదాలో ఉన్నారు. మరోవైపు సీఎం నితీశ్‌కు చెందిన జేడీయూ కూడా పటిష్ట స్థితిలోనే ఉంది. కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారుకు ప్రస్తుతం పార్లమెంటులో మెజారిటీ మార్క్ ఉందంటే అందుకు ప్రధాన కారణం జేడీయూయే. ఈ నేపథ్యంలో ఎల్‌జేపీ, జేడీయూలను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగడం తప్ప, బీజేపీ ఎదుట మరో మార్గం లేదు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని ఎల్‌జేపీకి కేటాయించిన నాలుగు అసెంబ్లీ సీట్లను అభ్యర్థులను నితీశ్ కుమార్ ప్రకటించారు. ఇక ఇదే సమయంలో ఎల్‌జేపీకి ఇచ్చిన సీట్లలో కొన్నింటిని తమకు ఇవ్వాలని హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై బీజేపీ పెద్దలు ఏం చేస్తారనేది వేచి చూడాలి.

**జేడీయూకు తలనొప్పిగా రెబల్స్**

సీఎం నితీశ్ కుమార్‌కు చెందిన జేడీయూ ఈసారి తీవ్రస్థాయిలో రెబల్స్ బెడదను ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. వివిధ అసెంబ్లీ స్థానాల్లో ఆకస్మికంగా మారిపోయిన రాజకీయ సమీకరణాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనాలు. బీహార్ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ ఈ ఏడాది ఆగస్టులో జేడీయూలో చేరారు. అయితే అసెంబ్లీ సీటుపై ఆయనకు నితీశ్ కచ్చితమైన హామీని ఇవ్వలేకపోయారు. దీంతో అశోక్ కుమార్ జేడీయూకు రాజీనామా చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని జేడీయూ నేతలు మంజిత్ సింగ్, శ్యామ్ బహదూర్ వెల్లడించారు. అసెంబ్లీ టికెట్ కేటాయింపుపై తనకు గ్యారంటీ ఇవ్వాలంటూ గోపాల్ మండల్ అనే జేడీయూ నేత సీఎం నితీశ్ నివాసం ఎదుట ధర్నాకు దిగారు. లేదంటే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన అంటున్నారు.

ఇటీవలే చాలా మంది జేడీయూ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు లాలూప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్‌జేడీ పార్టీలో చేరారు. జేడీయూ నేత, మాజీ మంత్రి జై కుమార్ సింగ్ దినారా అసెంబ్లీ స్థానాన్ని ఆశించారు.

కానీ ఆ సీటును ఉపేంద్ర కుశ్వాహాకు సీఎం నితీశ్ కేటాయించారు. దీంతో విస్మయానికి గురై జై కుమార్ సింగ్ జేడీయూకు రాజీనామా చేశారు. కొందరు ఆర్‌జేడీ ఎమ్మెల్యేలు జేడీయూలో చేరినప్పటికీ, వారికి టికెట్ల కేటాయింపుపై ప్రస్తుతం రభస జరుగుతోంది.

**కూటమిలో చీలిక?**

ఎన్డీయేలో సీట్ల సర్దుబాటు తలెత్తిన వివాదం సద్దుమణుగుతుందా? లేక అలాగే కొనసాగుతుందా? అనే విశ్లేషణలు వెలదుతున్నాయి. కూటమిలో ఏ పార్టీకి ఆశించిన సీట్లు కేటాయించకపోతే రెబల్స్ పెరిగే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంటున్నారు. ఇది అవసరమైతే మూడో కూటమికి కూడా దారితీయొచ్చని అభిప్రాయపడుతున్నారు.

# బీజేపీ, జేడీయూ అభ్యర్థుల ఎంపిక పూర్తి

**చెరి 101 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన**

**పట్నా:** బీహార్‌లో అధికార ఎన్డీఏలో కీలకపార్టీలైన బీజేపీ, జేడీయూలు సీట్ల ఒప్పందం ప్రకారం చెరి 101 స్థానాల్లో పోటీచేయనుండగా... రెండు పార్టీలు ఆయా స్థానాలకు అభ్యర్థుల ఎంపికను పూర్తిచేశాయి. బుధవారం విడుదల చేసిన తొలి జాబితాలో 57 మందికి చోటు కల్పించిన జేడీయూ... తాజా జాబితాలో మరో 44 మంది పేర్లను ప్రకటించింది. దీంతో మొత్తం 101 స్థానాలకు సీఎం నీతీశ్ కుమార్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. జేడీయూ 37 మంది ఓబీసీ, 22 మంది ఈబీసీ, జనరల్ కేటగిరీ నుంచి 22 మంది, 15 మంది ఎస్సీ, ఒక ఎస్టీ, నలుగురు ముస్లిం అభ్యర్థులకు చోటు కల్పించింది. కాగా బీజేపీ బుధవారం రాత్రి పొద్దుపోయాక 18 మంది అభ్యర్థులతో కూడిన మూడవ జాబితాను ప్రకటించింది.అంతకు ముందు 12మంది అభ్యర్థులతో రెండవ జాబితాను, మంగళవారం 71మంది అభ్యర్థులతో మొదటి జాబితాను ఆ పార్టీ ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తంగా అభ్యర్థుల సంఖ్య 101కి చేరుకుంది. తుది సీట్ల పంపిణీలో పార్టీకి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా ఉంది.

మొత్తంగా చూసినట్లయితే 16 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి సీట్లు దక్కలేదు. ఆర్జేడీ కీలక నేత తేజస్వీయాదవ్ పోటీచేస్తున్న రఘోపూర్ నుంచి బీజేపీ సతీశ్‌కుమార్ యాదవ్‌ను బరిలో నిలిపింది. ఇక ఎన్డీఏ మిత్రపక్షాలైన ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థాన్ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) చెరో ఆరు స్థానాల్లో పోటీ చేయనున్నారు. చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 29 స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ పార్టీల్లో మాంఝీ తన ఆరుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. చిరాగ్ పాశ్వాన్ 17 మంది అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. తన వాటాలో మిగిలిన 12 సీట్లకు ఎల్జేపీ అభ్యర్థులను ఆయన ఇంకా వెల్లడించలేదు. కుష్వాహా నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించగా... ఇద్దరు మిగిలి ఉన్నారు.

# 'ఇండియా' సీట్ల పంపకాలపై ప్రతిష్టంభన

**లాలూకు రాహుల్, ఖర్గే ఫోన్**

**సీట్ల ఒప్పందంపై తుది చర్చలు**

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్నప్పటికీ ప్రతిపక్ష ఇండియా సంఘటన పక్షాల మధ్య సీట్ల పంపకాల చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రధానంగా ఆర్జేడీ-కాంగ్రెస్ మధ్య సీట్ల కేటాయింపుపై ప్రతిష్టంభన నెలకొంది. ఇది ఎంతదాక వెళ్లిందంటే... బుధవారం ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ బుధవారం రాఘోపూర్ అసెంబ్లీ స్థానం నుండి నామినేషన్ దాఖలు చేయగా... రాత్రికి కాంగ్రెస్ 17మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. దీనిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే రంగంలోకి దిగారు. గురువారం వారిద్దరూ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పోటీ విషయంలో ఏదో ఒక ఒప్పందం ఖరారు చేయాలని ఇరు పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని సమాచారం. తొలి విడత పోలింగ్ జరిగే స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు మరొక రోజు (అక్టోబరు 17 వరకే) గడువు ఉంది. ఈ నేపథ్యంలో తొలివిడత పోల్ జరగనున్న సీట్ల పంపకాలను పూర్తి చేసుకొని, అభ్యర్థులను ప్రకటించాల్సిన అవసరంపై చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీలవారీగా కేటాయించే సీట్ల సంఖ్య, బలాబలాల ఆధారంగా పార్టీలకు స్థానాల కేటాయింపు అనే అంశాలపైనా రాహుల్, ఖర్గే, లాలూ చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఇండియా కూటమికి పెద్దదిక్కుగా ఉన్న కాంగ్రెస్, ఆర్జేడీలు ఐక్యంగా కలిసి నడవాల్సిన ఆవశ్యకతపైనా వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. తొలుత ఆర్జేడీ తన మిత్రపక్షం కాంగ్రెస్‌కు 52 సీట్లు ఇచ్చింది. అయితే దానిని కాంగ్రెస్ తిరస్కరించింది. కనీసం 60 నియోజకవర్గాలు కావాలని పట్టుపట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలు- ఆర్జేడీ మధ్య చర్చలు నిలిచిపోవడంతో రెండు పార్టీల జాతీయ నాయకత్వం సీట్ల ప్రతిష్టంభనను తొలగించేందుకు రంగంలోకి దిగింది. అయితే ఆర్జేడీ నేతలు కాంగ్రెస్ 61 సీట్ల డిమాండ్‌ను నెరవేర్చడానికి ముందుకు వచ్చినప్పటికీ, కొన్ని కీలక నియోజకవర్గాలపై కాంగ్రెస్ పట్టుబట్టడంతో విభేదాలు మొదలైనట్లు తెలిసింది. నర్కటియగంజ్, వాసాలిగంజ్, కహల్గావ్ స్థానాలలో పోటీ విషయంలో ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. చైన్పూర్, బచ్వారాలలో ఇదే పరిస్థితి నెలకొన్నదని సమాచారం. కాగా రాహుల్ గాంధీ తాను చేపట్టిన ఓటరు అధికార్ యాత్ర రాష్ట్రంలో తమకు అవకాశాలను పెంచుతుందని నమ్ముతూ మరిన్ని సీట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కాంగ్రెస్ 61 సీట్లతో సరిపెట్టుకునేందుకు అంగీకరించింది. ఇది 2020లో ఆ పార్టీ పోటీ చేసిన 70 సీట్ల కంటే తొమ్మిది తక్కువ. ఆ సమయంలో కాంగ్రెస్ 19 స్థానాల్లో మాత్రమే విజయం సాధించగలిగింది.

**మెజారిటీ సీట్లు ఆర్జేడీకే...**

మొత్తం మీద ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటనలో మెజారిటీ సీట్లను ఆర్‌జేడీ దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ 144 స్థానాల్లో పోటీ చేసి, 75 చోట్ల విజయఢంకా మోగించింది. ఈసారి ఆర్‌జేడీకి 75 కంటే కాస్త తక్కువగా సీట్లు దక్కొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. కాంగ్రెస్ 61 సీట్లు, ఆర్‌జేడీ 70-75 సీట్లు మినహా మిగతా వాటిని వామపక్షాలు, వీఐపీ పార్టీల మధ్య పంచనున్నారు.

# హిందూకి ఎంఐఎం టికెట్

**పట్నా:** బీహార్ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తున్న నేపథ్యంలో ఎంఐఎం పార్టీ కూడా తమ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. మొదటి జాబితాలో మొత్తం 16 జిల్లాల్లో 32 సీట్ల నుంచి పోటీ చేయనున్నట్లు చెప్పిన పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ... ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న స్థానం నుంచి హిందూ అభ్యర్థిని రంగంలోకి దింపడం చర్చనీయాంశమైంది. ఏఐఎంఐఎం ధాకా నియోజకవర్గంలో హిందూ అభ్యర్థిని మోహరించింది. రాజ్ పుత్ సామాజిక వర్గానికి చెందిన రాణా రంజిత్ సింగ్ బుధవారం నామినేషన్ వేశారు. తలపై నమాజ్ టోపీ, నుదుట బొట్టు ధరించి హిందూ, ముస్లిం కట్టుబాట్లను రెండింటినీ ప్రదర్శిస్తూ నామినేషన్ వేయడం విశేషం. ఈ సందర్భంగా.. ఐ లవ్ మొహమ్మద్... జై శ్రీరామ్... అంటూ నామినేషన్ సెంటర్ నుంచి బయటకు వచ్చాడు రంజిత్ సింగ్. నేను ఇస్లాం ను గౌరవిస్తా.. హిందూ మతాన్ని ఫాలో అవుతా.. అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. సెక్యులర్ ఓట్లను చీల్చి బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఎంఐఎం ప్రయత్నిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మహాకూటమిలో అంతర్గత కుమ్ములాటలు

**పట్నా:** ప్రతిపక్ష కూటమి మహాఘట్బంధన్‌లో అంతర్గత కుమ్ములాటలు తలెత్తినట్లు స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ బీహార్ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ విమర్శించారు. వారి కూటమిలో ఈ సమస్యలు మరింతగా ముదిరి కూటమిని బలహీనం చేస్తాయని జోస్యం చెప్పారు. వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముఖేశ్ సాహ్నీకి మద్దతుగా నిలిచారు దిలీప్ జైశ్వాల్. ప్రతిపక్ష కూటమిలో ఆయనకు సరైన గౌరవం దక్కడం లేదని ఆరోపించారు. "మహాఘట్బంధన్‌లో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయి. ఆర్‌జేడీ, కాంగ్రెస్ మధ్య టగ్ ఆఫ్ వార్ నడుస్తోంది. ఇది వారికి చాలా సహజమైన విషయం. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుంది. అందుకే ఓటర్లు ఎన్‌డీఏకు మద్దతుగా నిలుస్తున్నారు. ముఖేస్ సాహ్నీకి ప్రతిపక్ష కూటమిలో అన్యాయం జరుగుతుంది. ఆయన ఎన్‌డీఏలో ఉన్నప్పుడు ఎంతో గౌరవం దక్కింది. ఒకవేళ ముఖేస్ సాహ్నీని కాంగ్రెస్, ఆర్‌జేడీ ఇలానే అగౌరవపరిస్తే వారికే తీవ్ర నష్టం కలుగుతుంది" అన్నారు. ప్రతిపక్ష కూటమికి సంబంధించిన అనేక మాధ్యమాల్లో ముఖేశ్ సాహ్నీని కించపరిచేలా ప్రచారం చేస్తున్నారని దిలీప్ ఆరోపించారు.

## అవినీతి కేసులో డీఐజీ అరెస్టు

**న్యూఢిల్లీ:** పంజాబ్ పోలీసు శాఖలో రోపర్ రేంజ్‌కు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న హర్‌చరణ్ సింగ్ బుల్లార్‌ను గురువారం సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. మొహాలీ కార్యాలయం నుంచి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అవినీతి కేసులో హర్‌చరణ్ సింగ్ బుల్లార్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇదే కేసులో మరో ప్రైవేటు వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హర్‌చరణ్ బుల్లార్ కార్యాలయంతో పాటు ఇళ్లు, ఇతర ప్రదేశాల్లోనూ సోదాలు జరిగాయి. రోపర్ రేంజ్ డీఐజీ బుల్లార్‌ను పంచకులకు తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆయన్ను మళ్లీ వెనక్కి తీసుకువచ్చారు. ఫతేఘర్‌కు చెందిన ఓ స్క్రాప్ డీలర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చండీఘడ్‌లోని సీబీఐ అధికారులు డీఐజీని అరెస్టు చేశారు. అయితే బుల్లార్ అరెస్టు గురించి సీనియర్ పోలీసు అధికారులు ఎటువంటి విషయాన్ని వెల్లడించడం లేదు. 2024, నవంబరు 27వ తేదీన రోపర్ రేంజ్ డీఐజీగా బుల్లార్ బాధ్యతలు స్వీకరించారు. దానికి ముందు ఆయన పాటియాలా రేంజ్ డీఐజీగా చేశారు. పంజాబ్ మాజీ డీజీపీ మెహల్ సింగ్ బుల్లార్ కుమారుడే హర్‌చరన్ సింగ్ బుల్లార్. డ్రగ్ స్మగ్లింగ్ కేసులో అకాళీ నేత బిక్రం సింగ్ మంజితాను విచారించిన బృందానికి సిట్ అధిపతిగా చేశారు.

## భారత పాస్‌పోర్ట్ ర్యాంకు పతనం

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో భారత్ ర్యాంకు పడిపోయింది. తాజాగా విడుదలైన హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025లో భారత్ 85వ స్థానంలో నిలిచింది. గతేడాది 80వ స్థానంలో ఉంది. ఈసారి ఐదు స్థానాలు దిగజారడం గమనార్హం. భారత పాస్‌పోర్ట్ హోల్డర్లు ప్రస్తుతం 57 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశం ఉంది. గత ఏడాది ఈ సంఖ్య 62గా ఉండేది. ఈ జాబితా ప్రకారం, సింగపూర్ మరోసారి ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌గా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. సింగపూర్ పౌరులు 193 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. ఆ తర్వాత దక్షిణ కొరియా (190 దేశాలు) రెండో స్థానంలో, జపాన్ (189 దేశాలు) మూడో స్థానంలో నిలిచాయి. జర్మనీ, ఇటలీ, స్పెయిన్ వంటి ఐరోపా దేశాలు టాప్ ఐదులో చోటు దక్కించుకున్నాయి. ఈసారి ర్యాంకింగ్స్‌లో అమెరికాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. చరిత్రలో తొలిసారిగా అమెరికా టాప్ 10 జాబితా నుంచి బయటకు వచ్చింది. ప్రస్తుతం మలేషియాతో కలిసి 12వ స్థానంలో ఉన్న అమెరికా పౌరులు 180 దేశాలకు మాత్రమే వీసా రహిత ప్రయాణం చేయగలరు. గతేడాది అమెరికా ఏడో స్థానంలో ఉంది. పాకిస్థాన్ 103, బంగ్లాదేశ్ 100, నేపాల్ 101, శ్రీలంక 98, భూటాన్ 92వ స్థానంలో ఉన్నాయి. మారిటానియా కూడా భారత్‌తో పాటు 85వ స్థానాన్ని పంచుకుంది. భారతీయులు వీసా లేకుండా ప్రయాణించగల దేశాలలో ఇండోనేషియా, మాల్దీవులు, థాయ్‌లాండ్, శ్రీలంక, భూటాన్, కెన్యా ఉన్నాయి.

# పిల్లల మందులో పురుగులు

**భోపాల్:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఓ చిన్నారి తల్లి షాక్ తింది. ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చి ఫిర్యాదు చేసింది. దీంతో ఆ సిరప్ స్టాక్‌ను సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మొరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. కాగా, ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్‌కు గురైంది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని అదే ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మొరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను తిరిగి పంపినట్టు చెప్పారు. కాగా, కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ఔషధం నమూనాలను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపనున్నట్లు ఆమె వెల్లడించారు.

## ఫినాయిల్ తాగిన 25 మంది ట్రాన్స్‌జెండర్లు

**భోపాల్:** ట్రాన్స్‌జెండర్లు 25 మంది ఫినాయిల్ తాగిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగింది. దీంతో వాళ్లను ఆసుపత్రిలో చేర్పించారు. వీరంతా సురక్షితంగానే ఉన్నారని మహారాజా యశ్వంతరో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బసంత్ కుమార్ నింగ్వాల్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన 25 మంది తాము ఫినాయిల్ తాగినట్లు చెబుతున్నారని, బుధవారం రాత్రి ఆసుపత్రికి వచ్చారని ఓ అధికారి తెలిపారు. దేనికోసం ట్రాన్స్‌జెండర్లు ఫినాయిల్ తాగారన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు. అదనపు డిప్యూటీ కమిషనర్ రాజేశ్ దందోతియా మాట్లాడుతూ... దర్యాప్తు జరిగిన తర్వాతనే ట్రాన్స్‌జెండర్లు ఏం తాగారో తెలుస్తుందని తెలిపారు. అయితే స్థానిక ట్రాన్స్‌జెండర్ గ్రూపుల మధ్య జరిగిన వివాదం వల్ల ఈ ఘటన జరిగి ఉంటుందని ఓ అధికారి తెలిపారు. అత్యాచారాలు, వేధింపులకు నిరసనగా ట్రాన్స్‌జెండర్లు ఫినాయిల్ తాగినట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

## రూ.70 లక్షల రైల్వే సొమ్ముతో ఉద్యోగి ఉడాయింపు

**లక్నో:** రైల్వేకు చెందిన రూ.70 లక్షల డబ్బుతో ప్రైవేట్ సంస్థకు చెందిన ఉద్యోగి పారిపోయాడు. దీంతో ఆ కంపెనీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఈ సంఘటన జరిగింది. ఝాన్సీ రైల్వే డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ నుంచి డబ్బు తరలించి ఎస్‌బీఐ రైల్వే స్టేషన్ బ్రాంచ్‌లో జమ చేసే బాధ్యతను మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్నది. ఝాన్సీలోని ప్రేమ్ నగర్ ప్రాంతంలో నివసించే ఆ సంస్థ ఉద్యోగి అన్షుల్ సాహుకు ఆ పని అప్పగించారు. కాగా, ఈ నెల 10,11,12 తేదీల్లో ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో సమకూరిన రూ.69,78,642ను అన్షుల్ సాహు వసూలు చేసుకున్నాడు. అయితే రైల్వే బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా ఆ డబ్బుతో అతడు పారిపోయాడు. ఈ విషయం తెలుసుకుని రైల్వేతోపాటు ఆ ప్రైవేట్ సంస్థ అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు ఆ ప్రైవేట్ సంస్థ మేనేజర్ గౌరవ్ గార్గ్, ఝాన్సీలోని నవాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.70 లక్షల రైల్వే డబ్బుతో పారిపోయిన ఉద్యోగి అన్షుల్ సాహుకు సంబంధించిన వివరాలు, గుర్తింపు పత్రాలను పోలీసులకు అందజేశారు. నిందితుడిని పట్టుకుని ఆ డబ్బు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## అనిల్ అంబానీ సహాయకుడి అరెస్ట్

**న్యూఢిల్లీ:** అనిల్ అంబానీ సహాయకుడు, రిలయన్స్ పవర్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌కుమార్ పాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. రూ.63 కోట్ల నకిలీ బ్యాంక్ గ్యారెంటీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌కి చెందిన ఆర్థిక దర్యాప్తులో భాగంగా అరెస్ట్ జరిగిందని పేర్కొన్నాయి. కొన్ని గంటల పాటు కొనసాగిన విచారణ అనంతరం బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్న పాల్‌ను దిల్లీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఎదుట హాజరుపరిచి రెండు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఈడీ తెలిపింది. ఈ నెల 18 వరకు తదుపరి రిమాండ్‌పై కోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

## అహ్మదాబాద్‌లో 2030 కామన్‌వెల్త్ క్రీడలు

**జైశంకర్**

**న్యూఢిల్లీ:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 2030లో కామన్‌వెల్త్ క్రీడలు నిర్వహిస్తున్న విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. 2030లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రధాని మోదీ విజన్ నిదర్శనంగా పనిచేస్తుందన్నారు. అయితే 2036లో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనుకుంటున్న భారత్‌కు... కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణ ఓ ప్లాట్‌ఫామ్‌గా నిలిచే అవకాశం ఉంది. నవంబరు 26వ తేదీన స్కాట్‌లాండ్‌లోని గ్లాస్‌గోవ్‌లో జరగనున్న జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో అహ్మదాబాద్ అంశాన్ని పరిశీలించనున్నారు.

## కుల సర్వేపై నారాయణమూర్తి దంపతుల నిరాసక్తి

**బెంగళూరు:** రాజ్యసభ సభ్యురాలు, దానశీలి సుధా మూర్తి ... కర్నాటక ప్రభుత్వం నిర్వహిస్తున్న కులసర్వేలో పాల్గొనేందుకు నిరాకరించారు. సుధామూర్తి భర్త, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కూడా ఆ సర్వేలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు. తామేమీ వెనుకబడిన వర్గానికి చెందినవాళ్లం కాదని, అందుకే సర్వేలో పాల్గొనడం లేదని సుధామూర్తి తెలిపారు. ప్రత్యేకంగా స్వీయపత్రం సమర్పించారు. తమ సర్వే రిపోర్టుతో ప్రభుత్వానికి ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల కూడా కులసర్వేలో పాల్గొనడం లేదని ఆమె తెలిపారు. కర్నాటక ప్రభుత్వానికి చెందిన వెనుకబడిన తరగతుల కమిషన్.. సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వే పేరుతో కుల సర్వేను నిర్వహిస్తున్నది. సుధా మూర్తి నిర్ణయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ... సర్వేలో పాల్గొనాలని ఎవర్నీ వత్తిడి చేయడం లేదని అన్నారు. హైకోర్టు సెప్టెంబరు 25వ తేదీన ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఆప్షనల్‌గా సర్వే చేపట్టనున్నారు. ఈ నెల 19వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాల్సి ఉంది.

# దిల్లీలో క్షీణించిన గాలి నాణ్యత



**న్యూఢిల్లీ:** దేశరాజధాని దిల్లీలో గాలి నాణ్యత క్షీణించింది. రెండో రోజైన గురువారం కూడా వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) 300 దాటింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం... నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏక్యూఐ 300 మార్క్‌ని దాటింది. ఘజియాబాద్ ప్రాంతంలో అత్యధికంగా ఏక్యూఐ 339గా నమోదైంది. వసుంధర, ఇందిరాపురం ప్రాంతాల్లో 287గా, సంజయ్ నగర్‌లో 260గా ఉంది. దిల్లీలోని ఆనంద్ విహార్ ప్రాంతంలో ఏక్యూఐ లెవెల్స్ 335, వజీర్‌పూర్‌లో 337, బవానాలో 281, ముండ్కాలో 297గా ఏక్యూఐ నమోదైంది. ఇక నోయిడాలో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సెక్టార్ 125లో ఏక్యూఐ లెవెల్స్ 358గా, సెక్టార్ 116లో 334, సెక్టార్ 1లో 257, సెక్టార్ 62లో 207గా ఏక్యూఐ నమోదైంది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏక్యూఐ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఏక్యూఐ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని అర్థం. ఇక ఏక్యూఐ 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఏక్యూఐ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఏక్యూఐ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

# విశాలాంధ్ర హైదరాబాద్

## బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ప్రచారం

విశాలాంధ్ర-జూబ్లీ హిల్స్ : బోరబండ డివిజన్ బంజార నగర్, స్వరాజ్ నగర్ లలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా, సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమతో కలిసి జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతతో ఇంటింటికి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ బాకీ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ బి ఆర్ ఎస్ ప్రభుత్వం అని అలాగే అబద్ధం వరాలతో ప్రభుత్వం ఎరుపాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంకి ప్రజలు బుద్ధి చెప్తారని ముఖ్యంగా వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న ఆరు గ్యారంటీల తీర్చకపోవడం అమానుషం అని "కాంగ్రెస్ బాకీ కార్డు" లను ఇంటింటికి వెళ్లి అందజేసి, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా గుణపాఠం చెప్పాలంటే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకోవాలని కోరారు.

## తెలంగాణ బంద్‌కు ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మద్దతు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ -జేఏసీ ఇచ్చిన పిలుపు 'తెలంగాణ బంద్'కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. తిరుపతయ్య, జోనల్ కార్యదర్శి వెంకటయ్య, గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షుడు గుర్రం వసుమార్ గౌడ్ తదితరులు ఈ బంద్ సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర బంద్ కు మద్దతుగా ఈ నెల 17 తేదీన శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన కార్యక్రమాలు చేడతామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు జనాభా ప్రాతిపదికన ఇస్తున్న రిజర్వేషన్ల మాదిరిగానే బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్లో చేర్చాలని, అప్పటి వరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## జాతీయ బీసీ మహిళా జేఏసీ ఆవిర్భావం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బీసీ మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం 'జాతీయ బీసీ మహిళా జేఏసీ ఆవిర్భావం గురువారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ మహిళలు బంద్ కు సంబంధించిన గోడపత్రిక ను ఆవిష్కరించారు. ఈ జేఏసీకి చైర్మన్ గా నియమితులైన ఎం. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న జరిగే తెలంగాణ బంద్ కు మద్దతు ప్రకటించారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ఉద్యమాలకు తమ జేఏసీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని, ఈ బంద్ గ్రామ స్థాయి నుంచి మహిళలు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికే బీసీ రిజర్వేషన్లను కామారెడ్డిలో 42 శాతం ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా బీసీ మహిళలు ఉద్యమిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళలు నిర్మలా ముదిరాజ్, సాజిరా, జయశ్రీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర-కొత్తూరు: నందిగామ మండలంలోని మేకగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు మైక్రోసాఫ్ట్ వారి సహకారంతో గురువారం విద్యార్థులకు సైన్స్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లు విద్యార్థుల్లో ప్రాక్టికల్ జ్ఞానం పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అదేవిధంగా పాఠశాలకు దూర ప్రాంతాల నుండి నడిచి వచ్చే 31 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థుల చదువు మెరుగుపడేందుకు ఇవి ఎంతో మేలు చేస్తాయని అధికారులు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు శ్రీవదన, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు, కార్యదర్శి రామచందర్ నాయక్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సీనియర్ మేనేజర్ మహేశ్వరి, మేనేజర్ లక్ష్మీనారాయణ, సీనియర్ అసోసియేట్ పవిత్ర, శ్రీనివాసులు, పవన్‌కుమార్, సర్పంచ్, హేమంత్, రమేష్, మోహన్, వీడీసీ సభ్యులు రాజు ప్రెసిడెంట్, అంజనేయులు వైస్ ప్రెసిడెంట్, సాయి, కమిటీ సభ్యులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపటి బందులో పాల్గొనండి

విశాలాంధ్ర-మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈ నెల 18న 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ బహుజన కులాల చైతన్య వేదిక ద్వారా బంద్ కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. మల్కాజిగిరి నియోజక వర్గంలో ఉన్న బీసీలు అందరు కూడా ఈ బంద్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరణం గోపి, వర్మ చంద్ర శేఖర్ రావు, జనుకుంట ప్రేమ్ గౌడ్, బత్తిన నరసింహ గౌడ్, కస్తూరి నాగరాజు, జోగి శ్రీనివాస్, రాజు గౌడ్, భాస్కర్, సంపత్, పేపర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టిన చరిత్ర మోదిదే..

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్

విశాలాంధ్ర-శాపూర్ : కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదేనని, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అహర్నిశలు కృషి చేస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జిల్లా కార్యదర్శి సభ్యులు కె. ధర్మేంద్ర అధ్యక్షతన జరుగగా, బోస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం గడచిన 12ఏళ్లలో బడా కార్పొరేట్లకు 15లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను అక్రమంగా దోచి పెట్టిన నీచ చరిత్రను మూటగట్టుకున్నారని ధ్వజమెత్తారు. గతంలో బడా కార్పొరేట్ శక్తులు ప్రభుత్వంకు 37శాతం పన్ను కడితే, ఈ బీజేపీ హయాంలో దానిని 16శాతానికి తగ్గించారని, దీని కారణంగా దేశ సంపదకు 9లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆరోపించారు. బడా కుబేరులకు యథేచ్ఛగా రాయితీలు ప్రకటించి, సామాన్య జీవన పరిస్థితులను దేశ వ్యాప్తంగా దుర్భర స్థితికి మార్చిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదని వారు దుయ్యబట్టారు. మోదీ 140కోట్ల ప్రజానీకానికి ప్రధాని కాదని, ఒక శాతం ఉన్న నల్ల కుబేరులకు ప్రధానిగా మారారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను మూస్తూ, కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ ఎందుకు వేస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. అందుకే సీపీఐ జాతీయ స్థాయిలో ప్రజా లు, కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కార సాధనకు ఉద్యమాలు నిర్మిస్తుందని అన్నారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయని, వీటిని మండలాల వారీగా గుర్తించి పోరాటాలకు సిద్ధం అవుతున్నామని, అదే విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ ద్వారా పోటీలో ఉంటామని, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ప్రధాన అజెండా అని వారు అన్నారు. బీసీ బిల్లును బీజేపీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థ ద్వారా నష్టపరుస్తున్నదని, అందుకే రాష్ట్రంలో బీజేపీ నాయకులను ప్రశ్నించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.జి.సాయిలు గౌడ్,జి. దామోదర్ రెడ్డి,స్వామి, శంకర్,లక్ష్మి, కిషన్, హరినాథ్, శ్రీనివాస్, సత్యప్రసాద్, జి.కృష్ణ,నిమ్మల నర్సింహ, కౌన్సిల్ సభ్యులు దశరథ్, యాదయ్య, యాదగిరి, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబురాజు, రాములు, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

### కొలను హన్మంత్ రెడ్డి

విశాలాంధ్ర-దుండిగల్: క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమావేశం బహదూర్ పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ నందు జిల్లా పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యర్యంలో ఏఐసీసీ అబ్జర్వర్ డా.అంజలి నింబాల్కర్, టీపీసీసీ అబ్జర్వర్ సింగాపురం ఇందిరా ముఖ్య అతిథులుగా నిర్వహించారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు, కార్యకర్తల మనోభావాలతో జిల్లా అధ్యక్షుల ఎంపిక చెయ్యడం కాంగ్రెస్ పార్టీ గర్వకారణమని తెలిపారు. అదే విధంగా కార్యకర్తలు అందరూ సమిష్టిగా పని చేసి రానున్న రోజులలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి గారు, మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలం గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, మాజీ జిల్లా పరిషత్ వైస్ ప్రెసిడెంట్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు సాంబిరెడ్డి పున్నారెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, కందది శివా రెడ్డి,అవికే జేమ్స్, దమ్మని శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ తెలుగు విశ్వవిద్యాలయం నూతన ఉపాధ్యక్షుడికి సత్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో త్వరలో విద్యార్థి కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని అందుకు సన్నాహాలు చేయనున్నట్లు ఇన్చార్జి విసి గా నియమితులైన ప్రొఫెసర్ డి. మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ తెలుగు విశ్వవిద్యాలయం లో నిలిచిపోయిన అడ్మిషన్ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు చేపడతామని అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఇన్చార్జి విసిగా ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా గురువారం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానంద రావు ప్రొఫెసర్ మునిరత్నం నాయుడును అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించ బోయే విద్యార్థుల కోర్సుల ప్రవేశాలలో తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పడిన హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రాష్ట్ర విభజన అనంతరం కూడా ఆంధ్రప్రదేశ్ లో,తెలంగాణలోనూ రెండు రాష్ట్రాల్లో తన విద్యా సేవలను అందించింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ సేవలు నిలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం తో తెలుగు యూనివర్సిటీ ఏర్పాటు చేయటానికి మార్గం సుగమం అయ్యింది.ఇప్పటికే గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలోని బొమ్మూరు లో తెలుగు యూనివర్సిటీ తన కార్యకలాపాలను నిర్వహించబోతోంది.

## తుల్జా భావని భూములపై తప్పుడు ప్రచారం తగదు: యోగేందర్ నాథ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హైదరాబాద్ బేగంబజార్ శంకర్ బాగ్ తోప్ఖానాలోని తుల్జా భవాని భూముల కబ్జా గురి అవుతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ యోగేందర్ నాథ్ అన్నారు. గుడికి రాని వాళ్ళు దేవున్ని మోక్కని వారు, ఇతర పార్టీల నుండి వచ్చిన వారు గుడి కమిటీ పైన లేనిపోని అబందాలు అబద్ధాలు మాట్లాడుతున్నారని తెలిపారు. తుల్జా భవాని మాత గుడి సంబంధించిన భూములని ఆక్రమించుకుంటున్నారని, దాన్ని ఎవరు పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఇంతకుముందు సర్వే చేసినప్పుడు ఎంతైతే భూమి ఉందో ఇప్పటికీ కూడా అంతే భూమి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది దైర్యన్ని కుట్రపని... దబ్బుల ఆశకి ఈ భూములని అన్యాక్రాంతం చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొత్త కమిటీ ఆ భూములన్నిటిని కూడా తీసుకుంటుందని అన్యాక్రాంతమైన భూములు అన్నిటిని కూడా మల్లి గుడి పరిధిలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిటిని సీజ్ కూడా చేయడం జరిగిందన్నారు. ఎండోమెంట్ వారి సహాయంతో... ఈ దుష్ప్రచారం చేసే వారి వెనకాల బీఆర్ఎస్ సంబంధించిన వ్యక్తులు కొందరు ఉన్నారని, ఈ తప్పుడు ప్రచారాలను మానుకోవాలని హెచ్చరించారు. గుడి భూమి మీద అభిందాలు వేసే వారిపై లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, హరీష్ కుమార్, శ్రీనివాస్, అఖిలేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థ బలోపేతంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు

### బీసీబీ డైరెక్టర్ అంజయ్య

విశాలాంధ్ర- ఏలూరు: సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కార మార్గమని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి 2025ను సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార రంగం ప్రాధాన్యతను ప్రజల్లో ప్రచారం చేసేందుకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్వర్యంలో గురువారం ఏలూరు ఆర్ఆర్ పేటలోని శ్రీ కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో సహకార సదస్సు జరిగింది. అంజయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 13 ఏళ్లలో రెండవసారి సహకార సంవత్సరంగా ప్రకటించడం సహకార వ్యవస్థ ప్రాధాన్యతను మరింత విస్తృతం చేస్తుందన్నారు. సమాజంలో ఓవైపు కోటీశ్వరుల జాబితా పెరుగుతుంటే... మరోవైపు సామాన్యుల ఆర్థిక స్థితిగతులు దిగజారడం ఆందోళన కలిగిస్తుందని, ఈ దశలో పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు సహకార అర్బన్ బ్యాంకులు బాసటగా నిలుస్తున్నాయన్నారు. విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 5వ తేదీన కార్యకలాపాలు ప్రారంభించిన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ నేడు తెలుగు రాష్ట్రాల్లో 57 బ్రాంచ్ ల ద్వారా బహుళ రాష్ట్రాల అర్బన్ బ్యాంకుగా ప్రజలకు సేవలు అందిస్తు న్నారు. డిపాజిట్లను సభ్యులుగా చేర్చడం ద్వారా బ్యాంకు పాలకవర్గం నిర్వహణలో భాగస్వాములను చేస్తూ నూతన ఒరవడితో ముందుకు సాగుతోందన్నారు. వాణిజ్య బ్యాంకుల నుండి ఎటువంటి తోడ్పాటు లేనప్పటికి ప్రజలకు 'విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు' ప్రత్యామ్నాయ బ్యాంకుగా గుర్తింపు సాధించిందన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఈ ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి 15 బ్యాంకుల్లో విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు ఒకటిగా నిలిచిందన్నారు. సహకారంతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, సమాజ సమగ్రాభివృద్ధికి దోహదం చేసే సహకార రంగంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఏలూరు జిల్లా సహకారశాఖ అధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార సంస్థలు సమాజ ప్రగతితోపాటు సభ్యుల ఐక్యతకు దోహదపడతాయన్నారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ సహకార సంఘాలు మరింత పురోభివృద్ధి సాధిస్తూ ఐక్యరాజ్యసమితి లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ మానవాళిలో 12 శాతం మంది ప్రజలు సహకార సంస్థల్లో సభ్యులుగా ఉన్నారని, ప్రపంచంలోని 300 అతిపెద్ద సహకార సంస్థలు రూ.208 లక్షల కోట్ల టర్నోవర్‌తో 28 కోట్ల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సంపద సృష్టిలో సహకార సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. సహకారశాఖ ఏలూరు జిల్లా ఉప అధికారి కె.వెంకటేశ్వరరావు, ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు కాకినాడ జోనల్ మేనేజర్ రాఘవ్, ఏలూరు బ్రాంచ్ మేనేజర్ కొండబాబు, శ్రీ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ఏలూరు బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, ది బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏలూరు శాఖ మేనేజర్ నర్సింహం, సీనియర్ న్యాయవాది మున్నా, సీఆర్‌రెడ్డి కళాశాల రిటైర్డ్ ఉద్యోగి ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మహిళలు

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో వలసలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా గురువారం మహమూద్ ఫంక్షన్ హాల్‌లో రహమత్ నగర్ బూత్ స్థాయి మీటింగ్ సందర్భంగా ఏఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ నగర్ నుంచి సీనియర్ నాయకులు మురుసాద్యు శ్రీనగర్ కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఆదిలక్ష్మితో కలిసి కుమారి, అనిత, జలజ, రేణుక, తేజ కుమారి మొదలైన వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ శకం ముగిసింది. జూబ్లీ హిల్స్ సీటు కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయం. ప్రజాభిప్రాయం మేరకే ఉప ఎన్నిక అభ్యర్థిగా వి.నవీన్ యాదవ్ ఎంపిక, కేటీఆర్ పదేళ్ల విధ్వంస పాలనను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. మహిళలకు ఇస్తున్న ఉచిత ప్రయాణం ఎప్పుడైనా ఊహించారా, 40 లక్షల రేషన్ కార్డులు ఇచ్చి సన్న బియ్యం ఇస్తారని అనుకున్నారా, ప్రజా కష్ట కాలంలో తోడుగా ఉండే నాయకుడు కావాలని వి.నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా ప్రకటించాం. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయింది. ప్రజలకు కావల్సింది సెంటిమెంట్ కాదు, కావల్సింది అభివృద్ధి. కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారు. డ్రగ్స్ కల్చర్ తీసుకొచ్చింది కేటీఆర్ కాదా, కాంగ్రెస్ మాటకు కట్టుబడి ఉండే పార్టీ. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ. జూబ్లీ హిల్స్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే నవీన్ యాదవ్ గెలవాల్సిన అవశ్యకత ఉంది. నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీ తో గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉంది. బీసీ రిజర్వేషన్ల కోసం మూడు చట్టాలను తీసుకొచ్చాం. బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు లో తెల్చుకోమని సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కి బహుమతి నవీన్ యాదవ్ గెలుపు, పేదల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్, జూబ్లీ హిల్స్ సీటు గెలవడం ఖాయం, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, మాజీ ఎంపీ అజారుద్దీన్, స్థానిక సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పాలకమండలి కమిటీ సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మీడియా అకాడమి పాలకమండలి కమిటీ సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమి పాలక మండలి యొక్క సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం ప్రముఖ తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ దినపత్రికలలో ప్రకటన జారీ చేసినట్లు మీడియా అకాడమి కార్యదర్శి తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా పని చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జర్నలిస్టు సంఘాలు తమ ప్రతినిధులుగా ప్రతిపాదించుటకు దరఖాస్తులను పొందవచ్చని కార్యదర్శి అట్టి ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మీడియా అకాడమి వెబ్ సైట్ : https://mediaacademy. telangana. gov.in నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని లేదా నాంపల్లిలోని అకాడమి కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని కార్యదర్శి అట్టి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ సాయంత్రం 5-00 గంటల వరకు స్వయంగా కానీ లేదా అకాడమి కార్యాలయ చిరునామాకు పోస్టు ద్వారా కాని సమర్పించవలసిందిగా తెలియజేసినారు. ఇతర వివరాలకు మీడియా అకాడమి వెబ్ సైట్ https://mediaacademy.telangana.gov.in సంబంధిత ప్రకటనను డౌన్ లోడ్ చేసుకోవాలని కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-సంగారెడ్డి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు ఫ్లాగ్ డేను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లాలో గల ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు "ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్" కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. పోలీస్ ఫ్లాగ్ డే/ పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21 నుండి 31 వరకు నిర్వహించనున్న వారోత్సవాలలో భాగంగా "అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన. ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే" అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటి వరకు తీసిన 3-ఫోటోలు, తక్కువ నిడివి (3-నిమిషాలు) గల షార్ట్ ఫిల్మ్స్ మాత్రమే ఈ పోటీకి నామినేషన్లుగా పంపించాల్సి వుంటుంది. షార్ట్ ఫిలిమ్స్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 %×% 8 సైజ్ 3-ఫోటోలను పెన్ డ్రైవ్ సాఫ్ట్ కాపీ ని రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22వ తేదీలోపు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ పి.ఆర్.వో సెక్షన్ లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం పి.ఆర్.వో నెంబర్ 8712539040 కు సంప్రదించాలన్నారు.

## బూత్ కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : రహమత్ నగర్ డివిజన్ కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం, మహమూద్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, ఎంపీ %c% సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర డిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజారుద్దీన్, రహమత్ నగర్ కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి, సీనియర్ నాయకులు భవాని శంకర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని బిఆర్ఎస్ ఎదురుకోలేకనే తప్పుడు ప్రచారం చేస్తున్నదని అన్నారు. రాబోయే ఉపఎన్నికలో ప్రతి బూత్ స్థాయిలో బలమైన కట్టుదిట్టమైన వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయాలు తీసుకున్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం, ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడు నవీన్ యాదవ్ ని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోఆర్డినేటర్లు, యువత, మహిళా నాయకులు.. కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్యాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్‌లో సబ్ రిజిస్ట్రార్, వివాహముల అధికారి కార్యాలయాన్ని కమిషనర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిలు కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ జాయింట్ ఐజి మధుసూదన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట తహసీల్దారు యాదగిరి రెడ్డి, జిల్లారిజిస్ట్రార్ అధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర-మొయినాబాద్ : పశువుల్లో వచ్చేగాలికుంటు వ్యాధి నివారణకు రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని డీవీఏహెచ్ఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ .సుభాష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో పశు వైద్యాధికారిణి దేవిరెడ్డి సమక్షంలో 88 పశువులకు టీకాలు వేశారు. ఈ టీకాల కార్యక్రమాన్ని డీవీఏహెచ్ఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ .సుభాష్ సందర్శించి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్త చర్యగా ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు తదితరులున్నారు.

## మాదక ద్రవ్యాల నివారణకు ఏకం కావాలి : ట్రాఫిక్ ఎస్ఐ

విశాలాంధ్ర - భద్రాచలం : మాదకద్రవ్యాలు సమాజంలో పెద్ద రుగ్మతగా మారాయని వీటి నివారణకు ప్రజలు ముఖ్యంగా యువతరం, విద్యార్థులు ఏకం కావాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ పి.తిరుపతిరావు కోరారు. భద్రాచలం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మత్తు పదార్థాల దుష్పరిమాణాలు, నివారణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం భవిష్యత్తులో పతనం చేసే ఒక ప్రమాదమైన వ్యసనమన్నారు. ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా గంజాయి, డ్రగ్స్ తీవ్రమైన ప్రభావం చూపుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 5.6 శాతం జనాభా అంటే 185 మిలియన్ల మంది నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డి లాంటి డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అంచనాలున్నాయన్నారు. డ్రగ్స్ అక్రమ వ్యాపారంతో కొందరు రూ. కోట్లు సంపాదిస్తుంటే వాటి వాడకం వల్ల యువత తమ జీవితాలు ప్రజలు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే మానుకోవడం చాలా కష్టమన్నారు. అందుకే వీటి నివారణకు అందరం ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. జాన్ మిల్టన్, యాంటీ డ్రగ్ కోఆర్డినేటర్ బి.సుధాకర్ రావు , పోలీస్ బృందం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు, రేపు అనంత విలేకరులకు
## పునశ్చరణ తరగతులు: ఆలపాటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఆర్ మీడియా అకాడమీ అధ్వర్యంలో అనంతపురం జిల్లా గ్రామీణ విలేకరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. ఈనెల 17,18 తేదీల్లో జరిగే తరగతుల కోసం రాయదుర్గంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ తరగతులను కలెక్టర్ ఆనంద్ ప్రారంభిస్తారని చెప్పారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖులతో వివిధ అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తరగుతుల మొదటిరోజు గ్రామీణ రిపోర్టింగ్‌లో మెళకువలు, విలేకరుల నుంచి డెస్క్ ఏమి కోరుకుంటుంది అనే అంశాలపై ఆంధ్రజ్యోతి అనంతపురం ఎడిషన్ ఇంఛార్జి విజయభాస్కర్ అవగాహన కల్పిస్తారు. హైదరాబాద్‌కు చెందిన ఆంగ్ల, విదేశీ భాషల విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగాధిపతి డా.రాజారాం 'డెవలప్‌మెంట్ జర్నలిజం' గురించి బోధిస్తారు. 'కృత్రిమ మేధ'పై సీనియర్ జర్నలిస్ట్ విజయకుమార్ కుర్రా ప్రసంగిస్తారు. రెండవ రోజు 'క్రైమ్ రిపోర్టింగ్'పై ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ శ్రీశైలం రమేష్, 'పత్రికా భాష'పై సీనియర్ జర్నలిస్ట్ ఏ. రాఘవశర్మ, 'గ్రామీణ వార్తలు-ఎలక్ట్రానిక్ మీడియా' అంశంపై 99టీవీ చీఫ్ ఎడిటర్ తోట భావన్నారాయణ ప్రసంగిస్తారు. తరగతుల ముగింపు సభకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు' అని ఆలపాటి సురేశ్ వెల్లడించారు.

## వర్షాలతో అప్రమత్తత అవశ్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. నెల్లూరు జిల్లా అనంతసాగరంలో 31.7 మి.మీ, దూబగుంటలో 27.2 మి.మీ, కడపలో 28.5 మి.మీ, ప్రకాశం జిల్లా పొదిలిలో 25.5 మి.మీ వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అనంత పురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడటానికి అవకాశముంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి 35-55కిమీ వేగంతో ఈదురు గాలులు వీసే పరిస్థితులున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని విపత్తులశాఖ హెచ్చరించింది.

### నకిలీ మద్యం అమ్మకాలకు
## 'క్యూఆర్ కోడ్' అడ్డే కాదు: పోతిన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నకిలీ లిక్కర్ దందాపై కూటమి ప్రభుత్వంపై మద్యపాన ప్రియుల్లో తీవ్రమైన వ్యతిరేకత రావడంతో కంటి తుడుపు చర్యగానే బాటిళ్లపై క్యూఆర్ కోడ్ పెడుతోందని, అంటే ఇన్నాళ్లూ నకిలీ లిక్కర్ అమ్మకాలు జరిపామని ప్రభుత్వం అంగీకరించడమే అవుతుందని వైసీపీ నేత పోతిన మహేశ్ ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నకిలీ లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా జరిగేది బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల లోనే కాబట్టి నకిలీ మద్యం దోపిడీకి 'క్యూఆర్ కోడ్' అడ్డమే కాదని, లూజ్ లిక్కర్ అమ్మకాలు జరిగే అలాంటిచోట క్యూఆర్ కోడ్‌తో పనేంటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొలకలచెరువు, ఇబ్రహీంపట్నం, అనకాపల్లి, తదితర ప్రాంతాల్లో నకిలీ లిక్కర్ దందా బయటపడినప్పుడే చుట్టుపక్కల మద్యం షాపులు, బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లలో తనిఖీలు చేయడంతో పాటు లక్షల్లో శాంపిల్స్ తీసుకుని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేవారని అభిప్రాయపడ్డారు. అలాంటి కార్యక్రమాలేవీ జరగకపోవడం చూస్తుంటే ఈ దందా వెనుక కూటమి పెద్దల ప్రమేయం ఉందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయని పోతిన చెప్పారు. సీఎం చంద్రబాబుకి దమ్ముంటే నకిలీ లిక్కర్ దందాలో పట్టుబడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## కూటమి సర్కారుపై వివిధ రూపాల్లో ఆందోళనలు
### వైసీపీ యువజన నేతలతో సజ్జల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిరుద్యోగులను, యువతను మోస గించిన కూటమి ప్రభుత్వ తీరుపై వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించాలని వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ యువజన విభాగం అధ్యక్షుల సమావేశం గురువారం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, జక్కంపూడి రాజా, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంటు అన్నంరెడ్డి అదీప్ రాజ్, కారుమూరి సునీల్ కుమార్, పేర్ని కిట్టు, భూమన అభినయ్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి, యువజన విభాగం ఉపాధ్యక్షులు, పలువురు యువజన విభాగం నాయకులు హాజరయ్యారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను జక్కంపూడి రాజా మీడియాకు వివరించారు. వైసీపీ అధినేత జగన్ చెప్పినట్లుగా యువజన విభాగం కమిటీలన్నీ త్వరగా పూర్తిచేయాలని, ఈనెల 25లోగా మండలస్థాయి యువజన విభాగం అధ్యక్షుల నియా మకం పూర్తవ్వాలని సూచించారు. నవంబర్ 15లోగా మండల కమి టీలు, గ్రామ యువజన విభాగం అధ్యక్షుల నియామకాలు చేపట్టాలని, నవంబర్ 30లోగా యువజన విభాగం గ్రామ కమిటీలు పూర్తవ్వాల న్నారు. యువజన విభాగం నాయకులంతా తరచూ సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించాలని సూచించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ అందరినీ భాగస్వామ్యం చేసి... కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

# ప్రజా ప్రభుత్వంతో పేదల కలలు సాకారం: మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: పేదల కలల్ని సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ, సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ కి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు బయ్యా ప్రమీల ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ఇంటి కలను సాకారం చేస్తామని, అర్హులైన ప్రతి పేదవారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. పేదల కలల్ని సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంద న్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవనోపాధికి చిహ్నంగా నిలిచిందని మంత్రి సీతక్క అన్నారు. పేదల బాగోగుల పట్ల శ్రద్ధచూపడం అందులో భాగమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అంటేనే ప్రజా ప్రభుత్వం గుర్తుకు వస్తోందని, పేద ప్రజల కలల ఇళ్ల రూపంలో ప్రతిబింబించడానికి ఈ పథకం దోహదపడిందని మంత్రి వివరించారు. ప్రజా ప్రభుత్వమే నిజమైన రైతు%-%కూలీలకు అండగా నిలుస్తోందని అన్నారు. రైతును "రాజు"గా చూడాలనే సంకల్పంతోనే సన్నవరి వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. తొమ్మిది నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లతో రెండు లక్షల లోపు ఉన్న రైతుల రుణమాఫీ చేయడం, రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం, మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు కట్టించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే, 7 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, 17 లక్షల పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు నమోదు చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజా ప్రభుత్వమే విజయవంతంగా అమలు చేసిందని మంత్రి అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ జోడెద్దుల్లా సమపాళ్లలో ముందుకు వెళ్తున్నాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం కమిషన్‌ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదల గౌరవప్రదమైన జీవనానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలు మార్పిడి చికిత్సకు సన్నాహాలు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: తెలంగాణ ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో మోకాలు మార్పిడి చికిత్సకు సన్నాహాలు చేస్తున్నట్లు రాబోయే మూడు నెలల్లో ఈ అవకాశం ఆయా ఆసుపత్రుల్లో వస్తుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు అత్యాధునిక వైద్య సేవలు కూడా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై ఆయన సమీక్ష జరిపారు.

ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న 7 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని అన్నారు.

జూలైలో 47 సహజ ప్రసవాలు నుంచి సెప్టెంబర్ లో 74 కు చేరాయని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆసుపత్రిలో మంచి ఫలితాలు రాగా, కల్లూరు, వైరా, సత్తుపల్లి , పెనుబల్లి, మధిర ఆసుపత్రులలో ఆశించిన పురోగతి లేదని కలెక్టర్ అన్నారు. 10 మంది గైనకాలజిస్ట్ స్టాఫ్ ఉన్నప్పటికీ కేవలం 74 ప్రసవాలు మాత్రమే జరగడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు.

వైద్య విధాన పరిషత్ సంబంధించి డయాగ్నోస్టిక్ హబ్ కు పంపే పరీక్షల శాంపిల్స్ చాలా తక్కువగా నమోదు కావడానికి గల కారణాలు కలెక్టర్ ఆరా తీశారు.

అవుట్ పేషెంట్ లిస్టు 5 వేలకు పైగా ఉంటే వైద్య పరీక్షల కు పంపిన సంఖ్య 1400 మాత్రమే అన్నారు.

వైద్య పరీక్షలకు బయటకు పంపుతున్నారు ప్రచారం జరుగుతోంది అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారం రోజుల్లో వైద్య పరీక్షలకు అవసరమైన యంత్రాలన్నీ ఆసుపత్రులకు రావాలని ఆయన అన్నారు అందుకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ పంపినట్లు తెలిపారు.

కంటి శస్త్ర చికిత్సల నిర్వహణకు స్పెషల్ ఓటి నిర్మాణం తిరుమలాయపాలెంలో చేసేలా ప్రతిపాదనలు అందిస్తే మంత్రితో మాట్లాడి మంజూరు చేపిస్తానన్నారు.

ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, పాలేరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి రమేష్, సూపరింటెండెంట్లు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బంద్‌ను జయప్రదంచేయండి

### భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి : కరుడుగట్టిన మనువాద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు కలిసి పోరాడాలి. అన్ని పార్టీల సంఘాలు ప్రజాసంకల్పాదులు మేధావులు ఐక్యమై ఆర్ఎస్ఎస్ బిజెపి మనువాదులకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళన చేయాలని లేఖలో పిలుపునిచ్చారు.

ఆర్ఎస్ఎస్ బిజెపి 11 సంవత్సరాలుగా దేశంలో ఫాసిస్టు నియంత్రుత్వాన్ని అమలుజరుపు తుంది రాజ్యాంగాన్ని పక్కనే పెట్టి మనుస్మృతిని వర్ణవ్యవస్థ భావాజాలాన్ని ప్రచారం చేస్తూ కుల వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుంది.

దేశంలోని ఆదివాసి దళిత వెనుకబడిన కులాల మైనార్టీల ఆస్తిత్వాన్ని సంస్కృతిని భాషను నిరూపించే విధంగా పరిపాలన కొనసాగుతుంది. ఆర్ఎస్ఎస్ పుట్టి 100 ఏళు పూర్తయిన సందర్భంగా 100 రూపాయల నాణాన్ని పోస్టల్ స్టాంపును ప్రధాన మంత్రి విడుదల చేయడంతో స్వాతంత్ర పోరాటంలో విద్రోహక పాత్ర పోషించిన ఆర్ఎస్ఎస్‌ను అధికార పీఠ మీద అధిష్టించినట్లు స్పష్టమైందని భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ లేఖ లో పేర్కొన్నారు. ఇంకా రాబోవు కాలంలో మను వాదులకు అచ్చేదిన్ గాను. పీడిత ప్రజలకు దుర్దినాలుగా ఉంటుందని లేఖ లో పేర్కొన్నారు. ఈ స్థితిని మార్చేందుకు దేశ ప్రజలు స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలనితెలంగాణ ప్రభుత్వము ఆరు నెలల క్రితం స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ కోరుతూ శాసనసభలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపించింది తర్వాత ఒక ఆర్డినెన్స్ కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించింది ఆతదుపరి జీవో 9 విడుదల చేసింది. మనది ఫెడరల్ రాజ్యాంగం దీని ప్రకారం రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వబడ్డాయి రాష్ట్ర పరిధిలో విషయాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి చట్టాలు చేసుకునే అధికారం ఉన్నది. స్థానిక సంస్థల విషయము రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ప్రభుత్వము భూసాని వెంకటేశ్వరరావు కమిషన్ రిపోర్టు (మార్చి 2025 ) ప్రకారము జీవోను విడుదల చేసిందని సమస్యను మూలల్లోకి పోయి అర్థం చేసుకుంటే పరిష్కారము దొరుకుతుంది. ఈ సమస్యలో న్యాయమైన చిక్కులను అడ్డుపెట్టి సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నన్ని అడ్డుకోవాలని లేఖ లో కోరారు. రాజ్యాంగం ప్రకారం సమస్యను పరిష్కరించుకోవాలని అనుకున్నప్పటికీ రాజకీయ ఆర్థిక సామాజిక న్యాయాన్ని మారుతున్న పరిస్థితుల్లో ఎలా సాధించాలనేది ప్రధానంగా ఆలోచించాలి దేశంలో 30 సంవత్సరాలుగా కార్పొరేట్ అనుకూల ఆర్థిక రాజకీయ పాలసీలు

ఈ సమస్యలో న్యాయపరమైన లింకులను అడ్డుపెట్టి సమస్యని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నాలు అడ్డుకోవాలి రాజ్యాంగం ప్రకారం సమస్యలను పరిష్కరించుకోవాలి అనుకున్నప్పటికీ. రాజకీయ ఆర్థిక సామాజిక న్యాయాన్ని మారుతున్న పరిస్థితుల్లో ఎలా సాధించాలి అనేది ప్రధానంగా ఆలోచించాలి దేశంలో 30 సంవత్సరాలుగా కార్పొరేట్ అనుకూల ఆర్థిక రాజకీయ పాలసీలు అమలు జరుగుతున్నాయి. జెట్ స్పీడ్ తో ఆర్థిక విషయంలో కార్పొరేట్ అనుకూల పాలసీలను సామాజికంగా వర్ణ వ్యవస్థను తెచ్చే ప్రయత్నలను తీవ్రంగా చేస్తున్నారు.

దీని ఫలితంగా ఆర్థిక అసమనతలు సామాజిక అసమంతలు తీవ్రంగా పెరుగుతున్నాయి దీని ఫలితంగా ఎన్నో పోరాటాలు పుడుతున్నాయి ప్రజలు ఆకాంక్షల్లో భాగంగానే బీసీల రిజర్వేషన్ ముందుకు వచ్చింది. నేడు కొనసాగుతున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక పాలసీలు రద్దు చేయడానికి మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. కానీ కేంద్రంలో అనేక రాష్ట్రాల్లో తప్పుడు పద్ధతుల్లో అధికారంలోకి వచ్చిన మనువాదులు, నయాభారత్ నిర్మాణం చేయాలని ప్రజల మీద మరణకాండలో జరుపుతున్నారు.

ఈ సమస్యకు పరిష్కారంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా న్యాయపరంగా ను చట్టాన్ని తెచ్చేందుకు పోరాడాల్సి ఉంటుంది. పార్లమెంటులో చట్టం ద్వారా ఈ సమస్య పరిష్కారం ప్రధానంగా అవుతుంది కాబట్టి అన్ని పార్టీలో సంఘాలు విద్యార్థులు ప్రజాసామిక వాదులు మేధావులు కలిసి ఈ సమస్య పూర్వపరాలను ప్రజలకు అర్థం చేయించి గట్టి ప్రజాంధవులను చేపట్టడం ద్వారానే ఈ డిమాండ్ ను సాధించుకోగలుగుతామని లేఖలో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖలో పేర్కొన్నారు.

# సిట్రస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రైతుబృందం సందర్శన

నాగపూర్: మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా కేంద్రంలో ఉన్న సిట్రస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కీటక శాస్త్ర నిపుణులు నరేష్ మెశ్రం, నెటమాలజీ సైంటిస్ట్ కె.కిరణ్ కుమార్‌ను కలిసి పలు అంశాలను చర్చించారు. సిట్రస్ పరిశోధనా కేంద్రం 1985లో స్థాపించినట్లు వారు తెలిపారు ఈ కేంద్రంలో కమల, నిమ్మ, బత్తాయి, దబ్బకాయ, పంపర పనస తదితర మొక్కలను అభివృద్ధిచేసి... రైతాంగానికి అందిస్తున్నట్లు వివరించారు. యేటా సుమారు రెండు లక్షల మొక్కలకు పైగా రైతాంగానికి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. షేడు నెట్‌ల ద్వారా తాము రూపొందించి... అభివృద్ధి చేసే అంట్లు కట్టే విధానాన్ని, మొక్కల పెంపకాన్ని, పలు రకాల తోటలను ప్రతినిధి బృందానికి శాస్త్రవేత్తలు చూపించి... వివరించారు. నిమ్మ, బత్తాయి తోటలకు సోకే పేను బంక పండుఈగ, నల్లి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రకాశం జిల్లాకు చెందిన రైతు నాయకులు మన్నే సాంబశివరావు ప్రస్తావించగా... నరేష్ మిశ్రా తగు సూచనలు చేశారు. ప్రతినిధి బృందంలో రైతు సంఘం నాయకులు బాణాల రామయ్య, రైతు గాలి శ్రీనివాసరావు ఉన్నారు.

# అక్రమ నిర్మాణాల రాజ్యానికి 'అవినీతి భారతీయుడు'

- చందానగర్ సర్కిల్-21లో అవినీతి గజదొంగల పండుగ
- భవనాలే కాదు... అవినీతికీ మేడలు!
- ప్రతీ స్లాబ్‌కీ రేట్ ఫిక్స్?... ఫిర్యాదుకీ ఫీజు ఫిక్స్?!

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: భాగ్యనగర హైటెక్ హబ్‌గా పేరుగాంచిన శేరిలింగంపల్లి జోన్ ఇప్పుడు అక్రమ నిర్మాణాల రాజ్యంగా మారిపోయింది. చందానగర్ సర్కిల్-21లో ఒకరే ఒక 'భారతీయుడు' అనే టౌన్ ప్లానింగ్ అధికారి చేతిలో అవినీతి గజదొంగలు వసూళ్ల జల్సా చేస్తున్నారు. "భారతీయుడు అంటే దేశ సేవకుడు" అని అనుకున్న కాలం పోయింది. ఇక్కడి భారతీయుడు మాత్రం అవినీతి సేవకుడు! కట్టడాల మీద స్లాబు వేయాలంటే ముందు ఈయన పాకెట్‌లో నోట్లు వేయకపోతే పనీ కుదరదు.

**స్లాబ్‌కు లక్ష సర్కిల్‌కి కోట్లలో చెలామణి!**

ఏడాదిన్నర కాలంగా చందానగర్ సర్కిల్‌లో రాజుగా విరజిల్లుతున్న ఈ అధికారి చేతిలో ఏ బిల్డర్ తప్పించుకోలేదు. "స్టిల్ట్? ప్లస్ టూ" అనుమతులు ఇచ్చి "సెల్లార్ నుంచి ఆరు, ఏడు అంతస్తుల" భవనాలకూ కళ్ళు మూస్తున్నాడు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, చంద్ర నాయక్ తండాలు, సర్వే ఆఫ్ ఇండియా కాలనీలు ఎక్కడ చూసినా అక్రమ మేడలు!

జిహెచ్ఎంసీ కంటికి అవన్నీ ఎర్రగుల్లలలా కనిపిస్తున్నా చర్య మాత్రం శూన్యం. ఎందుకంటే ప్రతీ స్లాబ్‌కీ వసూలవుతున్న లక్షల్లో ప్యాకెట్లు, సూట్‌కేసుల్లో కోట్ల డీల్స్? చందానగర్ సర్కిల్ నుంచే బయల్దేరుతున్నాయట. ప్రజావాణి అంటే... ప్రజలకు కాదు, ప్యాకెట్ వాణికే ! ప్రజావాణి కార్యక్రమంలో భవన ఫిర్యాదులు గుప్పుమంటున్నా ఫలితం లేదు. ఎందుకంటే ప్రజావాణి ఆఫీసులో కూర్చొని ఫిర్యాదుదారులకే "ఫిర్యాదులు రాయొద్దు, నేను మాట్లాడిపెడతా" అంటూ సెటిల్మెంట్లు కుదుర్చుకుంటున్నాడట ఈ అధికారి. "జిహెచ్ఎంసీ అంటే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాదు గ్రేటర్ హౌజింగ్ మాఫియా కార్పొరేషన్!"ప్రభుత్వ భూములకూ అతడి పంజా! మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపైనే బిల్డింగ్ అనుమతులు జారీ అవుతున్నాయి. సర్వే నంబర్లు మార్చేసి బిల్డర్లతో డీల్స్? కుదుర్చుకుంటున్నాడట ఈ అధికారి. ప్రభుత్వ స్థలాలకూ అనుమతులు, బిల్డర్లకూ నోట్లు ఇదే ఈ 'అవినీతి భారతీయుడు' సూత్రం!

**ఏసీబీ కళ్లల్లోనూ ఇన్‌విజిబుల్ మాన్!**

ఏసీబీ, విజిలెన్స్? విభాగాలకు ఈ అధికారి బలం బాగా తెలుసునట. రాజకీయ అండదండలతో "నన్ను ఎవరు ఏం చేయలేరు" అన్న ధీమాతో వసూళ్లకు పంక్తి పెడుతున్నాడట.

**చివరి సీన్... ఎవరి చేతిలో ఎండ్?**

ఇంకా కొన్ని నెలల్లో రిటైర్ అవబోతున్నా, చివరి రోజువరకు వసూళ్ల రేసులోనే ఉన్నాడు ఈ 'భారతీయుడు'. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా జిహెచ్ఎంసీ యంత్రాంగం మాత్రం నిశ్శబ్దం. సర్కిల్ అంతా ఒక్క మాటే ౹"ప్రతీ స్లాబ్‌కీ సీన్, ప్రతీ సర్కిల్‌కీ సీక్రెట్...కానీ ఈ అవినీతి భారతీయుడు చివరికి ఎవరి చేతిలో 'కట్' అవుతాడో చూడాలి!"

## అక్రమ అరెస్టులు ఖండిస్తున్నాం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్, సి.మహేశ్, సీపీఎం జిల్లా నాయకులు నిర్మలమ్మ, అలివేలమ్మ, నగర కార్యదర్శి రాజశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమన్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, జిల్లా నాయకులు రమణ, ఆది, మాలమహానాడు నాయకులు ఓబులేసు, వెంకటేష్ తదితరులను ముందస్తు అరెస్టులు చేశారని వివరించారు. సీపీఎం కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌ను అక్రమంగా గృహనిర్బంధంలో ఉంచారన్నారు. వామపక్ష నేతల అక్రమ అరెస్టులను, గృహ నిర్బంధాలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామిక హక్కులు కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు చర్యలపై నిరసన వ్యక్తంచేశారు. 11ఏళ్ల కాలంలో రాష్ట్రానికి మోదీ ఏం ప్రయోజనం చేకూర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్రవాదులంతా ప్రభుత్వ, పోలీసు దుందుడుకు విధానాలను ఖండించాలని కోరారు.

### సీపీఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యవర్గ సభ్యులుగా యాదయ్య గౌడ్



విశాలాంధ్ర-మల్కాజిగిరి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన టి.యాదయ్య గౌడ్ బుధవారం జిల్లా సమితి సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆయన నాలుగు సార్లు మండల కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన నిబద్ధత పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయన కట్టుబడి ఉండడంతో జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ, ప్రజాసంఘాల బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తానని అన్నారు.

## పాటల ద్వారా ప్రజా పోరాటాలకు సన్నద్ధం

పెంచలయ్య ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: పాటలు, కళారూపాల ద్వారా ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయడమే ప్రజానాట్య మండలి లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య అన్నారు. నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలిలో డప్పు కళాకారుల చేరికల సభ గురువారం జరిగింది. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నెల్లూరు జిల్లా కార్యదర్శి విజయకుమార్ అధ్యక్షత వహించారు. పెంచలయ్య మాట్లాడుతూ కళారూపాల ద్వారా ప్రజా సమస్యలను ప్రజలలోకి సులువుగా తీసుకెళ్లడం ప్రజానాట్యమండలి లక్ష్యమన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలలో కళాకారులకు సంబంధించిన అంశాలేవీ లేవన్నారు. గతంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కళాకారులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందజేసి... పింఛన్లు కూడా ఇచ్చారని, కూటమి ప్రభుత్వం తిరిగి ఆ విధంగా కళాకారులను గుర్తించి కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది కళాకారులకు నెల్లూరు జిల్లా పుట్టినిల్లు అని, అటువంటి జిల్లాలో ప్రజానాట్యమండలిని మరింత బలోపేతం చేసుకునేందుకు జరుగుతున్న ప్రయత్నంలో భాగంగా ఈరోజు తల్లు సీనయ్య, మానే కొండయ్య నాయకత్వంలో అధిక సంఖ్యలో డప్పు కళాకారులు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలిలో చేరారన్నారు. కళాకారులుగా ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు మన వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కార్యక్రమాలకు పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సీపీఐ సీనియర్ నాయకులు వివేకం రామరాజు, సీహెచ్ ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ప్రజా కళాకారులతోపాటు నాయకులు లీలా మోహన్, మస్తాన్ షరీఫ్, ఆదినారాయణ, నాగేంద్ర, సునీల్, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

## పీపీపీ విధానం ఉపసంహరించండి: ఏఐఎస్ఎఫ్



విశాలాంధ్ర-ఒంగోలు: వైద్య కళాశాలల్లో పీపీపీ విధానాన్ని ఉపసంహరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయి స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఈ నెల 22 నుంచి నవంబరు 12వ తేదీ వరకు నిర్వహించే బస్సుయాత్ర జయప్రదం చేయాలంటూ గురువారం ఒంగోలు సీపీఐ కార్యాలయం లింగయ్య భవన్‌లో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఉన్న మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసి వేయబడ్డ పాఠశాలలను పున: ప్రారంభించాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఉన్నత చదువును దూరం చేసే జీవో 77 రద్దు చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించి, మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో జూనియర్ కళాశాల, నియోజకవర్గం లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కల్యాణ్, నాయకులు తాహిద్ , ఇఫ్రాజ్, లోకేష్, స్టాలిన్, సన్నీ పాల్గొన్నారు.

# కేంద్ర సహకారంతో రాష్ట్రానికి పెట్టుబడులు

## సీఎం చంద్రబాబు నాయుడు



**విశాలాంధ్ర - సచివాలయం/ కర్నూలు:** ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని, కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ డబుల్ ఇంజిన్ సర్కార్ తో ఆంధ్రప్రదేశ్ కు రెట్టింపు ప్రయోజనాలు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గురువారం కర్నూలులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, బచత్ ఉత్సవ్ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా దేశ ప్రగతి వేగాన్ని పెంచేందుకు ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. దేశ అభివృద్ధి కోసం కీలకమైన సంస్కరణలు తీసుకువచ్చారని తద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానానికి చేరుకుంటోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047కు దేశం సూపర్ పవర్ గా మారుతుందని చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా సైనిక పరంగా భారతదేశ సత్తాను ప్రపంచానికి మోదీ చాటారని అభినందించారు. ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న అమెరికా టారిఫ్ లను ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన స్వదేశీ పిలుపే తారకమంత్రం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకూ చిప్ ల నుంచి షిప్పుల వరకూ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెట్టుబడులు సాధిస్తోందని విశాఖలో ఆర్సెల్లార్ మిట్టల్, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా హబ్ వస్తోందని, నెల్లూరులో భారత్ పెట్రోలియం కార్పోరేషన్ రిఫైనరీ వస్తోందని వెల్లడించారు. జీఎస్టీ 2.0తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని, అటు వ్యాపారులు, ఇటు ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు లబ్ది కలిగించేలా సంస్కరణలు ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు త్వరలో హైకోర్టు బెంచ్ రాబోతోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.కర్నూలు బెంచ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. రాయలసీమలో స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరో స్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్ తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటితో పాటు సెమీ కండక్టర్ యూనిట్, క్వాంటం వ్యాలీ రావడానికి కారణమైన ప్రధానికి మోదీ కి సభా వేదిక నుంచి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

**పెట్టుబడులు రావాలంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

జీఎస్టీ 2.0 సంస్కరణతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని, విద్యా, వైద్యం ఖర్చుల భారం నుంచి ప్రజలకు ఊరట లభిస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆత్మ నిర్భర భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెట్టిన మోదీ కృషితో దేశంలో, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయన్నారు. గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ కి వచ్చాయని తెలిపారు. మోదీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను ముందుకు నడుపుతున్నారన్నారు. భావి తరానికి మార్గదర్శనం చేస్తున్నారని, దేశం తలెత్తుకొనేలా ఆత్మ నిర్భర్ భారత్ తీసుకువచ్చారన్నారు. మన రాష్ట్రానికి విచ్చేసి రూ. 13 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఒక్క ఓర్వకల్లు పారిశ్రామికవాడలోనే రూ. 4 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, పెట్టుబడులు రావాలం ంటే ప్రభుత్వాలపై నమ్మకం ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాలన్నారు. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

**ఏపీలో అభివృద్ధి పరుగులు: మంత్రి లోకేశ్**

కేంద్రం లో మన నమో ... రాష్ట్రంలో మన సీబీఎన్ ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌తో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కు ను కాపాడుకున్నామని, విశాఖ లో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పోలవరం పనులు వేగవంతం అయ్యాయన్నారు. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారన్నారు. భారత్ లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ కు వచ్చిందన్నారు. గూగుల్, స్పేస్ సిటీ , డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ అని లోకేశ్ తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉందన్నారు.

## రేపు 'కేఎల్' శాటిలైట్ ప్రయోగం

**విశాలాంధ్ర-తాడేపల్లి:** వినూత్నమైన పరిశోధనలతో... ఎన్నో సృజనాత్మక ఆవిష్కరణలు చేపట్టిన కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు సరికొత్త పరిజ్ఞానం, ఆలోచనలతో శాటిలైట్ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వర్సిటీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 34 మంది విద్యార్థులు రూపొందించిన మూడు రకాల శాటిలైట్లు ఈ నెల 18న ఉదయం 5.30 నుంచి 8 గంటల మధ్యలో ప్రయోగించనున్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సొంత టెక్నాలజీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన చిన్న తరహా ఉపగ్రహ ప్రయోగం చేయబోతున్నామని వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. భూమి నుంచి సుమారు 12-13 కిలోమీటర్ల ఎత్తులో ఉంటూ 800 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ వాతావరణంలో వస్తున్న మార్పులను స్ట్రాటోస్ఫెరిక్ పరిశోధన, టెలిమెట్రీ పరీక్ష ఎప్పటి కప్పుడూ పర్యవేక్షిస్తూ పరిశోధనలు చేయడానికి కేఎల్ శాట్ పేరుతో చిన్న ఉపగ్రహాన్ని ఆకాశంలోకి పంపడానికి అన్ని రకాల అనుమతులు తమకు వచ్చాయన్నారు. లాంచ్ ప్యాడ్‌గా గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాన్ని ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మిషన్‌కు పూర్వ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ డాక్టర్ కె.శరత్ కుమార్ వ్యవహరిస్తుండగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ కేసీహెచ్ శ్రీకావ్య వ్యవహరిస్తున్నారని తెలిపారు. మొత్తం ప్రాజెక్టుకు కేఎస్ఈఎఫ్ చైర్మన్ కోనేరు సత్యనారాయణ నిధులు సమకూర్చారని వివరించారు. ఉపగ్రహానికి రూపకల్పన చేసిన బృంద సభ్యులను, విద్యార్థులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పరిశోధన, అభివృద్ధి డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలు తక్షణమే వెనక్కి

### ఏఐటీయూసీ డిమాండ్

**న్యూఢిల్లీ:** కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొదుపు మొత్తాలలో 25 శాతం కనీస బ్యాలెన్స్‌గా ఉండాలనడం దారుణమన్నారు. పీఎఫ్ మొత్తాన్ని తీసుకోవాలంటే 12 నెలలు, పింఛన్ ఉపసంహరణకు 36 నెలలు ఆగాలన్న నిబంధనలు కార్మికుల కష్టాన్ని దోచుకునేలా ఉన్నాయని దుయ్యబట్టారు. రాక్షస నిబంధనలను వెంటనే ఉపసంహరించాలన్నారు. ఈపీఎఫ్ఓ డేటా ప్రకారం 87 శాతం మంది సభ్యుల ఖాతాల్లో రూ.లక్ష కంటే తక్కువగా, 50 శాతం మంది ఖాతాల్లో రూ.2 లక్షల కంటే తక్కువగా మొత్తాలు ఉన్నాయని తెలిసిందని అన్నారు. 'ఉద్యోగం ఎప్పుడు పోతుందో తెలియదు. ఉద్యోగ భద్రత-ఆదాయానికి హామీ లేదు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. విద్య-వైద్య వ్యయం భారీగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో పొదుపు మొత్తాలు ఉపసంహరించుకోవడం తప్ప సగటు జీవికి మరో మార్గం లేదు. దాచుకున్న డబ్బు తీసుకునేందుకు దీర్ఘకాలం వేచివుండాలనడం అన్యాయం. ఎవరు దాచుకున్న డబ్బుపై వారికి నియంత్రణ ఉండాలి కానీ ప్రభుత్వం దానిని కాదంటోంది. ఉద్యోగుల పొదుపు మొత్తాల నుంచి కార్పొస్ (ప్రత్యేక నిధి) ఏర్పాటుకు ప్రయత్నించడం... దోపిడీకి ఏ మాత్రం తీసిపోదు' అని అమర్‌జిత్ కౌర్ వ్యాఖ్యానించారు. సంస్కరణల పేరిట అర్థంలేని నిబంధనలను తెచ్చారని, వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త నిబంధనలు నిరుద్యోగులను శిక్షించడమే కాకుండా వారి పొదుపు మొత్తాలపై హక్కును కాదనేలా ఉన్నట్లు తెలిపారు. ఏ మాత్రం సమయం వృథా చేయకుండా ఈ నోటిఫికేషన్లు వెంటనే వెనక్కి తీసుకోవాలని సీబీటీని ఏఐటీయూసీ కోరుతోందని అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు.

# సమగ్ర ఆరెంజ్ బోర్డు ఏర్పాటు

- ఏఐకేఎస్ డిమాండ్ - రైతుల హక్కుల కోసం పోరుకు పిలుపు
- విదర్భలో ముగిసిన అఖిలభారత కమలాల సాగుదారుల సదస్సు

**అమరావతి(మహారాష్ట్ర):** ఉద్యానవన పంటలు పండించే రైతుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) పిలుపునిచ్చింది. ముఖ్యంగా కమలా పండ్ల రైతుల హక్కుల కోసం సమగ్ర బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. మహారాష్ట్రలోని అమరావతి(విదర్భ)లో ఏఐకేఎస్ మహారాష్ట్ర కిసాన్ సభ అధ్వర్యంలో శ్రీమాతోశ్రీ విమలాబాయి దేశ్‌ముఖ్ సభాగ్రిహలో నిర్వహించిన అఖిలభారత కమల పండ్ల సాగుదారుల సదస్సు-2025 ముగిసింది. ఈ సదస్సును వసంతరావ్ నాయక్ శేటి స్వావలంబన్ మిషన్ మహారాష్ట్ర అధ్యక్షుడు నితేశ్ హోలండె ప్రారంభించగా ఏఐకేఎస్ అధ్యక్షుడు రంజన్ క్షీరసాగర్ ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ బల్వంత్ రావ్ వాంఖడే (అమరావతి), అమర్ భావ్ ఖలే, న్యాయవాది ధనంజయ్ టోటే (ఆరెంజ్ ఆర్చాడిస్ట్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు), కేవీవీ ప్రసాద్ (ఏఐకేఎస్ ఆంధ్రప్రదేశ్), తుకారామ్ భస్మే (సీనియర్ కమ్యూనిస్టు నేత), న్యాయవాది హీరాలాల్ పరదేశీ (మహారాష్ట్ర కిసాన్ సభ అధ్యక్షుడు), ప్రొఫెసర్ సహేబ్‌రావ్ విధాలే, ఏఐకేఎస్ మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ సొనార్కర్ (నిర్వాహకుడు) హాజరయ్యారు.

రంజన్ క్షీరసాగర్ ప్రసంగిస్తూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, సాంకేతికతలు, ఎగుమతి-దిగుమతి విధానాల దృష్ట్యా మహారాష్ట్రలోని కమలా పండ్లు సాగుదారుల కోసం బోర్డు ఏర్పాటు అత్యవసరమన్నారు. డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల ప్రకారం 200 గ్రామాల కమలాలు తింటే శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, భారతీయులకు 65 గ్రాములు చాలన్నారు. పండ్ల వినియోగంలో దేశం 132వ స్థానంలో ఉందని తెలిపారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో, మాతాశిశు సంక్షేమ కార్యక్రమాల్లో పండ్లు చేర్చాలని డిమాండ్ చేశారు.

రైతుల్లో ఆత్మహత్యలు పెరుగుతుండటంపై హోలండె ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక మార్కెట్లతో ఆరెంజ్ రైతులకు స్థానం, కమలాలకు కనీస మద్దతు ధరను డిమాండ్ చేశారు. విదర్భాలో కమలా పండ్లను రోడ్ల మీద పారబోయడం జాతీయ వార్త కాకపోవడం దురదృష్టకరమని, రైతుల సమస్యలపై మీడియా దృష్టి పెట్టాలన్నారు.

కమలాలు సాగుచేసే రైతుల సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావిస్తానని ఎంపీ బల్వంత్‌రావ్ వాంఖడే వెల్లడించారు. మహారాష్ట్రలోని కమల పండ్ల సాగుదారులు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని ఎంపీ అమర్ ఖాలే పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ సహేబ్‌రావ్ విధాలే, అశోక్ సోనార్కర్ అఖిలభారత కిసాన్ సభ పాత్రను వివరించారు. మహారాష్ట్ర కిసాన్ సభ జిల్లా అధ్యక్షుడు సతీశ్ చౌదరి వందన సమర్పణ చేశారు. తూర్పు-పశ్చిమ విదర్భా నుంచి 250 మందికిపైగా రైతులు పాల్గొన్నారు.

**తీర్మానాలు:** వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రతి హెక్టారుకు రూ.2లక్షలు చొప్పున ఆరెంజ్ రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలి. పంట పరిశోధన, సమగ్రాభివృద్ధి విధానాన్ని రూపొందించాలి. సీ2+50శాతం ఎంఎస్‌పీ కల్పించాలి. సాగుదారుల ఆదాయం పెంపుదలకు హామీనివ్వాలి. కమలా పండ్ల మార్కెట్ ధరల ఖరారు, మార్కెటింగ్, ఎగుమతి, ప్రాసెసింగ్ కోసం విధానాలను ప్రభుత్వం నిర్ణయించాలి. పంట బీమా పథకాన్ని సమీక్షించాలి. నీటిపారుదల వసతులు, నిర్వహణ వ్యవహారాలు, సాగు విస్తీర్ణం పెంపునకు విధానం రూపొందించాలి. రైతుల్లో, ప్రజల్లో అవగాహన పెంచాలి. మండల స్థాయిలో వర్క్‌షాపులను వ్యవసాయ శాస్త్ర కేంద్రాలు, వర్సిటీలు, శాస్త్రవేత్తలు, పంటోత్పత్తుల మార్కెట్ల కమిటీలను సమన్వయంతో నిర్వహించాలి. సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ల పత్రాలు అందజేయాలి. సరైన సమయాల్లో ఇతర ఉద్యాయనవన పంటల సాగుదారులతో కలిసి శాసనసభలు, పార్లమెంటు ఎదుట ఆందోళనలతో ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాలి.

## మెడికల్ కాలేజీల్లో పీపీపీని వ్యతిరేకిస్తూ 19న రాష్ట్ర సదస్సు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి మార్చడాన్ని నిరసిస్తూ, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన, దళిత, బహుజన, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల నేతృత్వంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఐక్యకార్యచరణ కోసం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును ప్రభుత్వ పూర్వ స్పెషల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ ప్రారంభిస్తారని, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సభాధ్యక్షత వహిస్తారని చెప్పారు. వక్తలుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.తులసిరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేయస్ లక్ష్మణరావు, జైభీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## మోదీ సభకు వెళుతూ యువకుడి మృతి

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు:** ప్రధాని మోదీ సభకు వెళ్లే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కర్నూలు జిల్లాలో జరిగింది. మునగాలపాడుకు చెందిన అర్జున్ (18) మోదీ సభకు వెళ్లేందుకు జనసేన జెండాను ఇనుప పైపుకు తగిలించుకొని బయల్దేరాడు. మార్గమధ్యంలో నన్నూరు టోల్ ప్లాజా వద్ద జెండా పెట్టివున్న ఇనుప పైపు విద్యుత్ తీగలను తాకింది. దీంతో అర్జున్‌కు కరెంట్ షాక్ తగిలింది. హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. అర్జున్ మొదటి నుంచి పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని. పవన్ వస్తున్నందునే సభకు వెళ్లాడని అర్జున్ తల్లిదండ్రులు మద్దిలేటి మల్లి, రాణి వెల్లడించారు. అర్జున్ తమకు ఏకైక సంతానమంటూ కన్నీరుమున్నీరయ్యారు.

## ఆనందంగా ఉంది: ఏపీ పర్యటనపై మోదీ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఏపీలో పర్యటించడం తనకెంతో ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరిశ్రమలను, పౌరులను శక్తిమంతం చేసేలా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కనెక్టివిటీని పెంచే కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. 'శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీర్వాదం పొందడం అదృష్టంగా భావిస్తున్నా. ఏపీ స్వాభిమాన సంస్కృతి భూమి.. విజ్ఞాన శాస్త్రం.. ఆవిష్కరణల కేంద్రం కూడా. స్వచ్ఛశక్తి నుంచి సంపూర్ణ శక్తి ఉత్పత్తి వరకు భారత్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా మల్టీమోడల్ మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామాల నుంచి నగరాలు, నగరాల నుంచి పోర్టుల వరకు అనుసంధానంపై దృష్టి పెట్టాం. భారత్, ఆంధ్రప్రదేశ్ వేగం, సామర్థ్యాన్ని ప్రపంచం చూస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై కేంద్రం మౌనం

**న్యూఢిల్లీ:** రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపేస్తామని భారత్ తనకు హామీ ఇచ్చిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. భారత వినియోగదారుల ప్రయోజనాల మేరకే ఇంధన ఎంపికల్లో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'చమురు, గ్యాస్ దిగుమతి చేసుకొనే దేశాల్లో భారత్ ముఖ్యమైనది. ప్రస్తుత అస్థిర పరిస్థితుల్లో వినియోగదారుల ప్రయోజనాలకే భారత్ ప్రాధాన్యం ఇస్తుంది. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యంతోనే ఉన్నాయి. స్థిరమైన ఇంధన ధరలు, సురక్షితమైన సరఫరాలను నిర్ధారించడమే మా ప్రధాన లక్ష్యాలు. అంతర్జాతీయంగా ఇంధన ధరలు స్థిరంగా ఉండటంతో పాటు సరఫరా గొలుసులు విస్తరించడానికే మేం ప్రాధాన్యం ఇస్తాం' అని పేర్కొన్నారు. అమెరికా నుంచి చమురు కొనుగోళ్ల విషయంపైనా ఆయన మాట్లాడారు. భారత్ తన ఇంధన దిగుమతులను విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. గత దశాబ్దకాలంలో ఇందులో పురోగతి వచ్చిందన్నారు. దీనిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే, రష్యా చమురు కొనుగోళ్ల గురించి, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోదీ హామీ గురించి భారత్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

**భారత ఆర్థిక వ్యవస్థకు మా చమురు కీలకం: రష్యా**

మరోవైపు, ట్రంప్ వ్యాఖ్యలపై రష్యా కూడా స్పందించింది. తమ చమురు దిగుమతులు భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని ఇక్కడి రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు. రెండుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, అది నమ్మకం అనే దృఢమైన పునాదిపై ఆధారపడి ఉందని తెలిపారు. తాము భారత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ముందుకుసాగుతున్నామని చెప్పారు. భారత్-అమెరికా సంబంధాల్లో తాము ఎలాంటి జోక్యం చేసుకోబోమన్నారు. భారత్‌తో తమ దీర్ఘకాల సంబంధాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ట్రంప్ అంటే మోదీకి భయం: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును ఇకపై ఆపేస్తామని ప్రధాని నరేంద్రమోదీ తనకు హామీ ఇచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం స్పందించారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడ్డారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన అనేక ప్రశ్నలు సంధించారు. 'రష్యా చమురు భారత్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయించుకొని ప్రకటించడానికి అనుమతి ఇస్తున్నాం. పదేపదే తిరస్కరణలు ఎదురైనా అభినందన సందేశాలు పంపుతున్నాం. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నాం. ఈజిప్టులోని షర్మ్-ఎల్ షేక్‌లో సోమవారం గజా శాంతి ఒప్పందం జరిగింది. ఆ కార్యక్రమానికి ప్రధాని హాజరుకాలేదు. ఆపరేషన్ సిందూర్ గురించి ట్రంప్ పదేపదే చేస్తోన్న ప్రకటనలను విభేదించడం లేదు' అని రాహుల్ గాంధీ తన ఎక్స్‌లో ప్రశ్నలు సంధించారు.

## ప్యాలియేటివ్ కేర్‌లో పీజీకి అనుమతి

### రాష్ట్రంలో ఇదే తొలిసారి: మంత్రి సత్యకుమార్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆరోగ్య రంగంలో మరో మైలురాయి నమోదైంది. విశాఖపట్నంలోని హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రి& చికిత్సా కేంద్రంలో ప్యాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)లో పీజీ డిగ్రీ ప్రారంభానికి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతిచ్చారు. ఈ కోర్సు తొలిసారిగా ప్రారంభం కానుంది. ప్రారంభ దశలో నాలుగు పీజీ సీట్లు ఉంటాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, తీవ్ర నొప్పితో బాధపడేవారికి ఉపశమనాన్ని కల్పించడమే ప్యాలియేటివ్ కేర్. కేన్సర్ వంటి వ్యాధులతో బాధపడేవారి జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఇది కీలకం. ఆధునిక సమగ్ర చికిత్సా విధానాలను విస్తరింపజేయడానికి ముందుకొచ్చిన హోమీ బాబా కేన్సర్ సెంటర్ నిర్వాహకులను మంత్రి సత్యకుమార్ అభినందించారు. కొన్ని నెలల క్రితం గైనికాలజికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ విభాగాల్లో నాలుగేసి పీజీ సీట్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.అత్యాధునిక వైద్య విద్యావకాశాలు రాష్ట్రంలో మరింత విస్తరించనున్నాయని సత్యకుమార్ వెల్లడించారు.

## నాలుగో భార్యకు భరణం ఇవ్వండి

**అలహాబాద్:** 'మీ నాలుగో భార్యకు ప్రతినెలా రూ.30 వేలు చెల్లించండి' అని అలహాబాద్ హైకోర్టు సమాజ్ వాద్ పార్టీ ఎంపీ మొహిబ్బుల్లా నద్వీని ఆదేశించింది. భరణం క్రమం తప్పకుండా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. రాంపూర్ ఎంపీ నద్వీ తన నాలుగో భార్య నుంచి విడిపోయే విషయంపై ఆగ్రాలోని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఎంపీ తరఫు న్యాయవాది వాదిస్తూ... ఇది వైవాహిక వివాదానికి సంబంధించిన విషయమన్నారు. దీనిని సామరస్యంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశం నద్వీకి ఉందని న్యాయస్థానానికి తెలిపారు. దీంతో సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు అవకాశం ఇస్తున్నట్లు జస్టిస్ సుభాష్ చంద్రశర్మ తెలిపారు. సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం ఇచ్చారు. నద్వీ రూ.55 వేలు డిపాజిట్ చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రతినెలా రూ.30 వేలు ఆయన భార్యకు భరణంగా చెల్లించాలన్నారు. ఈ చెల్లింపులు చేయడంలో లేదా మధ్యవర్తిత్వం విఫలమైతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

## పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి

### ఏఐవైఎఫ్ డిమాండ్

**విశాలాంధ్ర-కాకినాడ:** రాష్ట్రవ్యాప్తంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కే శ్రీనివాసులు, వై బాబీ డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ ఆర్టీవో కార్యాలయం ఆవరణలో ఏఐవైఎఫ్ అధ్వర్యంలో నిర్వహించిన చర్చా గోష్ఠి లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. కాకినాడలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని కూలి పనికి కూడా పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి పనులు చేయించడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని స్థానికులను గుర్తించి స్థానిక యువతకు 75% ఉద్యోగ అవకాశాలు లేక ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటుతో పాటు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. తక్షణమే నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి మోదీ... జీఎస్టీ తగ్గించానని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు తిరిగి గొప్పలు చెప్పుకుంటున్నారని దానివల్ల సామాన్య ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. అసలు ప్రజలపై జీఎస్టీ భారాలు మోపిందే మోదీ అని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కాకినాడ జిల్లా నాయకులు ఎం వీరబాబు, గోనెల నాగభూషణం, మైఖేల్, దుర్గా, లోవరాజు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.